


ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
27-6-'56



పారవశ్యము

ఫొటో: గోపాలకృష్ణన్—మద్రాసు



"బీబీకా మఖ్బరా" (ఔరంగాబాదు)

ఫోటో: [illegible]

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 50
సంచిక 43
27.6-56

దుర్ముఖ జ్యేష్ఠ బహుళ చతుర్థి బుధవారం

విషయానుక్రమణిక

★

★ ★

బొంబాయి, పంజాబ్ రాష్ట్రాలలో ఆందోళన

బొంబాయి నగరంపై మహారాష్ట్రలో జరుగుతున్న తీవ్రాందోళన తగ్గే సూచన కనబడడంలేదు. బొంబాయి నగరాన్ని అయిదేళ్ళవరకూ కేంద్రపరిపాలనలో ఉంచాలనీ, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు శమించి, శాంతివాతావరణం ఏర్పడిన తరువాత నగర భవిష్యత్తును నిర్ణయించడం సులభసాధ్యమవుతుందని కాంగ్రెసు అధిష్ఠానవర్గం అభిప్రాయపడుతోంది.

ఈ అభిప్రాయంతో సంయుక్త మహారాష్ట్రవాదులూ, మహారాష్ట్ర కాంగ్రెసులోని ప్రముఖులూ కూడా ఏకీభవించడం లేదు. బొంబాయిని సంయుక్త మహారాష్ట్రంలోనే చేర్చివేయాలని వీరు ఆందోళన చేస్తున్నారు. ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలను విలీనం చేయడానికి నిశ్చయించి అన్ని పక్షాలకూ సంతృప్తికరంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వం బొంబాయి నగర విషయంలో అన్ని పక్షాలకూ ఆమోదయోగ్యమైన నిర్ణయం చేయలేక పోయింది. అయిదేళ్ళవరకూ బొంబాయిని కేంద్రపాలితంగా ఉంచడంగాని, ఆ తరువాతకూడా దాని భవిష్యత్తును సందిగ్ధంలో ఉంచడంగాని మహారాష్ట్ర నాయకులు అంగీకరించే అవకాశం గోచరించడంలేదు. తెలంగాణా విషయంలో కూడా ఇదేవిధమైన పేచీ వచ్చే సూచన కనబడగా, కేంద్రప్రభుత్వం రాజనీతిజ్ఞతతో ఆ సమస్యను పరిష్కారం చేసింది. అదేవిధంగా బొంబాయి సమస్యను కూడా పరిష్కరించడం అవసరం. బొంబాయి విషయం నిర్ణయించడానికి రెండేళ్ళ వ్యవధి చాలదని, అయిదేళ్ళ వ్యవధి కావాలని ప్రధాని నెహ్రూ ప్రకటించారు. ప్రస్తుతం తీవ్రరూపం దాల్చిన మహారాష్ట్ర ఆందోళన, అసంతృప్తి రెండేళ్ళలో తగ్గకపోయిన పక్షంలో, అయిదేళ్లలోనైనా తగ్గుతాయని ఆశించడం కష్టం. భాషాప్రాతిపదికపై రాష్ట్ర పునర్విభజన జరగాలనే ఆందోళన పూర్వపు బ్రిటిష్ ప్రభుత్వమూ, జాతీయ ప్రభుత్వమూ ఎంత నిర్లక్ష్యం చేయజూచినా, ఎంత అణచివేయజూచినా అంతకంతకూ తీవ్రమైందే తప్ప తగ్గలేదు. ప్రజలలో అధిక సంఖ్యాకుల ఆమోదంపొందని ఏ ఆందోళనా ఎంతకాలంగడచినా సమసిపోదు.

బొంబాయినిర్ణయాన్ని గూర్చి మహారాష్ట్రలలో బయలుదేరిన అసంతృప్తి మహారాష్ట్ర కాంగ్రెసును కూడా వ్యాపించింది. అది కాంగ్రెసుసంస్థ ఐకమత్యానికే భంగం కలిగించేటట్లు కనబడుతున్నది. అందుచేత బొంబాయి నగరాన్ని గూర్చి కేంద్రప్రభుత్వం అసందిగ్ధమైన సముచిత నిర్ణయం చేయడం అత్యవసరమవుతున్నది.

పంజాబులో పరిస్థితి వేరు. మొదటినుండీ పంజాబు మతసంఘర్షణలకు పేరు పడినది. దేశ విభజన సందర్భంలో హిందూ ముస్లిమ్ సంఘర్షణ తీవ్రరూపం దాల్చింది. ఇప్పుడు ఆ సంఘర్షణ స్థానంలో హిందూ సిక్కు సంఘర్షణలు బయలుదేరాయి. కేవలం మతావేశాలమీద సాగుతున్న అకాలీ, మహాపంజాబ్ ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సాకుచేసుకుని పరస్పరం సంఘర్షిస్తున్నాయి. ఆంధ్ర తెలంగాణాల విషయంలో ప్రాంతీయ సంఘములను స్థాపించడానికి నిశ్చయించినట్లే, పునర్నిర్మించబడిన పంజాబు రాష్ట్రానికి కూడా ఉభయవర్గాల హక్కుల రక్షణకుగాను ప్రాంతీయ సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిశ్చయించింది. మహాపంజాబ్ సమితి ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజాస్వామికంగా ఆందోళన చేయడం బదులు అల్లర్లను, కొట్లాటలను ప్రోత్సహిస్తోంది. ప్రాంతీయ సంఘ స్థాపన నిర్ణయం మార్చుకోనేదిలేదని, ఉభయ పక్షాలు అంగీకరించి సూచనలేవైనా చేస్తే వాటిని తప్పక పరిశీలిస్తామని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. పంజాబ్ విషయంలో ఇంతకంటె సముంజసమైన నిర్ణయం చేయడం కష్టం. పంజాబీ భాషా ప్రాంతంలో సిక్కులు అధిక సంఖ్యాకులవుతారని, ఉభయ ప్రాంతాల్లోనూ హిందువులే అధిక సంఖ్యాకులుగా ఉంటేగాని తమకు రక్షణ ఉండదనీ మహాపంజాబ్ సమితి ప్రచారం. గురుముఖి లిపితో కూడిన పంజాబీ భాషకు ప్రాధాన్యం ఇవ్వకూడదని కూడా వీరివాదం. ఈ వాదం ఎంత హాస్యాస్పదంగా పరిణమించిందంటే, హిందీ-పంజాబీ వివాదం యావత్తూ ఈ రెండు భాషలలోనూ కాక ఉర్దూభాషలో సాగింపబడుతున్నదని ప్రధాని నెహ్రూ అన్నారు.

ఇది ఇలా ఉండగా అకాలీ దళాన్ని కాంగ్రెసులో విలీనం చేయాలని, అకాలీ దళం ఇకమీద సిక్కు ప్రజల సాంఘిక, విద్యా, సాంస్కృతిక అభివృద్ధికి కృషి చేయాలని సర్దార్ జ్ఞాన్‌సింగ్ రారేవాలా చేసిన ప్రకటన మరొక వివాదంగా తయారైంది. అకాలీ నాయకుడు మాస్టర్ తారాసింగ్ అలాచేయడం అకాలీ దళాన్ని విచ్ఛిన్నం చేయడమే అవుతుందని, అకాలీ దళం కాంగ్రెసులో విలీనం కావడానికి వీలులేదని ప్రకటించారు. అకాలీలను లీనం చేసుకోవడానికి కాంగ్రెసు సుముఖంగా ఉన్నట్లు కనబడుతున్నది. ఇది హర్షించదగిన విషయం. స్వతంత్రభారతంలో మత ప్రాతిపదిక రాజకీయ పక్షాలు అభివృద్ధి నిరోధకవర్గాలుగా వ్యవహరించడం, ప్రజల దృష్టిని ఆర్థిక పునర్నిర్మాణ సమస్యలనుండి మరల్చడానికి అవి పనిచెయ్యడం సహించరానిది. ఈ దృష్ట్యా సర్దార్ రారేవాలా సూచన మెచ్చుకోదగినది.

ఇటీవల బాగా సంచలనం కలిగించిన విశేషం మరొకటున్నది. దేశంలో అరాజకాన్ని, సంఘర్షణను ప్రోత్సహిస్తున్న కొన్ని ఢిల్లీ, పంజాబ్ వార్తాపత్రికలకు విదేశాల ఆర్థికసహాయం లభిస్తున్నదని ప్రధాని నెహ్రూ ఇటీవల ప్రకటించారు. ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఆ పత్రికలపేరు ప్రధాని బయటపెట్టలేదు. కాని ఆ పత్రికలు ఏవైనా వాటికి విదేశ ప్రభుత్వాలనుండి ధనసహాయమే అందుతున్న పక్షంలో, కేవలం నిందించడంతో ఊరుకోక వాటిపై తక్షణచర్యలు తీసుకోవాలి. అఖిలభారత పత్రికాసంపాదకుల సంఘ స్థాయీసంఘం ఇటీవల ఒక తీర్మానంలో ఆ పత్రికలపేరు బయటపెట్టవలసిందనీ, వాటిపై తగినచర్యలు తీసుకోవాలనీ ప్రధానిని కోరింది. ఆ ప్రకారం చేయడం భారత ఐకమత్యం, గౌరవప్రతిష్ఠల దృష్ట్యా అత్యవసరం.

* * *

ఆంధ్రప్రదేశ్ రాజధాని

భాషారాష్ట్రాల నిర్మాణం సందర్భంలో ఇతర ప్రాంతాల్లో బయలుదేరిన వివాదాలవంటివి ఆంధ్ర తెలంగాణా విలీనీకరణం విషయమై బయలుదేరకపోవడం, బయలుదేరినా, అన్ని పక్షాలవారు సామరస్యభావంతో సమష్టి శ్రేయస్సే ప్రధానంగా భావించి

★ ఆంధ్రప్రదేశ్ రాజధాని ★

అచిరకాలంలో సమాధానపడడం ఆంధ్రుల రాజకీయ ప్రతిష్ఠను ఇనుమడింప జేస్తున్నది. ఆంధ్రుల చిరకాలవాంఛితమైన విశాలాంధ్ర "ఆంధ్ర ప్రదేశ్"గా వచ్చే అక్టోబర్‌లో అవతరించనున్నది. ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా భారతదేశంలోని పెద్ద నగరాలలో ఒకటైన హైదరాబాదు నగరం త్వరలో తగిన సౌకర్యాలను సమకూర్చుకోనున్నది.

ఈ సౌకర్యాల విషయమై ఇటీవల ఆంధ్ర మంత్రులు, హైదరాబాదు మంత్రులు సంప్రదింపులు జరిపారు ఈ సంప్రదింపుల ఫలితంగా, హైదరాబాదులోని ప్రస్తుత సచివాలయ భవనానికి రూ. 6 లక్షలు పెట్టి పై అంతస్తు నిర్మించడానికి, రూ $1\frac{1}{2}$ లక్షలతో 301 మందికి సరిపోయేటట్లు శాసనసభా భవనం పునర్నిర్మించడానికి, ఆంధ్ర ప్రభుత్వపు సిబ్బందికి 1500 ఇళ్లు నిర్మించడానికి నిశ్చయం జరిగింది.

ఈ నిర్మాణాలన్నీ వచ్చే ఏప్రిల్, మే నెలలనాటికి పూర్తవుతాయట. వీటన్నిటికీ కావలసిన సుమారు కోటి రూపాయల ధనాన్ని అప్పుగా ఇవ్వవలసిందని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడానికికూడా నిశ్చయించారు. ★

సర్ ఆంథోని ఈడెన్ మాస్కో వెడితే, ఇటీవల లండను వచ్చిన రష్యన్ నాయకులకు లేని సౌకర్యం ఒకటి ఆయనకు ఉంటుంది. ప్రతి పక్ష సభ్యులు విందుచేసి అమర్యాదగా ప్రవర్తిస్తారనే భయం ఆయన కక్కర్లేదు.


"పంచ్"

రష్యా విధానాలలో మార్పులు

భారత, రష్యా దేశాలు రెండూ విభిన్న మార్గాలలో ప్రజాభ్యుదయ లక్ష్యాన్ని సాధించడానికి కృషిచేస్తున్నాయని భారత ఉపరాష్ట్రపతి డా॥ ఎస్. రాధాకృష్ణన్ ఈమధ్య మాస్కోలో సోవియట్ అధ్యక్షుడు వోరోషిలోవ్ చేసిన విందు సందర్భంలో ఉద్ఘాటించారు. రష్యాదేశంలో పూర్వపు నిర్బంధాలను సడలించడానికి కృషి జరుగుతున్నట్లు తాను గుర్తించానని కూడా ఆయన అన్నారు

స్టాలిన్ మరణానంతరం రష్యాలో అధికారానికి వచ్చిన కొత్త నాయకులు ప్రపంచ రాజ్యాలమధ్య ఏర్పడిన అనుమానాలను, స్పర్థలను తొలగించడానికి చర్యలు తీసుకోవడంతో ప్రారంభించి, క్రమంగా అంతరంగిక వ్యవస్థలోకూడా పూర్వపు నియంతృత్వ విధానాలను సడలించుతున్నారని వివిధదేశాల రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గతమాసం మాస్కో దర్శించిన ఫ్రెంచినాయకులు, చర్చిల్ వంటి బ్రిటిష్ రాజకీయవేత్తలు దాదాపు ఇదేవిధంగా అభిప్రాయపడుతున్నారు. గత సంవత్సరం భారతప్రధానిని రష్యావారు తమ దేశానికి ఆహ్వానించి గౌరవించడం, ఆ తరువాత రష్యన్‌నాయకులు యుగోస్లావియా, భారతదేశం, బ్రిటన్ మొదలైన దేశాలను సందర్శించడం, ఇప్పుడు యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో రష్యాపర్యటనకు వెళ్ళడం ఇవన్నీ సోవియట్ రాజకీయాలలో ప్రధాన పరిణామాలని పాశ్చాత్య వర్గాలు గుర్తించాయి. వీటన్నిటినీ మించిన ప్రధాన పరిణామం మూడు దశాబ్దాలపాటు రష్యాపై ఏకచ్ఛత్రాధిపత్యం నెరపిన స్టాలిన్‌ను ప్రస్తుత నాయకులు అధికారదాహంగల నియంతగా తెగనాడడం. వ్యక్తి ఆరాధనకు ఇకమీద రష్యాలో స్థానంలేదని, సమిష్టి నాయకత్వం క్రిందనే రష్యా పురోగమిస్తుందనీ రష్యన్లు ప్రకటించారు. స్టాలిన్ విధానాలకు స్వస్తి చెబుతున్నామనే తమ ప్రకటనకు నిదర్శనంగా ఎనిమిదేళ్లక్రిందట 'వెలి' వేయబడిన యుగోస్లావియాతో తిరిగి స్నేహ సంబంధాలు ఏర్పరచుకొన్నారు.

రష్యా, యుగోస్లావియాల స్నేహ సంబంధాలనుగూర్చి అమెరికాలో అప్పుడే అనుమానాలు ప్రారంభమైనాయి రష్యన్ శత్రుత్వ దినాల్లో యుగోస్లావియాకు ఆర్థికంగా, సైనికంగా సహాయంచేసి రష్యన్ భీతినుండి కాపాడిన పశ్చిమ రాజ్యాలు ఇప్పుడు యుగోస్లావియా మళ్ళీ రష్యాతో స్నేహం నెలకొల్పుకోవడాన్ని అనుమానించడంలో ఆశ్చర్యమేమీలేదు. స్నేహం పునరుద్ధరించుకోవడంతో ఆగక యుగోస్లావియా తిరిగి సోవియెట్ కూటమిలో చేరిపోవచ్చునని పశ్చిమరాజ్యాలకు అనుమానం. అయితే తమ దేశ స్వాతంత్ర్యానికి భంగకరమైన పద్ధతిలో సోవియెట్ యూనియన్‌తో కలియడం ఎన్నటికీ తటస్థించదని మార్షల్ టిటో స్పష్టంచేశారు భారతదేశం వలెనే అంతర్జాతీయ వ్యవహారాలలో ఏకూటమికీ చెందకుండా స్వతంత్రంగా, తటస్థంగా ఉండడం సాధ్యమనీ, వాంఛనీయమనీ యుగోస్లావియా భావిస్తున్నది. సోషలిస్టు సమాజస్థాపనకు రష్యన్ పద్ధతి ఒక్కటే మార్గం కాదనీ, ఇతర మార్గాలుకూడా ఉన్నాయనీ రష్యన్లు తమ సిద్ధాంతాలను పునర్నిర్వచించడంతో యుగోస్లావియాతో శత్రుత్వం అంతమొందించుకోవడానికి మార్గం ఏర్పడింది ఇదేవిధమైన వైఖరిని ప్రపంచ రాజకీయాలన్నిటిలోనూ రష్యన్లు అనుసరిస్తే, కమ్యూనిస్టు విధానాలను, తద్భిన్న మార్గాలను అనుసరించే వివిధదేశాలమధ్య సహజీవనం సాధ్యమవుతుంది. అంతేగాక యుగోస్లావియాతో ఏర్పరుచుకున్న మాదిరి సమానస్థాయీ స్నేహాన్నే తూర్పు యూరప్ రాజ్యాలతోకూడా ఏర్పరచుకుని వ్యవహరించడం జరిగినప్పుడు రష్యన్ విధానాల్లో మార్పులు ఫలప్రదాలవుతాయి యుగోస్లావియా ఉదాహరణ అటు తూర్పు యూరప్ రాజ్యాలకు, ఇటు అమెరికన్ నాయకత్వాన నడుస్తున్న తదితర రాజ్యాలకుకూడా ఉపయోగకరమైనదనడంలో సందేహం లేదు. ఉభయ పక్షాల్లోనూ ఉన్న వివిధ దేశాలు రష్యన్, అమెరికన్ నాయకత్వాలను తొలగించుకుని స్వతంత్రంగా పనిచేయడం నేర్చుకున్ననాడు, ప్రస్తుతం ప్రపంచ ప్రజలను యుద్ధభీతితో కలవర పరుస్తున్న సైనిక కూటాల అవసరం తీరిపోతుంది. ప్రపంచశాంతికి మార్గం సుగమం అవుతుంది. రష్యన్‌విధానాలమార్పులు కేవలం ప్రచ్ఛన్న యుద్ధపు కొత్త ఎత్తు గడలేగాని, నిజమైన మార్పులుకావని పశ్చిమ జర్మనీ ఛాన్సెలర్ అడినోవర్ ఈ మధ్య ప్రకటించారు. ఈ విధమైన దృక్పథం ఉభయపక్షాల మధ్య మరింత అనుమానాలకు, భయాలకు దారి తీస్తుందే తప్ప ఉన్న సమస్యలను పరిష్కారం చేయడానికి తోడ్పడదు ఇంతకంటె భారత ఉపరాష్ట్రపతి చెప్పినట్లు రష్యా విధానాలలో మార్పు కనబడుతున్నదనే ప్రాతిపదికపై వ్యవహరించడమే ప్రస్తుత యుద్ధభీతి వాతావరణాన్ని తొలగించడానికి దారి తీస్తుంది. ★



దూతీచాతుర్యం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

చతురిక ఉజ్జయినీ నగర నర్తకి తరళిక భవన ప్రాంగణంలో అడుగు పెట్టిందో లేదో అప్పుడే తరళిక ఆమెను తన శయ్యాగారంలోనికి తోడుకుపోయి అతి రహస్యంగా అడిగింది:

"చతురికా! నీవు వెళ్ళిన పని ఏమైనట్టే! కాయా? పండా?"

"కాయా కాదు! పండూ కాదు!" అని చతురిక అలవోకగా ఒక చిరునవ్వు నవ్వి, కొంచెం ఒయ్యారంగా తల వంచింది.

చెలికత్తె చతురికపై పోక నిమిషంవరకు నిదానించి చూచింది తరళిక:

"అయితే మరింక ఏమైనట్లు?"

"ఇంకా బాగా పక్వానికి రావడం లేదు!"

"కారణం!"

"ఏమోనమ్మ మరి! చేజేతులా చేసుకుని కారణం అంటే నేనే మని చెప్పేది?"

"ఇంతేనా మరి నీ చాతుర్యం?"

చతురిక ముఖంలో కొంచెం లజ్జారక్తిమ పొడచూపింది:

"కిట్టని వాళ్ళేవళ్ళేమి చెప్పారో! బొత్తిగా నీ మాట చెవికెక్కనియ్యడం లేదాయన!"

తరళిక అరచేతిపై చెక్కిలి ఆన్చి కొంచెం ఆలోచనలో పడింది పిమ్మట ఒక వేడి నిట్టూరు పాము పగని దాటింది:

"ఇంతకీ నేనేమి అపచారం చేశానని?"

"ఏమో ధనగుప్తుని వ్యవహార మేమైనా ఆయనదాకా పాక్కిందేమో!"

"ఎవరికి పట్టింది! పని గట్టుకుని ఇదంతా ఆయన చెవిలో నూరియ్యడానికి?"

తరళిక మళ్ళీ చతురిక కేసి బాగా పరిశీలనగా నిదానించి చూచింది

చతురిక పోగ కనురెప్పలు నెమ్మదిగా వాలిపోయాయి

కొంతసేపటి దాకా ఆమె మరి సమాధానమేమీ చెప్పలేదు చిట్టచివరి కిలాగంది:

"ఈ వ్యవహారం అంతా ఊరూ వాడా గుప్పు మన్నప్పుడు—ఎవరేమి చెప్పినా చెప్పవచ్చును! ఇందులో పెద్ద విడ్డూరం ఏమి ఉంది!"

"పోనీ కిట్టనివాళ్ళెవళ్ళో ఏదో చెప్పారే అనుకో! అంతమాత్రానికే నామీద ఇంతటి అలక వహించాలా? నా మనసాయన ఎరగరా?"

"బాగా ఉంది నీ వరస! పురుష పుంగవుల తీరే అంత! నీవు మాత్రం తక్కువ తిన్నావా? ఎంత చెప్పినా నామాట చెవిని పెట్టావూ? రాక రాక గడప తొక్కితే ససేమిరా! అని మూతి ముక్కు బిగించుకుని కూర్చున్నావాయిరి!"

"నీవు కూడా తప్పిదం అంతా నాదేనని అంటున్నావన్నమాట! పోనీ ఆయన ఉజ్జయినీ నగరానికి విచ్చేసి ఇన్నాళ్ళయింది గదా! ఇన్నాళ్ళనించీ ఒక్కసారి మన గుమ్మంకేసి తొంగి చూస్తే కాళ్ళేమైనా గాని కాయలు కాచిపోతాయా? ఇంతకీ నేనింత వేలనైపోయిన తరవాత—ఇంకొకరి ననవలసిన పనిమాత్రం ఏమి ఉంది లే!" అని తరళిక ఉసూరుమని ఒక పెద్దనిట్టూర్పు విడిచిపెట్టింది గద్గదిక భారంవల్ల మరి మాటాడలేకపోయింది

చతురిక ఎడమకన్ను కొంచెం కుంచించి తదేక దృష్టితో ఆమె వేపు చూచి, ఒక చిన్న చిరునవ్వు నవ్వింది:

"సరేగాని నిన్నొక చిన్న ప్రశ్న అడగనా?"

"ఏమిటే! ఆచిన్నారి చిట్టి ప్రశ్న?"

"మొన్న ధనగుప్తులిక్కడికి విచ్చేసినప్పుడాయన యెడల ఎంతైనా ఆప్యాయత కనబరిచావు గదా! మరి ఇప్పుడీ నాగవర్మ కోసమని ఇంతగా వెంపరలాడి పోతున్నావే?"

"అయితే?"

"ఇంతకీ నీ హృదయం చూరగొన్నవారి ఇద్దరిలోను ఎవరా అని!"

ఆ ప్రశ్న విని తరళిక ఒక్క నవ్వు నవ్వింది:

"పోనీ నీవు నాగవర్మ ధనగుప్తుల విద్దరినీ చూచావు గదా! ఆ ఇద్దరిలోను నీ కెవరు నదురుగా ఉన్నారే!"

"ముఖ్యవ నాకు నచ్చడానికీ దీనికీ సంబంధ మేమిటే?"

"ఊరికే మాట వరసకు అడుగుతున్నాను! మరేమీ భయంలేదులే! చెప్పు"

చతురిక కొంచెం తటపటాయించింది.

"నవగుప్తుడు!"

"ఉత్తది! ఊరికే అంటున్నావు నిజం చెప్పు!"

"నిజమే!"

"నాకు తెలియదనుకొన్నావా! నీ మనసులో మాట! నిజం చెప్పు! భయంలేదు లే!"

"నీ వూహించినది నిజమేనమ్మ! నాగవర్మే!"

"మరి నీకే అలాగనిపించినప్పుడిక వేరేనన్ను డగనేల?"

చతురిక మళ్ళీ అడిగింది:

"ఈ నాగవర్మతో నీకీ చెలిమి ఎన్నాళ్ళనించి?"


"అబ్బో! అది చాలా కాలం నాటిమాట! కొత్తగా గజ్జెకట్టి మహాకాళీ దేవాలయ మండపంలో నృత్యం చేసినప్పటిమాట!"

"అయితే చిన్ననాటి కన్నెవల పన్నమాట!"

ఈ మాటలని చతురిక తరళిక ముఖంవైపు కొంచెం కొంటెగా చూచింది తరళిక అరుణాధరంపై ఒక మందహాసం మెరిసింది ఆ మెరుపు చతురికకొక అమర పారిజాతమునుళంలా స్ఫురించింది! తరళిక ఆనంద పారవశ్యంచూచి చతురిక కొంటెగా ఒకనవ్వు నవ్వింది:

"చాల్చాలులే! నీ కొంటె వేషాలు! నీకింకా బొత్తిగా చిన్నతనం వదలలేదు!" రుసరుస లాడుతూ కసిరికొట్టింది తరళిక

"సరే గాని! పిరిరా మోకా లాడ్డి



సముద్రస్నానం

ఫొటో: నిష్ఠాణిగిరిధర్.

నట్టుగా ఆ వేళ ఆయన విచ్చేసినప్పు డంత ధిక్కరించుకుని కూర్చున్నా వెందుకే?"

"అందుక నేగా! ఇప్పుడు నిన్నంతగా కాళ్లా వేళ్లాపడి బతిమాలుకొంటున్నది!"

"ఆ వేళ నీ కోపధోరణిచూచి ధనగుప్తుని విశ్వాసం మీద మమకారం కొద్దీ నాగవర్మ కిట్ట 'జోడీమన్నా చేయిస్తున్నా'నని అనుకొన్నాను సుమా! సరేలే! గతి జల సేతు బంధనంవల్ల ప్రయోజనమేమిటిలే!"

అని చతురిక ఒక నిట్టూర్పు విడిచింది.

"చతురికా! వెంటనే ఇక్కడున్నట్టుగా వెళ్లి మళ్లీ ఎలాగైనా నాగవర్మ నొక్కమారిక్కడికి తోడుకు రాగలవా?"

"సరేలే! అలాగేలే! నీ వింతగా పదే పదే ప్రాధేయపడాలా?"

"వెళ్లి ఆయనతో ఏమని విన్నవిస్తావే!"

చతురిక వ్యంగ్యంగా ఒక్క నవ్వు నవ్వింది:

"మానినీమానసచోరా! మీ కోసం కుసుమ శయ్యపై వేచి వేచి వేసారిన ప్రాణాధిక రాధిక ప్రాణాలిక ఒక్క క్షణమైనా నిలవవనీ, నిలుచున్న పళంగా విచ్చేయవలసిందనీ విన్నవిస్తాను."

"చాల్లే నీ కవిత్వం! ఇలా గన్నావంటే వ్యవహారం అంతా మళ్లీ మొదటికి వస్తుంది"

"ఏం!"

"అంత పేరెన్నికన్న వారవనితను గదా! ఇంతగా బెంబేలుపడినట్టు తెలిస్తే నే నిక నలుసుకన్నా అలుసైపోనూ!"

"ఆయన అంత బింకంగా ఉన్నప్పుడు మనంకూడా బిగువులు పోతే ఎలాగ!"

"నేనుమాత్రం అంత బిగువులో పొమ్మన్నానా? కొంత బెట్టుసరి చెయ్యమన్నాను గాని."

"అయితే మరి ఏమని చెప్పను?"

"ఆయన వేణుగానం అంటే చెవి కోసుకుంటారు వేణుగానంలో విశేషపరిశ్రమ చేశావనీ, అది వినడానికొక్కసారి విచ్చేయమన్నావనీ చెప్పు! తెలిసిందా?"

"అందుకోసమా! అంతగా మురళీ సాధన చేస్తున్నా విమ్మధ్యన!? సరేగాని ఈ సంగతి ధనగుప్తుని చెవిని పడితే?"

"ఏం పడితే?" నిష్ఠూరంగా అడిగింది తరళిక

"మళ్ళీ మనగడపతొక్కుతారా ఆయన!"

"పోతే పోనీ!"

"నీకేం! నీవు మహారాజులా బాగానే ఉంటావు! అమ్మగారికిది తెలిస్తే మధ్యన నా ప్రాణాలెగిరి పోతాయి! నేను పోను బాబూ!"

"నీ ప్రాణాలకు నా ప్రాణాలడ్డువేస్తాను లేవే! ఎవరికీ తెలియనివ్వనులే! నా బంగారు తల్లివి కాదూ! ఒక్కసారి వెళ్లవే అమ్మా!"

చతురిక కాలిబొటనవ్రేలితో నేలపై రాస్తూ తల వంచుకుని అలాగే నిలుచుండిపోయింది అంతేగాని మరి అక్కడినుంచి కదలలేదు.

తరళిక తన చిటికెన వేలి చిన్నిరత్నాంగుళీయకం తీసి ఆమె చిటికెనవ్రేలి కలంకరించింది:

★ దూతీ చాతుర్యం ★

"నాగవర్మనే కనక నీవు వెంటనే తోడుకువస్తే నీపాదాలకు బంగారుమువ్వల మాణిక్య మంజీరాలు బహూకరిస్తాను! చూసుకో మరి!"

"చతురిక ఒక్క నవ్వు నవ్వింది:

"నన్నే ఇంతగా ఎత్తివేస్తున్నావే! దేవుడు మేలుచేసి నాగవర్మ విచ్చేయడమే జరిగితే ఇక ఆయన నెంతగా పూవుల్లో పెట్టి పూజచేస్తావో అని విస్తుపోతున్నాను."

"ఈ ఛలోక్తుల కేమిగాని తొందరగా తెమలవే! అప్పుడే బాగా చీకటిపడింది."

వెంటనే చతురిక లోపలికి వెళ్లి సరిగంచు నీలిచీర ధరించి, మెడలో ముప్పేట ముత్యాలహారాలు, పాపటపై చంద్రవంక, కర్ణాలకు సువర్ణతాటంకాలు, మొలనూలు పాదమంజీరాలు మొదలైన నగలెన్నో అలంకరించుకొన్నది. ముంగురులపై సరిగంచు మేలిముసుగు సరిదిద్దుకొని చిటికెనవేలిపై మెరిసే ముద్దుటుంగరం చూచి మురిసిపోయింది. నాగవర్మ భవనానికి బయలుదేరబోయేముందొకమారు తరళిక ఎదురుగా వచ్చి నిలబడింది. ఆమె పాదనూపురాల సవ్వడి విని తరళిక అదిరిపడింది. చతురిక హేలగా ఆమె కేసి చూసి—

"పోయిరానా మరి!" అని అడిగింది.

"అయ్యో, ఇంకా బయలుదేరనేలేదా? ఇంతలో వెళ్లి ఇంతలో తిరిగి వచ్చేదానికి అభిసారికా వేషం రచన అంతా ఎందుకే!"

"అంతేనా నీవు గ్రహించింది!"

"అంటే?"

"మాడగానే కొంచెం కంటికింపుగా కనిపిస్తే ఆపైన మనం చెప్పేమాట బాగా రక్తికడుతుందని—"

"ఓహో అలాగా!" అని ఆమె కేసి అలాగే విస్తుపోయి చూచింది తరళిక. కొంచెంసేపూరుకొని—

"పాలముంచినా నీటముంచినా మరి నిన్నే నమ్ముకొన్నానని విన్నవించవే!" అన్నది.

"ఇప్పటికేగా అన్నావు వేలతనం కూడదని! ఇంతలోనే ఇంత మరుపా!" అని చతురిక ఒక్క నవ్వు నవ్వి మెరుపులా అక్కడినించి వెళ్లిపోయింది. తరళిక కనిపించనంతవరకు ఆమెవైపే చూస్తూ నెమ్మదిగా ఒక నిట్టూర్పు విడిచింది.

౨

ఉజ్జయినిలో శిప్రానదీతీర రాజవీథిలో చిట్టచివరి ప్రాసాదం ఆనాటి సంజెచీకటిలో నల్లని ముసుగుతో నిలిచిన రమణీయాభిసారికలా మెరిసింది. నాగవర్మ, ఉజ్జయినికి విచ్చేసినప్పుడు సామాన్యంగా దానిలోనే విడిదిచేస్తూంటాడు. అతని మేనమామ చంద్రగుప్తవిక్రమాదిత్యచక్రవర్తి కొలువులో అశ్వికసైన్యాధ్యక్షుడు. నాగవర్మ తాత తండ్రులు, విదర్భరాజ బంధువులు. పద్మపురంలో ఇంత కలిగినవారని పేరు ప్రఖ్యాతులు గడించినవారు చిన్నతనంనించీ నాగవర్మ శస్త్రవిద్యాభ్యాసము, శాస్త్రాభ్యాసము, సంగీతాభ్యాసము ఉజ్జయినీ నగరంలోనే జరిగాయి. అయినా సంవత్సరంలో చాలా భాగం అతడు పద్మపురంలోనే గడిపివేస్తూంటాడు ఈమారు ఉజ్జయినికి వచ్చిన తరవాత ఎందుచేతనో అతనికింకా పద్మపురానికి మరలిపోవాలనే సంకల్పం కలగలేదు.

అది ప్రత్యేకంగా అతని విడిదికోసం ఏర్పాటుచేయించిన ప్రాసాదం. పరిమిత పరివారం సందడి విడిచివేస్తే ప్రాసాదం అంతా కేవలం విరిక్తంగానే కనిపిస్తుంది.

నాటి సాయంకాలం నాగవర్మ కేమీ తోచలేదు ఆ పరిసరమే కాక అతనికి హృదయంకూడా శూన్యంగా కనిపించింది. ఏదో కాలయాపనంకోసమని మురళీగానం ప్రారంభించాడు. సమీపంలో ప్రవహించే శిప్రానదిలో కృత్తికా తారక తారహారంలా తళతళలాడింది. ఉజ్జయినీ నగరవీథులలో విలాసపురుషులు, పూలమాలికలకోసం పుష్పలావికలతో ఉబుసుపోని బేరసారాలింకా సాగిస్తూనే ఉన్నారు.

నాగవర్మ రాజవీథుల దీపకాంతులలో వారి ముఖాలొకమారు పరికించి విడిచీ విడవనట్టొక నిట్టూర్పు విడిచిపెట్టి తిరిగి మురళీగానం ప్రారంభించాడు. గానం కొంత సేపటివరకు ప్రశాంతంగా సాగిపోయింది.

అంతలో అతనికి ప్రాసాద ద్వార పార్శ్వంలో ఎవరో ఒక సుందరి ఒయ్యారంగా నిలబడి తన గాన మాధుర్యం ఆలకిస్తున్నట్టు స్ఫురించింది. పక్కకు తిరిగి చూచాడు. అంతలోనే చతురిక ఎదురుగా వచ్చి నిలబడింది.

"ఎవరది! చతురికా!"

"అవును! నేనే! మీ వేణుగాన గోష్ఠికి కొంచెం విఘాతం కలిగించినట్టున్నానే!"

అని చతురిక లజ్జారుణ కపోలాలతో ప్రత్యుత్తరం ఇచ్చింది.

"లేదు! లేదు! సాక్షాత్తు నాగకన్యక ఎవరైనా నాకోసం వచ్చిందేమో అనుకున్నానులే!" అన్నాడు నాగవర్మ ఆమె మనోజ్ఞవేషం చూడగానే అతనిలో శూన్యభావం అంతా ఒక్కమారుగా పటాపంచలైపోయింది.

చతురిక అతని కెదురుగా ఒక సుఖాసనంపై కూర్చున్నది. నాగవర్మ దీపకాంతిలో ఆమె ముఖభంగిమ అంతా ఒకమారలవోకగా పరికించాడు.

చిక్కని శ్యామలవస్త్రం. విశాల విస్ఫారిత నేత్రాలు వీక్షణ ప్రభలతో తళతళమెరిసే చిరునవ్వులు. గాలికి కదలాడే తీరులో స్ఫురించే సుకుమార దేహవల్లిక. అతని నిశిత వీక్షణాలు చూచి చతురిక సిగ్గుపడి అతనివైపు ఓరచూపులు చూచింది:

"నాగకన్యక కేమిగాని నా చిన్న మనవి కొంచెం చిత్తగించాలి!"

"దేవరవారి ఆజ్ఞ ఏమని!" అన్నాడు నాగవర్మ అతి వినయంగా దోసిలి ఒగ్గి.

అతని కొంటెతనానికి చతురిక మళ్లీ వల్లమాలిన సిగుతో ముంచుకుపోయింది. తరవాత ఒక నిమిషం ఆగి నెమ్మదిగా సమాధానం ఇచ్చింది:

"పోనీ పరిహాసానికైనా అంత మాట అన్నారు! అదే పదివేలు!"

"పరిహాసం కాదు! నిజమే!"

"నిజమేనా? తప్పక నా మనవి చెల్లిస్తారుకదూ!"

"చెల్లిస్తాను!"

"అయితే వెంటనే నా వెంట బయలుదేరి రండి!"

"నీ మనవి చెల్లించడానికి వెంటనే

★ దూతీ చాతుర్యం ★

నీవెంట బయలుదేరి రావక్కరలే దను కొన్నానే!"

అని నాగవర్మ ఒక చిరునవ్వునవ్వి, సాభిప్రాయంగా ఆమెవైపు చూచాడు

చతురిక మళ్లీ వల్లమాలిన సిగ్గుతో తల మునకలైపోయింది!

"మీ కొంటెమాటల కేమిగాని—పాపం తరళిక మీ కోసం ఎదురు తెన్నులు చూస్తూంది. వెంటనే బయలుదేరిరండి!"

"నాకోసమా? ధనగుప్తుని కోసమా!"

"అలాగనడం భావ్యమేనా? చిన్ననాటి చెలిమి అంతా ఒక్కతప్పిదంతో ఒక్కమారుగా ఎందుకు కొరగాని దైపోయిందా?"

"పోనీ ఇంతకాలానికి తప్పామెదే అని అంగీకరించావు! అదే పదివేలు!"

"నేనంగీకరించడం లేదు? ఆ తప్పామె. వల్ల జరగలేదు!"

"మరి ఎవరివల్ల జరిగింది."

"తరళిక తల్లి బలవంతంవల్ల! ఆ తల్లి ధన లోభంవల్ల! మీ ఉపేక్షవల్ల!"

"కారణ మెవరైనా పొరబాటు పొర బాటేకదా!"

"ఒక్కమాట! వెలయాలు మగవాలు కాదుగదా! అంతమాత్రానికే ఇంతటి అలుక వహించాలా?"

"మగవాలు కాకపోయినంత మాత్రాన చిన్ననాటి మనుకారాలన్నీ మంటగలిసి పోవలిసిందేనా?"

"ఏమీ మంటగలిసిపోలేదు! ఇంతటి సరసులై ఉండీన్నీ మీరు అంగనాహృదయం అణువంతైనా అవగాహన చేసుకొన్నారు కారు!"

నాగవర్మ కనుగొలకులలో కొంచెం క్రోధరక్తిమ పొడచూపింది. అయినా అత డది పైకి కనబడనీయలేదు.

"ఇంతటి సొరజాణవైనా పురుష హృదయం నీకేమీ బోధపడలే దన్నమాట!"

"అవునవును! పురుషులు పౌరుషప్రధానులు! అందులోను తమరు పాలవంటి సుక్షత్రియ వంశంలో అవతరించిన వీరవరేణ్యులు! దీనిలో మరి బోధపడడానికేమి ఉంది?"

"ఇంత తెలిసినదానవు మరి ఇక్కడ కెందుకు వచ్చినట్టు?"

"అంగనాహృదయ మాధుర్యం మీ కెరుక చేస్తే మీ హృదయం కొంచెమైనా కరగక పోతుందా! అని."

"ఇన్నాళ్లకు హృదయమాధుర్యం సంపూర్ణంగా అవగతమయింది! నా హృదయం ఆర్ద్రమై లేని వెల్లువలై ప్రవహించి పోతూంది!"

అని కొంచెం వ్యంగ్యంగా నవ్వాడు నాగవర్మ.

"పాపం! మీ మెప్పు పొందాలని వేయి విధాల వేణుగాన సాధన చేసింది తరళిక! పోనీ ఒక్కమారామె గానమాధుర్యం ఆస్వాదించడానికైనా విచ్చేయకూడదా?"

"ఇందాకటి నించీ ఆ గాన మాధుర్యమే ఆస్వాదిస్తున్నాను!"

"నా మాటలలో అంతటి గాన మాధుర్యమే ఉంటేనా?"

"ఉంటే?"

"మిమ్మల్నిపాటికి నా పైటకొంగు పసిడిగా ముడివేసుకొని వెంట తోడుకు పోలేకపోయానా?"

"లేకేమి? అయితే ఆ మాధుర్యానికి మూలకారణమేదో ఇంత సేపటికి కరగావాన అయింది."

"అని హాఠాత్తుగా లేచి అతడామె పెదవి ముద్దు పెట్టుకొన్నాడు. వెంటనే చతురిక లేచి కొంచెం దూరంగా వెళ్ళి నిలబడి, ఒక్క చిరునవ్వు నవ్వి ముక్కుమీద వేలు వేసుకొన్నది:

"చిన్ననాటి నించీ ప్రాణసమానంగా నమ్మిన చెలికత్తె నీ విధంగా మోసగించడం మీకు భావ్యమేనా?"

"ఎవరు మోసగించారో ఇప్పుడే తెలిసింది!" అన్నాడు నాగవర్మ నిశితంగా ఆమెకేసి చూసి.

"అవునవును! ఇప్పుడిప్పుడే నాకూ తెలిసింది."

అని చతురిక పక్కుమని నవ్వింది.

నాగవర్మ ఒక్కమారుగా పరాజితుడై పోయినట్టుగా కొంచెం తలవంచు కొన్నాడు.

చతురిక మళ్ళీ వెటకారంగా అతనికేసి చూసింది:

"తప్పిదం మీ వల్లకూడా జరిగినప్పుడేదో కొంచెం అపరాధం జరిగిందని చెలికత్తె నీవిధంగా కించపరచడం మీకు భావ్యమేనా? ఎంతైనా మగవారు మహారాజులు."

"నాగవర్మ మళ్ళీ నిశితంగా ఆమె వైపు చూచాడు. అతనికి మళ్ళీ ధైర్యం వచ్చింది:

-"ఈ విద్యలో నాందీ ప్రస్తావన చేసింది మీ చెలికత్తే! ఆమెదే ఆ ఆచార్యపీఠం"

"అయితే ఇప్పుడిక మీ ఎక్కువేముంది కనక! దయచేసి వెంటనే నా వెంటరండి!" నా చనువు మన్నించండి!"

"చనువేమో మన్నిస్తానుగాని నీ వెంట రావడం మాత్రం జరిగే పనిగాదు!"

"అంతేనా;"

"అంతే!"

"తరళిక తల్లిచాటు పిల్ల! ఏదో మార్గాంతరంలేక ఆ విధంగా మభ్యపడిపోయింది! పాపం ఆమెపై మీ కీవిధంగా పగసాధిం

(55-వ పేజీ చూడండి)


విజయవంతముగ ప్రదర్శింపబడుచున్న
లక్ష్మీ ప్రొడక్షన్సు వారి
ఇలవేల్పు
అంజలి....నాగేశ్వరరావు..
రేలంగి...జమున...కృష్ణకుమారి
గుమ్మడి....
దర్శకత్వం
యోగానంద్
పూర్ణా రిలీజ్
డైరెక్టర్. ప్రసాద్ గారి పర్యవేక్షణలో నిర్మించబడినది..

కామన్వెల్తు పుట్టుపూర్వోత్తరాలు

కామన్వెల్తు దేశాల ప్రధాన మంత్రులు ఈ నెల 27-వ తేదీన లండనులో సమావేశమవుతున్నారు. భారత ప్రధాని పండిట్ నెహ్రూ కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు.

కామన్వెల్తు వ్యవస్థ చిత్రమైనది. ప్రపంచ రాజ్యాలు ఈనాడు సైనికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక కూటాలుగా చీలిపోయి పరస్పర శత్రుత్వంతో వ్యవహరించడం పరిపాటైపోయింది. కామన్వెల్తు కూటమి ఇటువంటిది కాదు. గత శతాబ్దాంతంలోను, ఈ శతాబ్దంలోనూ జరిగిన అనేక రాజకీయ పరిణామాల ఫలితంగా, ముఖ్యంగా 'రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిత్తి' నుండి యీ కూటమి ఏర్పడింది. కామన్వెల్తు దేశాలమధ్య సంబంధాలిప్పటికి ఒక నిర్దిష్టరూపం దాల్చలేదు; ఇంకా పరిణామదశలోనే ఉన్నాయి.

కామన్వెల్తు దేశాలివి: బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలండ్, దక్షిణ ఆఫ్రికా, భారతదేశం, పాకిస్తాన్, సింహళం. బ్రిటిష్ సామ్రాజ్యంలోని ఒక్కొక్క ప్రాంతమే స్వయంపరిపాలనా ప్రతిపత్తి సంపాదించుకుంటూ చివరికి యిప్పటి కామన్వెల్తు రూపొందింది.

కామన్వెల్తు దేశాల ప్రధాన మంత్రులు అడపాతడపా లండన్ నగరంలో సమావేశమై తమ తమ ఆర్థిక, రక్షణ సమస్యలను, అంతర్జాతీయ సమస్యలను చర్చించడం ఆనవాయితీగా ఏర్పడింది.

మొదటి సమావేశం

కామన్వెల్తు ప్రధానుల మొట్టమొదటి సమావేశం 1887-లో జరిగింది. ఆ రోజుల్లో చర్చలు ముఖ్యంగా సామ్రాజ్యంలోని వివిధ దేశాలకు క్రమంగా స్వయం పరిపాలనాధికారాన్ని అధికం చేయడం గూర్చి మాత్రమే జరిగేవి. మొదటి ప్రపంచయుద్ధం అనివార్యమని తేలిపోయిన రోజుల్లో, అంటే 1907 ప్రాంతంనుంచీ వైదేశిక వ్యవహారాలను గూర్చికూడా చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రపంచయుద్ధపు రోజులో అధినివేశాలన్నీ బ్రిటన్‌తో సన్నిహితంగా సహకరించి విజయానికి తోడ్పడ్డాయి. అప్పటినుంచీ తమకింకా ఎక్కువ స్వాతంత్ర్యం ఇవ్వాలని అధినివేశాలు ఆందోళన చేయసాగాయి.

దీని ఫలితంగా 1926 లో జరిగిన ప్రధాన మంత్రుల సమావేశంలో లార్డ్ బాల్ఫోర్ నివేదిక ఆమోదింపబడింది. ఈ నివేదికలో అధినివేశాలు బ్రిటిష్ సామ్రాజ్యంలోని సర్వస్వతంత్ర దేశాలనీ వీటికి బ్రిటన్‌తో సమాన ప్రతిపత్తి ఉందనీ, దేశీయ విదేశీయ వ్యవహారాలలో ఇవి స్వతంత్రంగా వ్యవహరింపవచ్చుననీ, బ్రిటిష్ కామన్వెల్తులోని సభ్యదేశాలుగా ఇవి బ్రిటిష్ రాజును తమ అధిపతిగా అంగీకరిస్తాయనీ నిర్వచింపబడింది. 1931 లో బ్రిటిష్ పార్లమెంటు ఒక శాసనంద్వారా, అధినివేశాల పార్లమెంటులు తమ ఇష్టంవచ్చిన రీతిగా శాసనాలు చేసుకునేందుకు స్వేచ్ఛ ఇచ్చింది. ఈ స్వేచ్ఛ ఫలితంగా ఐరెండు బ్రిటిష్ కామన్వెల్తునుండి తప్పుకోవడానికి నిశ్చయించుకున్నది.

గవర్నర్ జనరల్ — 1926 కు పూర్వం అధినివేశపు గవర్నరు జనరలు బ్రిటిష్ రాజప్రతినిధిగా వ్యవహరించేవాడు. బ్రిటిష్ రాజు తన మంత్రుల సలహాపై గవర్నరు జనరలును స్వయంగా నియమించేవాడు. ఇప్పుడు గవర్నరుజనరల్ పదవికి తమ ఇష్టంవచ్చిన వ్యక్తిని సూచించే హక్కు అధినివేశాలకు ఉన్నది.

హైకమీషనర్:— గవర్నరు జనరల్ అధికారాలు తగ్గిపోవడంతో బ్రిటిష్ ప్రభుత్వానికీ, అధినివేశ ప్రభుత్వాలకూ మధ్య వ్యవహారాలకు హైకమీషనరు అవసరమయ్యారు. మొట్టమొదటి హైకమీషనరును కెనడా 1880 లో లండన్‌లో ఏర్పాటుచేసుకున్నది. ఆస్ట్రేలియా 1910 లో ఏర్పాటుచేసుకున్నది. ఆ తరువాత క్రమంగా ప్రతి అధినివేశమూ బ్రిటన్‌లోనూ, బ్రిటన్ ప్రతి అధినివేశంలోనూ, ప్రతి అధినివేశమూ ఇతర అధినివేశాల్లోనూ హైకమీషనర్లను ఏర్పాటుచేసుకోవడం ఆచారమైంది. హైకమీషనర్లు పేరుకు రాయబారులు కాకపోయినా రాయబారులుగానే వ్యవహరిస్తారు. వీరికి విదేశ రాయబారుల స్థాయి ఇవ్వబడింది. వీరిని ఇతర రాయబారుల వలెనే 'హిజ్ ఎక్సెలెన్సీ' అంటారు.

భారత రిపబ్లిక్ సభ్యత్వం

భారత, పాకిస్తాన్, సింహళ ప్రధాన మంత్రులు కామన్వెల్తు సమావేశానికి 1948 లో మొదటిసారిగా హాజరయ్యారు. కామన్వెల్తులో భారతదేశం ప్రవేశించడంతో కొన్ని కొత్త సమస్యలు ఏర్పడ్డాయి. 1948 వరకూ అధినివేశాల ప్రజలందరూ బ్రిటిష్ ప్రజలుగానే పరిగణింపబడేవారు. కాని భారతదేశం తన ప్రజలను బ్రిటిషు ప్రజలుగా పరిగణించడానికి ఇష్టపడలేదు. అలా పరిగణించడం దాస్య సూచకం అవుతుందని భారతీయులు అభిప్రాయపడ్డారు. అదీగాక కెనడాలాంటి అధినివేశాల ప్రజలకువలె భారతీయులకు బ్రిటిషువారికి జాతి సామ్యంకూడా లేదు. ఇది ఇలా ఉంచి భారతదేశం సర్వస్వతంత్రమైన రిపబ్లిక్‌గా వ్యవహరించాలనే కోరిక వ్యక్తం చేసింది. భారతదేశం రిపబ్లికు అయితే బ్రిటిషు రాజును అధిపతిగా అంగీకరించే ప్రసక్తి లేదు. ఈ విషయాలమీద ...వ్యాఖ్యానిస్తూ జనరల్ స్మట్స్ "మధ్యేమార్గం లేదు; అధినివేశంగా ఉండడమో ఉండకపోవడమో తేలిపోవాలి. అస్పష్టంగా ఉండడానికి వీలు లేదు" అన్నాడు. ఆర్. జి. మెంజీస్ (ఆస్ట్రేలియా) కూడా అదే అభిప్రాయం వెలిబుచ్చారు.

ఈ సమస్యలను చర్చించడానికి 1949 ఏప్రిల్ లో కామన్వెల్తు ప్రధానులు సమావేశమయ్యారు. రిపబ్లిక్ అయి కూడా కామన్వెల్తులో ఉండదలుచుకున్న భారత ప్రతిపాదనను ఆ సమావేశంలో అందరూ చర్చించారు. దానిఫలితంగా బ్రిటిషు రాజును స్వతంత్రదేశాల సంఘమైన కామన్వెల్తుకు మాత్రమే చిహ్నంగానూ, అధిపతిగానూ భారతదేశం అంగీకరించింది. "శాంతి స్వేచ్ఛ, అభ్యుదయాలకోసం ఇచ్ఛాపూర్వకంగా సహకరిస్తూ కామన్వెల్తులో స్వతంత్ర, సమాన సభ్యదేశాలుగా సమష్టిగా ఉంటా"మని బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా న్యూజీలండ్, దక్షిణాఫ్రికా, భారత పాకిస్తాన్, సింహళ దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. ఈ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ జనరల్ స్మట్స్ "ఇది చీకట్లో దూకడంలాగా" ఉందన్నాడు.

1949 నుండీ ఈ కూటమిని కామన్వెల్తు అనే పేర్కొంటున్నారు. 'బ్రిటిషు' అనే మాట ఉపయోగించడం లేదు.

భారతదేశం కామన్వెల్తులో ఉండడం భారతదేశంలోనే కొన్ని వర్గాలకు ఇష్టం లేదు. రెండు శతాబ్దాలపాటు దేశాన్ని దాస్య

కామన్వెల్తు పుట్టు పూర్వోత్తరాలు

బంధాలలో ఉంచి పెత్తనం చెలాయించిన బ్రిటనుతో ఇలా సన్నిహితంగా ఉండడం గౌరవనీయం కాదని ఈ వర్గాలు వాదిస్తున్నాయి. బర్మా, ఐర్ దేశాలు ఈ కారణం చేతనే కామన్వెల్తు నుండి విడిపోయాయి. అయినా, ప్రస్తుత ప్రపంచంలో ఏ దేశమూ ఇతర దేశాలమీద కొంతవరకైనా ఆధారపడక ఉండలేదని ప్రధాని నెహ్రూ ఆ వాదను ఖండించారు భారత ఆర్థిక వ్యవస్థ స్టెర్లింగ్ ప్రాంతంతో పెనవైచుకొని ఉండడంకూడా మరొక కారణం

కామన్వెల్తు దేశాలు పరస్పరం సహకరించాలనేది సూత్రప్రాయంగా నిర్దేశించబడినా, చాలవరకూ ఆ విధంగానే జరుగుతున్నా భారతదేశానికి రెండు దేశాలతో మాత్రం స్పర్ధలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకటి దక్షిణాఫ్రికా, రెండోది పాకిస్తాన్.

రెండుదేశాలతో పేచీ

దక్షిణాఫ్రికాతో భారతదేశానికి జాతి సంబంధాలమీద పేచీ వచ్చింది. దక్షిణాఫ్రికాలో 2,88 000 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 16 వేలమంది ట్రాన్సువాల్ రాష్ట్రంలోనూ, మిగతా వారు నేటాల్ లోనూ ఉన్నారు వీరు స్వయం కృషిచేత వ్యాపార రంగంలో తెల్లవారితో పోటీ చేయగల సామర్థ్యం సంపాదించుకున్నారు. ఇది తెల్లవారికి కంటకప్రాయమైంది. భారతీయులు నల్లజాతివారనేదికూడా జాతి విద్వేషానికి కారణమైంది వీరి నివాసాలను కొన్ని ప్రాంతాలకు పరిమితం చేయడం, వ్యాపారంపై నిర్బంధాలు అమలుచేయడం, తెల్లవారితో సమానమైన హక్కులను ఇవ్వకపోవడం మొదలైన అనేక విధాలుగా జాతి వివక్షత విధానాన్ని దక్షిణాఫ్రికా ప్రభుత్వం అనుసరిస్తోంది. 1894 లో భారతీయులు గాంధీమహాత్ముని నాయకత్వాన సాగించిన ప్రతిఘటనోద్యమం ఇంకా సాగిస్తూనే ఉన్నారు 1946 లో ఐక్యరాజ్యసమితి దక్షిణాఫ్రికా విధానాన్ని ఖండిస్తూ "భారతీయులపట్ల అంతర్జాతీయ మర్యాదలకు అనుగుణమైన వైఖరి అవలంబించాలని,

అలా అవలంబించినట్లు వచ్చే సమావేశం నాటికి సంజాయిషీ ఇవ్వాలని" దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని ద. ఆ. ప్రభుత్వం తిరస్కరించింది. 1948 లో డా॥ మలాన్ అధికారానికివచ్చి దక్షిణాఫ్రికా కేంద్ర శాసన సభలోను, నేటాల్ రాష్ట్ర శాసన సభలోనూ అంత

(56-వ పేజీ చూడండి)



26

హరిహరునికి ఇంటిదగ్గిరనుంచి వెళ్ళిన ఉత్తరం అందలేదు హరిహరుడీసారి ఇల్లు బయలుదేరి వెళ్లటం - సరాసరి కృష్ణనగర్ వెళ్ళాడు అక్కడతడికి ఎరిగిన వాళ్లెవరూ లేరు బస్తీకదా, ఏదో ఉపాధి దొరక్కపోతుందా అన్న భ్రాంతితో అక్కడికి వెళ్ళాడు. అక్కడ కొన్నాళ్ళు ఉన్నాక, స్థానికంగా ఉండే జమీందార్లు, ప్లీడర్లు-కొందరు రోజుకింత అనో, నెలకి ఇంతనో వేతనం ఏర్పాటుచేసి తరచు పురాణాలు చెప్పించుకోవడం కద్దు - అని తెలిసింది. ఆ ఆశతో పదిహేను రోజులు అక్కడ గడిపాడు-ఇంటిదగ్గర్నుంచి తెచ్చుకున్న డబ్బు కాస్తా అయిపోయింది. కాని ఎక్కడా ఏమీ ఏర్పాటుకాలేదు.

అతడు చాలా కష్టాల్లో పడ్డాడు. ఒక్క కానీ అయినా సహాయం చేసేవాళ్లెవరూ లేరు. చేతిలో డబ్బు కాస్తా అయిపోవటంతో అదివరదాకా ఉన్న పూటకూళ్లిల్లు వదిలి బయటికి రావలసివచ్చింది ఆ ఊళ్లో సత్రంలో పరాయివూళ్ళనుంచి వచ్చే బీదబ్రాహ్మణులకు ఉచిత భోజన వసతులు ఇస్తారని ఒకరివల్ల విన్నాడు. తాను బీద బ్రాహ్మణ్ణని చెప్పుకుని, సత్రంలో ఆశ్రయం సంపాయించాడు. కాని అక్కడ అనేక విధాలయిన ఇబ్బందుల్ని ఎదుర్కొనవలసి వచ్చింది. పనీపాటూలేని గంజాయి దమ్ముగాళ్ళంతా అక్కడ చేరి రాత్రి తెల్లవార్లూ గొడవ చేస్తుంటారు. అంతేకాదు, ఒక్కొక్కప్పుడు అర్ధరాత్రిళ్లు ఆడవాళ్లు కూడా వచ్చి పోతూంటారు. వాళ్ళని చూస్తే అక్కడ వున్న హరిమందిరంలోని స్వామి దర్శనానికే వచ్చిపోతున్న గౌరవ కుటుంబాల్లోని స్త్రీలని నమ్మటం మాత్రం చాలా కష్టం.

అతి కష్టంమీద రోజులు వెళ్లతీస్తూ అక్కడ ఉన్న పెద్ద పెద్ద ధనికులైన ప్లీడర్ల ఇళ్ల చుట్టూ తిరగటం మొదలెట్టాడు. పగలల్లా తిరిగి తిరిగి రాత్రి బసకు చేరుకుంటే ఒక్కొక్క రోజున ఎవరో కులగోత్రాలు తెలియని వ్యక్తి తనచోటులో తనపక్క పరచుకుని గుర్రుకొట్టి నిద్రపోతూ ఉండేవాడు. హరి హరుడు కొన్నాళ్లు బయట వరండాలో నే పడుకుంటూ కాలంగడిపాడు. తరచు ఇలా జరుగుతూండటంతో ఆగంజాయి దమ్ముగాళ్లతో ఒక రోజున అతడు వివాదపడ్డాడు. మర్నాడుదయం వాళ్లంతా పోయి ఆసత్రం సెక్రటరీతో ఏం చెప్పారో భగవంతుడికి తెలియాలి సెక్రటరీగారు హరిహరుని తన యింటికి పిలిపించి, తమ సత్రంలో మూడు రోజులు మించి ఉండటానికి వీల్లేదని, వేరే ఎక్కడైనా బసచూచుకోవలసిందని చెప్పాడు.

సాయంత్రానికల్లా హరిహరుడు తన బిచాణాతో సహా సత్రం వదలివెళ్లి పోవలసి వచ్చింది.

ఏటి ఒడ్డున-జనసమ్మర్దం అంతగా లేని చోట, తన మూటాముల్లె దించుకుని, ముఖం కడుక్కున్నాడు. ఆరోజల్లా తిండిలేదు. ఆ రోజున ఒక కర్రల అడితిలో, కాళీస్తోత్రం పారాయణచేయించి అడితీ యజమాని ఓ రూపాయి యిచ్చాడు. ఆ రూపాయి మార్చుకుని, బజారునుంచి కొసిని పేలాలు, కాస్త పెరుగు కొనుక్కొని తెచ్చుకున్నాడు. ఆతిండి గొంతు దిగలేదు. పది రోజులకు సరిపోయే గ్రాసం మాత్రం ఇంట్లోవుంచి ఇల్లు బయలుదేరాడతడు. ఇప్పటికి రెండు మాసాలయింది. ఇంత వరకు వాళ్లకి తాను ఒక్క దమ్మిడీ అయినా పంపించలేక పోయాడు. ఇన్ని రోజులు ఎలాగడిచి ఉంటాయి వాళ్లకి! ఇల్లు బయలుదేరివచ్చేప్పుడు తనకు పద్మపురాణం పుస్తకం ఒకటి కొనితెచ్చి పెట్టమని అపూ మరీమరీ చెప్పాడు. వాడికి పుస్తకాలు చదవటమంటే సరదా. మధ్య మధ్యవాడు చాటు గాతండ్రి పెట్టెలో పుస్తకాలు, దప్తరంలో పుస్తకాలూ తీసుకుని చదువుతూంటాడు. ఆసంగతి హరిహరుడికీ తెలుసు. పెట్టె తీసిపుస్తకాలన్నీ చిందరవందర చేస్తాడు. ఏ పుస్తకం పెట్టెలో ఎటు ప్రక్కన ఉండేదీ కుర్రవాడికి— వాడికి తెలియదు. పుస్తకాలన్నీ అటు సర్ది ఇటు సర్ది, తన దొంగతనం బయటపడకుండా ఉండాలని వ్యర్థ ప్రయత్నం చేస్తూ ఉంటాడు. హరిహరుడింటికి వచ్చి పెట్టె తెరవగానే పుత్రుడి ఘనకార్యం కనిపెట్టేస్తాడు.

హరిహరుడింటి దగ్గిరనుంచి వచ్చే ముందు ఎవరి దగ్గిరనుంచో పద్మపురాణం ఒకటి చదువుకోటానికి తెచ్చుకున్నాడు— అపూ ఆ పుస్తకాన్ని సొంతం చేసేసుకున్నాడు రోజూ చదువుతూండేవాడు- 'శ్రీవత్స రాజు వేశ్యావాటికకు చేపలు పట్టటానికై బయలుదేరిన కథ వాడికెంతో బావుంది. "ఆ పుస్తకం ఇచ్చెయ్ రా, వాళ్లు అడుగుతున్నారు" అన్నాడు హరిహరుడు. చివరకు తన కోక పద్మపురాణం కొని పెట్టేట్లు తండ్రిని ఒప్పించి-తర్వాత ఇచ్చాడు. అపూ పుస్తకాన్ని వచ్చేముందు 'ఈసారి ఏమయినాసరే ఆ పుస్తకం తప్పకుండా తెచ్చిపెట్టాలి నాన్నా!' అని లక్షసార్లు చెప్పాడు. దుర్గకు అంత పెద్ద కోర్కెలేవు తనకు ఆకుపచ్చ సిల్కు, కాస్తమంచిదిగా చూసి లత్తుక తెచ్చిపెట్ట

జరిగిన కథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్ అతని భార్య సర్వజయ కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్క నిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. బడి చదువుకూడా వాడికి ఏమీ అంటలేదు. ఇంట్లోనే తండ్రితాలూకు పుస్తకాలన్నీ చదివేస్తూ ఉండేవాడు. ఒకసారి వాళ్ల ఊళ్లోకి ఒకనాటక సమాజం వచ్చింది. వాళ్లువేసిన నాటకాలు చూసి అపూ తన్మయుడైపోయాడు. తనుకూడా పెద్దయ్యాక నాటక సమాజాల్లోచేరి నటుడైపోవాలని కలలు కన్నాడు తను చూసిన నాటకం కథ ఆధారంగా స్వయంగా ఒక నాటకంకూడా రాసేశాడు మొత్తానికి వాడి ఆదర్శాలకు ఆకాశమే అవధి. దుర్గకి మంచి సంబంధం ఏదన్నా చెయ్యాలని తల్లి ఆవేదన పడేది కాని మంచిసంబంధాలనేవి హరిహరరాయ్ కుటుంబానికి ఎన్నటికీ అందని మ్రానిపండ్లే. ఎప్పుడో ఏదో అదృష్టం కలిసివచ్చి తమ సంసారం బాగుపడుతుందనీ, దుర్గ గొప్పింటి కోడలైపోతుందనీ, అపూ పెద్దవాడై ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడనీ ఆమె కలలు కనేది కాని ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

ఒకసారి దుర్గకి జ్వరం పట్టుకుని ఎన్నాళ్ళకీ తగ్గలేదు. హరిహరుడు ఊళ్ళోలేడు. తల్లి, పిల్లలూ తిండికికూడా మొహం వాచిపోయారు. ఆఖరుకి ఒక భయంకరమైన రాత్రివేళ, వర్షం ప్రళయంగా కురుస్తున్నవేళ దుర్గ ప్రాణవాయువులు అనంతంలో లీనమైనాయి. ఆమె జనన మరణ, సుఖదుఃఖ ద్వంద్వాతీతమైన ఏదో అజ్ఞాతలోకానికి వెళ్లిపోయింది.

★ పథేర్ పాంచాలీ ★

మని చెప్పింది. వాటి అన్నిటి సంగతి అలా ఉంచుదాం, ఇల్లు అసలు ఎలాగడుస్తోందా అన్నది ఇప్పుడు గడ్డు సమస్య! చీకటి పడ్డాక మునుపటి కర్రల అడితీకెళ్ళి, ఆ రాత్రికి అక్కడ ఆశ్రయం సంపాయించాడు. సరిగా నిద్రపటలేదు పక్కమీద పడుకుని, ఇంత కాలంగయినా కాస్తో కూస్తో డబ్బు పంపటం ఎలాగా అన్న ఆలోచనలోపడి, అటూ యిటూ దొర్లసాగాడు

ప్రొద్దున్నే లేచి తిరుగుతూ తిరుగుతూ ఒకచోటుకు వచ్చి చేరాడు రాస్తాకటు ప్రక్కన ఎర్రగోడలు, పెద్ద ఇనుపగేటు ఉన్న మేడ కన్పించింది అలాగే దానికేసి చూడగా చూడగా, ఎందుకో-అక్కడికి వెళ్లి తన కష్టాలు చెప్పుకుంటే ఏదో ఉపాయం దొరుకుతుందని తోచింది. యంత్రపు బొమ్మలా గేటు దాటి లోపలకు వెళ్లాడు. నాలుగుమూలలా పూలకుండీలు, క్రింద పాలగచ్చు, చలవ రాళ్ల బొమ్మలూ-మొత్తానికి చాలా ఆధునిక పద్ధతులలో అలంకరించి ఉన్న హాలు. ఒక ప్రౌఢవయస్కుడు హాల్లో పత్రిక చదువుకుంటూ కూర్చుని ఉన్నాడు. అపరిచిత వ్యక్తి రావటం చూసి, పత్రిక ప్రక్కన పెట్టి, సరిగ్గాలేచికూర్చుని "ఎవరు నువ్వు? ఏం పని మీద వచ్చావ్?'' అని అడిగాడు.


హరిహరుడు సవినయంగా-"చిత్తం, నేను బ్రాహ్మణ్ణి సంస్కృతం చదువుకున్న వాణ్ణి పురాణం చెపుతాను, కావాలంటే గీతాపారాయణం మొదలైనవి-"

ఆ పెద్ద మనిషి అతడు చెప్పేది పూర్తిగా వినకుండానే, తన అమూల్య సమయం వృథా అయిపోతున్నట్టు తన సొదంతా వినే తీరిక లేదనట్టు-"అలాంటి అవకాశం ఇక్కడేం లేదు. మరోకచోటుకు వెళ్ళు" అన్నాడు.

హరిహరుడు ఘనం వచ్చి, "ఈ ఊరికి క్రొత్తగా వచ్చిన వాణ్ణి, చేతిలో ఏమీ లేదు, చాలా కష్టాల్లోఉన్నాను. కొన్నాళ్ల నుంచీ అసలు-"

ఆ పెద్ద మనిషి అతన్ని ఎలాగైనా సరే వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో బాలీసు క్రింద చెయ్యి పెట్టి ఏదో తీసి, "ఊఁ ఇదిగో తీసుకుని వెళ్ళు ఇంకేం లాభం లేదు. తీసుకో" అన్నాడు.

అది ఎంత విలువ ఉన్న నాణెమయినా-అది అతనే మరో ధోరణిలో మాట్లాడి ఇచ్చినా తీసుకోటానికి హరిహరుడు అంత సంకోచించే వాడు కాడేమో! అలా కొన్ని చోట్ల తీసుకుని కూడా ఉన్నాడు కాని వినయభావంతో-"చిత్తం, ఉంచండి దాన్ని నేనిలా ఊరికే ఎవరి దగ్గరా తీసుకోను నేను



హరిహరుడు నవ్వు ముఖంతో "ఏమిటే ఎలా ఉన్నారు? అంతా కులాసాగా ఉన్నారా? వీళ్లెక్కడికి వెళ్లారు? ఇంట్లో లేరల్లే ఉంది!" అని అడిగాడు.

"పథేర్ పాంచాలీ" బెంగాలీ చిత్రంలో హరిహరరాయ్‌గా కానూ బెనర్జీ, సర్వజయగా కరుణాబెనర్జీ.

పురాణం చెప్తాను, పారాయణలు చేస్తాను. కాని ఎవరి దగ్గిరా - ఎందుకు లెండి, ఉంచండి" అన్నాడు.

తర్వాత ఒక శుభయోగం కలిసి వచ్చింది ఆ వెనకటి కలప అడితిలోనే ఒక నాడొక శుభవర్తమానం తెలిసింది. కృష్ణనగర్ ప్రక్కనే ఉన్న ఓ పల్లెటూళ్ళో వర్ధిష్ణువైన ఓ వడ్డీ వ్యాపారస్తుడు-నిత్యం ఇంట్లో దేవతార్చన అదీ చేయించుకోటానికి ఓ సద్బ్రాహ్మణుడెవరైనా కావాలని తిరుగుతున్నాట్ట. అతడు స్థిరంగా అట్టేపెట్టుకుంటాడట! అతడు అడితి యజమానితో ఆ సంగతి చెప్పుతుండగానే హరిహరుడక్కడికి వెళ్లాడు...అసలు యజమానికి కూడా నచ్చాడు హరిహరుడు. ఉండటానికి ఇల్లూ అదీ ఏర్పాటు చేశాడు. ఆదరణలో లోపం చెయ్యలేదు.

కొద్ది రోజులలా గడిచాయి. దసరా పండుగ రాబోతోంది హరిహరుడింటికి బయలుదేరుతూంటే యజమాని రానుపోను ఖర్చులు, పదిరూపాయలు రొక్కం కూడా యిచ్చాడు. అక్కడి నుంచి కృష్ణనగర్ అడితీ యజమాని దగ్గిరకి సెలవు పుచ్చుకుందామని వస్తే అతడొక అయిదు రూపాయలు ఇచ్చాడు.

నిర్మలంగా ఉన్న నీలాకాశం కేసి చూస్తూంటే హఠాత్తుగా ఆనందం ప్లావితమైంది మనస్సు వర్షకాలపు ఆఖరి రోజుల్లో పచ్చగా ఉండే పైరులలోనూ, చెట్లలోనూ, పథికుల నడకల్లోనూ కూడా ఓ రకమైన ఆనందం నిహితమై ఉన్నట్టుంటుంది రైలు మార్గానికి రెండు వైపులా ఉన్న రెల్లుపూలు రైలు వేగానికి ఊగి నేలకి అంటుకున్నాయి రైల్లో వెడుతున్నంత సేపూ ఇల్లే ఊరికే గుర్తుకు రాసాగింది.

శాంతిపురం వర్తకులు కొందరు పండుగల నాటికి సరుకు తెచ్చుకోటానికి కలకత్తా వెడుతున్నారు "మాఝీఘాట్" పడవ ఎక్కి రేవుదాటుతున్నారు. కేరింతాలు కొడుతూ—ఎటు చూసినా ఆనంద కోలాహలం. రాణాఘాట్ బజారులో భార్యకీ, కొడుకుకీ, కూతురుకీ బట్టలు కొన్నాడు హరిహరుడు. దుర్గకి ఎర్రంచు ఉన్నవంటే చాలా ఇష్టం. అంచేత అలాంటిది వెతికివెతికి కొన్నాడు. ఆ అమ్మాయి చెప్పిన లత్తుక కూడా కొన్నాడు. అపూ తెమ్మన్న "పద్మపురాణం, మాత్రం ఆ ఊళ్ళో ఎక్కడా దొరకలేదు. చివరికి "సచిత్ర చండీ మహాత్మ్యం" "కాలకేతూపాఖ్యానం" రెండూ అరణాలిచ్చి కొన్నాడు వాడికోసం. సర్వజయ ఇంట్లోకి కావాలని

చెప్పిన ఒకటి రెండు చిన్న సామానులు కూడా కొన్నాడు

రైలు దిగి నడిచి సాయంత్రానికల్లా స్వగ్రామానికి చేరుకున్నాడు. దారిలో ఎవరూ అంతగా కన్పించలేదు. కన్పించినా చూసీ చూడనట్లు తలవంచుని ఆదుర్దాగా ఇంటికేసి నడిచాడు. గుమ్మంలో అడుగు పెడుతూనే "ఆ వెదురు గుబురు గుబురంతా పాంతం గోడమీదికి పడిపోయిందే. భువన బాబాయ్ దాన్ని కొట్టించమంటే కొట్టించడు. పెద్ద చిక్కు వచ్చి పడింది. అనుకుంటూ లోపలికి వెడుతూ అలవాటు ప్రకారం ఆదుర్దాగా—"అమ్మా దుర్గా, అపూ!" అంటూ పిలిచాడు.

అతడి కంఠం విని సర్వజయ ఇంట్లోంచి బయటికి వచ్చింది.

హరిహరుడు నవ్వు ముఖంతో—"ఏమిటే ఎలా ఉన్నారు? అంతా కులాసాగా ఉన్నారా? పిల్లలెక్కడికి వెళ్లారు? ఇంట్లో లేరల్లే ఉంది!" అని అడిగాడు.

సర్వజయ ఏమీ తొణక్కుండా వచ్చి భర్త చేతిలో బరువుగా ఉన్న మూట అందుకుని, "రండి, లోపలికి రండి" అంటూ లోపలికి దారితీసింది. భార్యలో ఎన్నడూ లేని అంత శాంతభావాన్ని హరిహరుడు గమనించినా అతడి మనసుకేమీ సందేహం కలగలేదు. అతడి ఆలోచనలు, ఊహలు మరోవైపుగా పరుగెత్తుతున్నాయి—"పిల్ల, పిల్లవాడు ఇప్పుడే పరుగెత్తుకుని వచ్చేస్తారు దుర్గ నవ్వుతూ వచ్చి ఇన్నాళ్లు చేశావేం నాన్నా!" అని అంటుంది అప్పుడే హడావిడిగా తాను తెచ్చిన మూట విప్పి, పిల్లదానికోసం తెచ్చిన లత్తుక డబ్బీ, గుడ్డలు, పిల్లవాడికోసం తెచ్చిన పుస్తకాలు, రైలుబొమ్మ చూపించి వాళ్ల చూపుల్ని ఆకర్షింపచేస్తాడు. అతడు ఇంట్లోకి వస్తూ—"ఈసారి నువ్వు చెప్పిన వస్తువులు తెచ్చాను"—అంటూనే చుట్టూ కలయచూసి, దిగాలుపడుతూ—"ఏరీ అపూ, దుర్గా? ఎక్కడికైనా వెళ్లారా యేం?" అని అడిగాడు.

సర్వజయ ఇంక ఆపుకోలేకపోయింది. "ఇంకెక్కడ దుర్గ! అది మనల్ని విడిచి పోయిందండీ! ఇన్నాళ్లు ఎక్కడున్నారు?" అంటూ బావురుమంది...

* * *

గంగూలీ గారింట చాలా రోజులవరకు పూజలూ అవీ జరుగుతాయి ఆ జరిగినన్నాళ్ళూ ఊళ్లో ఎంత దరిద్రుడైనా పస్తు ఉండటమంటూ ఉండదు ఏర్పాట్లన్నీ కట్టుదిట్టంగా జరుగుతాయి నిర్దిష్ట సమయానికి కుమ్మరివచ్చి ప్రతిమను చేసి యివ్వటం, మాలివచ్చి ఆ ప్రతిమను అలంకారం చెయ్యటం లాంటి వన్నీ యథావిధిగా జరిగిపోతాయి 'బాఫురీ'లు కొలనులోనుంచి తామరపూలు కొల్లలు కొల్లలుగా తీసుకువస్తారు.

సన్నాయి పాటకుడు దీనూ యేటా వచ్చినట్లు ఈయేడూ వచ్చాడు ప్రభాతవేళ ఆకాశంలో 'ఆగమనగీతి' ఆలాపన వినిపిస్తోంది. రానున్న హేమంత ఋతువుకి, నవధాన్యలక్ష్మికి, నవశేఫాలికా కుసుమాలకి, హిమాలయాలు దాటిపయనించి వచ్చే భరద్వాజ పక్షికి, శిశిరస్నిగ్ధ మృణాల శోభిత హేమంత సంధ్యకు-స్వాగతగీతి అది క్రొత్త బట్టలకట్టుకుని, పిల్లవాణ్ణి వెంటపెట్టుకుని, హరిహరుడు భోజనానికి వచ్చాడు జుట్టు రేగి ఉన్న ఓ చిన్న ముఖం తన నేదో నిర్బంధం చేస్తున్నట్లు లీలగా కన్పించిందతనికి. వీధిలోకి రాగానే పరధ్యానంలో పడి "పదరా చాలా ప్రొద్దెక్కిపోయింది" అన్నాడు హరిహరుడు కొడుకుతో.

గంగూలీగారింట ఉత్సవం జరిగే చోటు నవ్వుముఖాల పిల్లలతో నిండిపోయింది సతూ, వాడితమ్ముడు నారింజరంగు చొక్కాలు తొడుక్కుని ఉంటే అపూ వాళ్లకేసి అదే పనిగా చూడసాగాడు చక్కగా తలదువ్వుకుని, ఆకుపచ్చరంగు చీరకట్టుకుంటే రాణూ దీదీవాడి కెంతో బావుంది! గంగూలీ గారింట్లో సునయనీ అనే అమ్మాయి తల్లో శేఫాలీపూలు తురుముకుని, నలుగురయిదుగురు పిల్లలతో కలసి, అపూ మందిరం దగ్గర నవ్వుతూ, తుళ్లుతూ ఒకటే కబుర్లు చెపుతోంది సునయని మిగిలిన పిల్లల్ని ఎరగదల్లే ఉంది ఈపూజా ఉత్సవాలకి పొరుగూరి నుంచీ వచ్చి ఉంటుంది ఆవాలకం అదీ చూస్తే బస్తీ పిల్లలా ఉంది. అపూ ఆపిల్లకేసి రెప్పవాల్చకుండా చూడసాగాడు "ఆ పెద్ద మంటపం ఇక్కడికి తీసుకువచ్చే యేర్పాట్లు చెయ్యలేరూ ఇంకా? ఏంపనులు చేస్తార్రా! ఇంక చూడండి చిత్రం. అయితే ఇహ అయిదుగంటలకేనా యేం భోజనాలిహ!' అని ఎవరో కేకేస్తున్నారు.

27

చూస్తూ చూస్తూ ఉండగానే రోజులు గడిచిపోతున్నాయి. శీతకాలం కూడా వెళ్ళిపోతోంది

దుర్గ పోయినదగ్గర్నుంచీ ఈ వూరునుంచి వెళ్లిపోదామని సర్వజయ నిత్యమూ భర్తను పోరుతోంది హరిహరుడు కూడా ప్రయత్నలోపమేమీ చెయ్యలేదు కాని ఎక్కడా ఏమీ కలిసి రాలేదు. సర్వజయ ఇంక ఆ ఆశ ఇంచుమించు వదిలేసుకుంది ఈ లోపున శీతకాలం రాగానే హరిహరుని దాయాది సోదరుడైన నీలమణిరాయ్ భార్య ఇక్కడికి వచ్చింది తమ ఇల్లూ అదీ పాడుపడిపోవటంతో భువన ముఖర్జీగారింట్లో దిగింది హరిహరుడు వదినగారిని తన యింటికి రమ్మని చెయ్యవలసిన బలవంతం అంతా చేశాడు కాని ఆమె అందుకు అంగీకరించలేదు. ఇక్కడికి ఆమెతో కూడా ఉండేందుకు ఆమె వెంట కూతురు అతసీ, చిన్న కొడుకు సునీల్ కూడా వచ్చారు. పెద్ద కొడుకు సురేష్ కలకత్తాలో స్కూల్లో చదువుతున్నాడు వేసవిసెలవు లివ్వందే రాడు ఇక్కడికి. అతసికి పధ్నాలుగేళ్లుంటాయి సునీల్‌కి ఎనిమిదో యేడూ సునీల్ అంత బాగుండడు అతసి చక్కగానే ఉంటుంది. కాని పెద్ద అందకత్తె యేంకాదు. అయినా వీళ్లు లాహోరులో

...న్నవా ళ్ళిదివరకు దాకా. నీలమణిరాయ్ అక్కడ 'కమిసరేట్' లో పనిచేసేవాడు వీళ్లు పుట్టింది అక్కడే అక్కడే పెరిగారు. అంచేత పశ్చిమదేశంలో సహజసిద్ధమైన ఆరోగ్యం వీళ్ళ అవయవాల్లో ప్రస్ఫుటిత మవుతూ ఉంటుంది

వీళ్లు మొదట్లో ఇక్కడకు రాగానే సర్వజయ తోటకోడలితో చనవు ఏర్పరచుకోటానికి ప్రయత్నించింది సునీల్ తల్లి దగ్గిర నగదు కాని, ఏ బాపతుఅయినా కాని పదివేలదాకా ఉన్నాయని తెలిసేసరికి ఆవిడ మీద ఎంతో గౌరవం ఏర్పడింది పూసుకుని తిరిగి చనువు చేసుకోటాని కెంతగానో ప్రయత్నించింది కాని చివరికి సర్వజయ ఎంత అమాయకురాలైనా సునీల్ తల్లి అంత చనువుగా ఉండటానికి ఇష్టపడటం లేదన్న సంగతి గ్రహించింది ఆమె భర్త చాలా కాలం పెద్ద ఉద్యోగం చేసినవాడు తను, తన పిల్లలు కూడా మరొక రకపు జీవితానికి అలవాటు పడినవాళ్లు ఆమె మొదటినుంచీ పేద దాయాది అయిన హరిహరుని కుటుంబానికి, తన కుటుంబానికీ మధ్య కొంత దూరం అట్టే పెడుతూనే ఉంది; సర్వజయే ఆ దూరాన్ని త్రోసిపుచ్చుతోంది కాని ఆమె తన ప్రతి మాటలోనూ, చేష్టలోనూ కూడా సర్వజయ తనతో కలసిమెలసి ఉండగల అర్హతకలది కాదన్న సంగతి స్పష్టంగా వ్యక్తంచేయసాగింది తమ వేషభాషల్లోనూ, ప్రవర్తనలోనూ కూడా తాము ఐశ్వర్యవంతుల మన్న సంగతి యెప్పుడూ బయటపెడుతూనే ఉండేది పిల్లలెప్పుడూ ముస్తాబయి ఉండేవాళ్లు చొక్కా కాస్త మాయటానికి వీల్లేదు జుట్టు రవంత రేగటానికి వీల్లేదు. అతనికి మెళ్ళో గొలుసు, చేతులకు బంగారపు గాజులు, చెవులకు జూకాలు ఉన్నాయి ప్రొద్దున్నే గిన్నెడు చిరుతిండి తిని, చెంబెడు టీ త్రాగనిదే పల్లెక్కడికీ కదలటానికి వీల్లేదు వెంట పశ్చిమదేశపు నౌకరు ఒకడున్నాడు ఇంటిపనులన్నీ అతడే చేస్తాడు మొత్తంమీద సర్వజయ పేద సంసారంతీరుకీ, వాళ్ళ సంసారం తీరుకీ పోలెడంత వ్యత్యాసం ఉంది

సునీల్ తల్లి తన పిల్లల్ని ఊళ్లో పిల్లలతో అంత కలసి మెలసి తిరగనిచ్చేది కాదు అపూతో నయినా సరే తిరగనిచ్చేది కాదు పల్లెటూరి పిల్లలందరూ అనాగరికులు వీళ్ళతో కలసి తిరిగితే తన పిల్లలు పాడై పోతరని ఆమె ఉద్దేశ్యం ఆమె ఈ ఊళ్లో కాపురం ఉండాలని రాలేదు 'సర్వే' సమయంలో తమ గ్రామముల అజమాయిషీ చూసుకుందామనే ఉద్దేశ్యంతో వచ్చింది భువన ముఖర్జీ దగ్గిర వీళ్ళ డబ్బు కొంత ఉంది అంచేత అతడు పడమటివైపు ఇంట్లో రెండు గదులు వీళ్ళకి కేటాయింపుగా ఇచ్చాడు. వీళ్లు వంట, భోజనాలు వేరుగా చేసుకుంటున్నారు భువనముఖర్జీ వాళ్ళతో సునీల్ తల్లి కలసిమెలసే వ్యవహరించేది ఎంచేతంటే అతడూ డబ్బున్నవాడే కాని సర్వజయనిమాత్రం ఒక మనిషిగానే లక్ష్య పెట్టేదికాదు.

హోలీ పండుగకి నీలమణిరాయ్ పెద్ద కొడుకు కలకత్తానుంచివచ్చి ఇంచుమించుపది రోజులున్నాడు. సురేష్ అపూ ఈడువాడే ఇంగీషుస్కూల్లో అయిదోక్లాసు చదువుతున్నాడు అంత పచ్చటిపసిమి కాదు చామనచాయగా ఉంటాడు నియమంగా వ్యాయామం చేస్తాడు కనుక దృఢంగా ఉంటాడు అపూకంటె ఒకయేడుమాత్రమే పెద్దవాడైనా పదిహేను పదహారేళ్లవాడిలా కన్పిస్తాడు. సురేష్ కూడా ఈవిధిలో పిల్లలతో ఎవరితో కలిసి తిరగడు. ఆ వీధి రామనాథగంగూలీ కొడుకు అతడి సహాధ్యాయి గంగూలీగారింట హోలీకి పెద్ద ఉత్సవం జరుగుతుంది అంచేత అతడూ నాలుగు రోజులపాటు మేనమామలింట ఉండిపోదామని వచ్చాడు సురేష్ రోజూ ఎక్కువసేపు అక్కడే గడుపుతుంటాడు ఊళ్లో ఇంక ఏ పిల్లలూ తనతో కలిసి తిరగటానికి అర్హులు కారని అతడి ఉద్దేశ్యం అయిఉంటుంది.

తాను బుద్ధి యెరిగినప్పట్నుంచీ పాటుపడి, అపువిలా తయారైన ప్రక్కయింటి పిల్లలు వీళ్లు. అంచేత వాళ్లంటే అపూకొక విచిత్రమైన ఆకర్షణ తన యీడువాడైన సురేష్ కలకత్తాలో చదువుతున్నాడు. సెలవుల కిక్కడికివస్తే అతగాడితో మాట్లాడాలని అపూ యెదురుచూస్తున్నాడు. కాని సురేష్ వచ్చాడన్న మాటే కాని తనతో సావాసం చెయ్యలేదు. పైగా సురేష్ మాట తీరు అదీ చూస్తే అతడు ఊళ్లో పిల్లలందరి కంటె ఓమెట్టు పైవాడన్నట్లుంటాడు తన యీడువాడైనా వస్తుతః ముఖబిడియం గల అపూ మరింత భయపడి అతడి చాయలకైనా పోలేదు.

అపూ ఇంతవరకు ఏబళ్లోకీ వెళ్లలేదు. సురేష్ వాడి చదువుని గురించి అడిగితే 'నేను ఇంట్లో మానాన్నదగ్గిరే చదువుకుంటున్నాను' అని చెప్పాడు అపూ. హోలీనాడు గంగూలీగారి చెరువు తూము దగ్గిర, ఆలివుచెట్టుక్రింద కూర్చుని సురేష్ ఊళ్లోపిల్లలను—దిగ్విజయుడైన తార్కికుని లాగా ఆప్రశ్నలూ-ఈప్రశ్నలూ అడగటం మొదలెట్టాడు అపూని "ఇండియా ఎల్లలేవో చెప్పగలవూ? జాగ్రఫీ ఏమైనా తెలుసా?" అని అడిగాడు. అపూ చెప్పలేకపోయాడు. సురేష్ మళ్లీ-' లెఖ్ఖలెంత వరకు వచ్చు? డెసిమల్ ఫ్రాక్షన్స్ చెయ్యగలవా?" అని అడిగాడు.

అపూ అంతపారంగతుడు కాడు. కాక పోతే యేం, వాడి రేకు పెట్టెలో తక్కువ

★ పథేర్ పాంచాలీ ★

పుస్తకాలున్నాయా! 'నిత్య కర్మ పద్ధతి' ఒకటి, 'ప్రాకృతిక భూగోళం' ఒకటి, 'శుభంకర్' (లెఖ్ఖల పుస్తకం పేరు) ఒకటి, అట్టలు చిరిగిపోయిన వీరాంగనా కావ్యం, తెలి పుస్తకం నహా భారతం—ఇవన్నీ ఉన్నాయి వాడు ఇవన్నీ చదివాడు ఎన్ని సార్లు చదివినా మళ్ళీమళ్ళీ చదువుతూంటాడు. వాళ్ళనాన్న ఎంతో ఆలోచించి ఆలోచించి, అక్కడినుంచి ఇక్కడనుంచి పుస్తకాలు తీసుకువస్తూ ఉంటాడు కొడుకు బాగా చదువుకోవాలి పండితుడు కావాలి, ప్రయోజకుడు కావాలి—అన్ని విషయాలలో ఉన్నత్తునిలా తండ్రికి అణచుకోలేనంత 'ఆశ' ఉంది కాని అతడికి డబ్బులేదు ఏ బోర్డింగ్ స్కూలులోనయినా ఉంచటానికి స్తోమతలేని వాడు తానయినా పెద్ద చదువుకున్నవాడే కాదు అయినా తాను ఇంట్లో ఉన్నంతసేపు కుర్రవాణ్ణి దగ్గిర కూర్చోపెట్టుకుని అదీ ఇదీ





చదివిస్తూ ఉంటాడు పిల్లవాడికి లెఖ్ఖలు చెప్పటానికి 'శుభంకరీ' సహాయంతో తాను చిన్నప్పుడు నేర్చుకొని మరిచిపోయిన లెఖ్ఖల్ని బూజు గులిపి వాడికి నేర్పుతుంటాడు, పిల్లవాడికి జ్ఞానాన్ని కలిగించే పుస్తకాల్నే వాడిచేత చదివిస్తాడు లేదా తాను చదివి వినిపిస్తూంటాడు అతడు చాలా కాలంనుంచి 'బంగవాసి' పత్రికకు చందాదారు. పాతపత్రికలన్నీ ఉన్నాయి ఇంట్లో పిల్లవాడు పెద్దవాడైనాక చదువుకుంటాడనే ఊహతోనే వాటిని కట్టలుకట్టి ఉంచాడు. అవి ఇప్పుడు ఉపయోగిస్తున్నాయి మళ్ళీ చందా చెల్లించక పోవటం వలన క్రొత్త పత్రికలు రావటంలేదు పత్రికా ప్రతినిధులు పత్రిక పంపటం నిలిపేశారు. అపూకి బంగవాసి అంటే ఎంత ఆసక్తి అని! శనివారం వచ్చిందంటే ఆటలూ అవీ కట్టిపెట్టి భువన ముఖర్జీగారి మంటపం దగ్గిర పోస్టుప్యూన్‌కోసం ఎదురుచూస్తూ కూచుంటాడు హరిహరుడికదంతా తెలుసు పిల్లవాడికి అంత అప్యాయమైన వస్తువును తెప్పించలేక పోతున్నందుకతడు మనస్సులో వ్యథపడుతూంటాడు.

అయినా అపూ పాత బంగవాసి సంచికలు చదివి చాలా కథలు నేర్చుకున్నాడు. కాని బడిచదువు అంతగా అబ్బలేదు వాడికి బంపెపద్ధతి లెక్కలు కొంతవరకు వచ్చు ఇహ చరిత్ర, వ్యాకరణం, జాగ్రఫీ ఇలాంటివేమీ రావు. జామిట్రీ-గీమిట్రీ ఆపేర్లెమీ తెలియవు ఇంగ్లీషులో ఫస్టురీడర్ లో సార్స వాంవరకు అవగ్గశం వాడికి.

పిల్లవాడి భవిష్యత్తు విషయమై తల్లికి ఉన్న ఉద్దేశ్యాలు వేరు సర్వజయ పల్లెటూరిలో పుట్టి పెరిగిన మనిషి కొడుకు స్కూల్లో చదువుకుని గొప్పవాడు కావాలనే పెద్ద పెద్ద ఆశలు లేవు ఆమెకి తనకు అయినవాళ్ళలో స్కూలుముఖం చూసిన వాళ్ళెవరూ లేరు తమకు కొన్ని శిష్యుల యిళ్లు ఉన్నాయి కొడుకు పెద్దవాడై ఆ యిళ్ళకు తిరిగివస్తూవుంటే చాలు, అవి జారిపోకుండా ఉంటాయి-అదేదే ఆమె ఆశ. సర్వజయకి మరొక ఉద్దేశ్యంకూడా ఉంది ఊళ్లో పురోహితుడు దీనూభట్టాచార్య వృద్ధుడైపోయాడు. ఆయనకు చేతికి అక్కరకొచ్చే పిల్లలుకూడా లేరు తమ ఇహ ఏ శుభకార్యంవచ్చినా ఇహ అపూనే పెట్టుకుంటామని, భట్టాచార్యల అనంతరం ఆయన గంజాయిదమ్ము కొడుకుకి ఒగలుగా పిక్కలంకుడు, అమాయకుడూ అయిన ఈ కుర్రవాడే ఊళ్ళో పూజలూ అవీ

చేయించటానికి ఉపకరిస్తాడని—రాణీవాళ్ళ అమ్మ, గోకుల్ భార్య, గంగూలిగారి పెద్ద కోడలూ తమ ఉద్దేశాన్ని వలిబుచ్చారు. ఊళ్ళో స్త్రీలంతా కూడా ఇదే కోరుకుంటున్నారు అపూ అంటే అందరికీ అపేక్ష. ఇరుగు, పొరుగు, నీలాటిరేవుకి వచ్చేవాళ్లు అభిప్రాయాల్ని వ్యక్తంచెయ్యటం సర్వజయ చాలాసారు విన్నది ప్రస్తుతం ఇదే ఆమెకి ఉన్న పెద్ద ఆశ ఆమె పేదయింటి పడుచు, పేదయింటి కోడలు—ఇంతకు మించిన ఉన్నతాశయాలు ఆమెకి లేవు ఇలా జరిగితే ఆమె కలలన్ని ఫలించినట్టే!

ఓ రోజున ఈ సంగతే భువన ముఖర్జీగారింట్లో వచ్చింది మధ్యాహ్నం గవ్వలాటకి వాళ్ళింటికి చాలా మంది వచ్చారు. సర్వజయ అందరి మనస్సులకు నచ్చేటట్లు—"ఇదిగో పిన్ని ఉన్నది, అమ్మమ్మ ఉన్నది, చిన్నక్క ఉన్నది మీ అందరి దయఉంటే వచ్చే ఫాల్గుణ మాసంలో అపూ మెళ్ళో జంధ్యప్పుపోచకాస్తా వేసుకుని, ఊళ్ళో పూజలూ అవీ చేయించటానికి వస్తూ ఉంటాడు. అలా జరిగితే ఇంకేం కావాలి? పది పన్నెండు శిష్యుల యిళ్లున్నాయి. సిద్ధేశ్వరి తల్లి దయవల్ల గంగూలీ గారింట్లో పూజకి కూడా కూర్చో గలిగాడంటే-" అన్నది

సుశీల్ తల్లి ప్రక్కకు తిరిగి నవ్వుకుంది. తన పెద్ద కొడుకు ప్లీడరీచదివి-తన పెత్తండ్రి కొడుకు పాట్నాలో పెద్ద వకీలు - అతడి దగ్గిర ఉంటూ ప్రాక్టీసుచేస్తాడు ఆ సురేష్ మామకి కూడా పిల్లలులేరు, బాగా పేరున్న వకీలు సురేష్‌ని ఇప్పట్నుంచీ దగ్గిర పెట్టుకుని చదివించాలని ఉన్నది వాళ్లకి కాని సుశీల్ తల్లి తన బిడ్డను పరాయి యింట పెట్టటం లేనికో—ఆ సంగతులన్ని అమాయకురాలైన సర్వజయలాగా అందరి ముందూ బయటపడి వాగకపోయినా, మొత్తానికి ఆ మాటా అమాటా సందున ఆ వీధిలో వాళ్ళకందరికీ చెప్పేసింది

భువన ముఖర్జీ గారింట్లోంచి బయటికి వచ్చాక సర్వజయ "ఒరేయ్, మాటరా" అని కొడుకును దగ్గరకు పిలిచి, తర్వాత రహస్యంగా—

"నువ్వు మీ పెద్దమ్మ దగ్గరకెళ్లి, పెద్దమ్మా! నాకు చెప్పులు లేవు, ఒక జత కొని పెట్టవూ అని అడగరా" అని చెప్పింది.

"ఎందుకమ్మా?" అని అడిగాడు అపూ.

"బిగ్గరగా అలా అనకు. వాళ్లు భాగ్యవంతులు. బుద్ధిపుడితే మంచి జత ఒకటి కొనిపెట్టవచ్చు. సురేష్ కాళ్లకి ఎలాంటివి ఉన్నయ్యో చూడలా; నీ కాళ్లకు అలాంటి ఎర్ర చెప్పులు బావుంటాయి."

అపూ సిగ్గుపడుతూ—"నాకు తగని సిగ్గు అమ్మా! నేను అడగలేను ఏమనుకుంటుందో ఏమో!" అన్నాడు.

"దీనికి పెద్ద సిగ్గెందుకురా? కావలసినవాళ్ళేగా, అడిగితే ఏం?"

"ఊహూఁ. నేను అడగలేను అమ్మా! పెద్దమ్మ ఎదుటపడి మాట్లాడలేను నేను"

సర్వజయ కోప్పడుతూ—"అవునే ఏం మాట్లాడగలుగుతావ్? నీ తెలివంతా ఇంట్లో మూల కూర్చున్నంతసేపే. ఒటికాళ్ళతో ఊరంతా చుట్టిరమ్మంటే వస్తావు. రెండేళ్ల నుంచి కాలికి చెప్పు అనేది లేకపోతే అదే బాగుందినీకు! కలిగినవాళ్లు కావాలంటే కొని పెట్టినా పెట్టగలరు. కాని నీ నోట్లోంచి మాట పెకలదుగా! బిడియస్తులలో పెద్ద వాడివి—" అన్నది.

పూర్ణిమరోజున రాణీవాళ్ళింటికి సత్యనారాయణస్వామి ప్రసాదం తెచ్చుకోటానికి వెళ్లాడు అపూ. రాణీ వాణ్ణి పిలిచి నవ్వుతూ, "ఇదివరకు మా యింటికి అన్ని సార్లు వచ్చేవాడివి, ఇప్పుడు రావటమే మానేశావ్ ఎందుకనిరా?" అని అడిగింది.

"ఎందుకు రావటంలా రాణీదీ!—వస్తానుగా!"

రాణీ అభిమానంతో: "ఆఁ. వచ్చావులే మహా! నేను నిన్ను ఎన్నిసార్లు తలుచుకుంటూ ఉంటాను! నువ్వెప్పుడైనా తలుచుకుంటావ్ మమ్మల్ని?" అన్నది.

"భలే. ఎందుకు తలుచుకోను! మాఅమ్మని అడిగిచూడు ఇంకా"

ఇంతకుతప్ప సంతోషకరమైన ప్రస్తావన ఏం తోచలేదువాళ్ళకి. రాణీ వాణ్ణి అక్కడే నుంచోమని చెప్పి, లోపలకువెళ్లి వాడికి పళ్లూ, ప్రసాదం, 'సందేశ్' తెచ్చి పెట్టింది. నవ్వుతూ "ఈ పళ్లెం పళ్లెం తీసుకు వెళ్లు రేపు నేనువచ్చి పిన్ని దగ్గిర్నుంచి ఒట్టి పళ్ళెం తెచ్చుకుంటానులే" అన్నది.

రాణీ నవ్వు చూసేసరికి, ఆ పిల్లమీద విశ్వాసం ఏర్పడింది వాడికి. రాణీదీకి ఇటీవల ఎంత చక్కదనం వచ్చింది!

అపూ ఇంతవరకు ఏ అమ్మాయిలోనూ అంత అందం చూడలేదు. అతసీదీ ఎప్పుడూ టిప్‌టాప్‌గా ముస్తాబవుతుంది. కాని రాణీదీకి దీటురాదు. అదీకాక ఈ ఊళ్లో రాణీదీ మనస్సులాంటి మనస్సుకలవాళ్లు మరెవరూ లేరన్న సంగతి అపూ తెలుసుకున్నాడు. అక్క తర్వాత తాను ఎవరినైనా ప్రేమిస్తున్నాడంటే రాణీదీనే. రాణీకికూడా తనమీద ఎంత అపేక్షో వాడికి తెలియదటా!...

అపూ ఆ పళ్ళెం తీసుకుని వెళ్లబోయేముందు కొంచెం సంకోచిస్తూ "రాణీదీ! మీ యీ పడమరవైపుగదిలో అలమరాలో ఉన్న పుస్తకాలు సతూదా చదువుకోటానికి ఇవ్వమంటే ఇవ్వలేదు. నువ్వు ఒక పుస్తకం ఇస్తావ్? మళ్లీ చదవగానే ఇచ్చేస్తాను" అని అడిగాడు

"ఏం పుస్తకాలవి? నాకు తెలియదే. ఉండు చూస్తాను"

సతూ మొదట్లో ఒప్పుకోలేదు. చివరికి - "సరే ఇస్తాను, కాని ఓ పనిచేస్తావా! మా పొలందగ్గిర చెరువులో రోజూ చేపల దొంగతనం జరుగుతోంది. మధ్యాహ్నం పూట నన్ను అక్కడికివెళ్లి కాపలా ఉండమని చెప్పాడు మా పెదనాన్న. ఒంటరిగా అక్కడికివెళ్లి ఉంటే నాకేం తోచటంలేదు. నా బదులు నువ్వువెళ్లి కాపలా ఉంటానంటే ఇస్తాను పుస్తకాలు—" అన్నాడు.

"బాగుంది! చిన్నవాడు. వాడు ఆ అడవి మధ్యకెళ్ళి కూర్చుని కాపలా కాస్తాడా? పెద్దవాడివి నువ్వువెళ్ళి కూర్చోలేవుకాని, ఇహ చిన్నవాడు వాడువెళ్ళి కూర్చోగలడా? ఫో, నువ్వేమీ ఇవ్వనక్కరలేదులే పుస్తకాలు. నేను నాన్ననడిగి తీసుకుని ఇస్తాను!" అన్నది రాణీ.

అపూ అందుకు ఒప్పుకున్నాడు. రాణీ తండ్రి భువనముఖర్జీ ప్రస్తుతం ఊళ్లోలేడు. వాడికా పుస్తకాలు చదవాలని మహా తహతహగాఉంది. వాటి నన్నిటినీ చదువుదామనే ఆబకొద్దీ సతూ వాళ్ళ ఈ పడమటి వైపు గదికి ఎన్నాళ్లనుంచో వస్తున్నాడు. ఒక పుస్తకం, అరపుస్తకం చదవనుకూడా చదివాడు. సతూ వాటిని చదవనూ చదవడు. తనకి ఇవ్వనూ ఇవ్వడు. కథానాయకుడు మంచి క్లిష్టస్థితిలోఉన్న ఘట్టం చదువుతూండగా వచ్చి,

"అదలా ఉంచరా అపూ! ఇవి మా చిన్నబాబాయి పుస్తకాలు, చిరిగిపోతాయి ఎందుకొచ్చిందిలే" అని చేతిలో పుస్తకం లాక్కున్నాడు సతూ.

అపూ కిప్పుడు అరచేతికి చిక్కింది వైకుంఠం! [ఇంకా ఉంది.]

'అర్థాన్వేషణం'

అనగనగా ఒక భావి భారత పౌరనిర్మాత.

శివాజీ గురువుకి జీతం ఎంత ఇచ్చేవాడో తెలియదుగాని, ఆయన నెలజీతం..

అంగళ్ళ ఒకనరసన్న మేస్టారిజీతంఎంతో పబ్లీకున చెప్పకోకపోయినా రూపాయికి రెండేసి రూపాయల బదులు, కనీసం మూడు ఇప్పిస్తే, ఈ పూటా ఆ పూటా ఇబ్బంది అట్టే లేకుండా కాలక్షేపం చెయ్యవచ్చు. అంటే సరిపోవచ్చు

నరసన్న మేస్టారికి ఈ మూడో అర్ధరూపాయే సమస్య పెద్ద సమస్య గంపెడు పిల్లల 'తల్లి-సమస్య' సర్కారువారు మూడో అర్ధరూపాయకి బదులు మూడువందల సలహాలూ, ముప్పైవేలమిలూ, కొల్లలుగా కన్నీళ్ళు, చదివించారు అవన్నీ కూడి, గణించి, భాగించి, అవస్థపడి జీర్ణించుకున్న తరవాత బెంగపడే మేస్టారు, బాధపడే భార్య వేధించే కుమారరత్నం, కుమారీ మణి, దొరకని మూడో అర్ధరూపాయ, దానికోసం నోరు తెరచుకు కూర్చున్న బియ్యపు డబ్బా, బొగ్గులబస్తా, పోపుల పెట్టె, బాకీలిస్టు, కొళ్ళనిమార్కు శేషం వచ్చాయి

ఈ కూడని శేషం రాకూడదని ఆయన ఆశ అందుకు నరసన్నగారికి తెలిసినదారి ఒకటే పట్టాభిషేకం అయి బడిపంతులు ఉద్యోగం చేపట్టిన నాటినుండి ఆయన ఆ దారినే నడుస్తున్నాడు...

* * *

ఒక ఆదివారం ఉదయం ఆయన, దొరకని మూడో అర్ధరూపాయకోసం గోదాక్కు దానికి మస్తాబయ్యాడు అప్పటికి ఆయన జీతం అంది కొంతకాలమే అయినా, ఇంకొంతకాలంలోనే అందొయ్యబోతోందని రూఢిగా వార్తలు అందడంతో కొంత హుషారు, యింకొంత ధైర్యం వచ్చాయి దానికి తోడు అటుమొన్నటి వార్తాపత్రికలో పెద్దల ఉపన్యాసాలు బోలెడు ధైర్యం చెప్పాయి అందరికన్న నువ్వే గొప్పవాడివి సుమీ అన్నాయి వేళ వశ దెబ్బ ముత్యమా అని అడిగాయి కాదు సుమా అని అవే జవాబు చెప్పాయి భావి భారతభాగ్యవిధాతలను రూపొందించి, తీర్చి దిద్దడంలో నరసన్నగారు మహత్తరభూమిక నిర్వహిస్తున్నట్లు శ్లాఘించి, అది ఎంతమహత్తరమో విడిగా ఎలుగెత్తి చాటాయి నరసన్నగారు సగర్వంగా తల తాటించాడు. ఆరేవతా వస్త్రాలు ధరించి, ఒకసారి వంటింట్లోకి తొంగిచూచాడు 'జానకీ'.. అని పిలిచాడు "నేనేంచేస్తున్నానో తెలుసా?" అన్నాడు దర్జాగా

"ఏముంది అప్పుకి బయల్దేరుతున్నారు" అందావిడ; చారు పోపులో వేసే మిరపకాయలని రెండుతో భాగించవలసి వచ్చినందుకు విచారిస్తూ.

నరసన్నగారు ఫకాలున నవ్వి, "అది మామూలుకథే నేను చేస్తున్న మహత్తరమైన పనిఏమిటో?" అన్నాడు. ఆవిడ మాట్లాడలేదు.

"భావిభారత భాగ్యవిధాతలను తీర్చి దిద్దుతున్నానుట"

ఆవిడ నవ్వింది "ఉద్ధరిస్తున్నారులెండి కాని."

"మరే అది కూడా చేస్తున్నానట ఆ ముక్క కూడా పత్రికలో రాశారనుకో"

"ఇప్పటికి అయింది చాలు గాని, శేషయ్యగారొచ్చి కూర్చుంటాడు పీకల మీద త్వరగా వెళ్ళి ఆ యాభై పుట్టించుకు రండి లేకపోతే చెంబూ తపేలా వేలం వేస్తాడు" అందావిడ

"వెళ్తున్నానుగా. నాకు మాత్రం ఏరోడ్డుతొక్కినా ఎవడో ఓఋణపిశాచం, అమాంతంమీద వాల్తాడని భయంగా ఉంది"

అంటూనే ఆయన గుమ్మందాటి వీధులో కాలు పెట్టాడు పెడుతూనే ఓ పెద్ద సైజు ఋణదరాజు సుడిగాలిలా వచ్చి, నరసన్నగారిని నానామాటలూఅనేసి ఉక్కిరిబిక్కిరి చేసేసి హాట్‌హాట్ అనేసి హుషలకొట్టేసి రివ్వున వెళ్ళిపోయాడు.

ఆరోజు సాయంత్రానికల్లా బాకీ చెల్లించకపోతే మర్నాడు సోమవారం బళ్ళో కొచ్చేసి, ఒంటిగంటలోగా పరువునిపట్టేటి, సాయంత్రానికల్లా ఉద్యోగాన్ని గంగలోనూ కలిపేస్తానని ధైర్యంచెప్పి మరీ వెళ్ళాడు ఋణదుడు.

నరసన్నగారు సగం చచ్చిపోయారు మిగతా సగంతోటే అర్థాన్వేషణకి బయల్దేరాడు. అడుగునా ఒక సుడిగాలి వచ్చిపడేది. ఒకొక్కసారి అది వడగాలిగావచ్చి గూబ వాయగొట్టేది. ఎక్కడికక్కడ సంజాయిషీ ఇచ్చుకుంటూ, క్షమాపణ చెప్పుకుంటూ వాయిదా వేడుకుంటూ అడుగులు వేస్తున్నాడు నరసన్నగారు

సుడిగాలికీ సుడిగాలికీ మధ్య, ఆప్తులు, మిత్రులు, పరిచితులు, శిష్యుల తండ్రులూ అక్కడక్కడ కనబడ్డపుడు ఆకాశానికెగిరాడు నరసన్నగారు. ఎక్కడికక్కడ, తన కథ చెప్పుకుంటూ, బతిమాలుతూ బామాలుతూ, తనకి వారంరోజుల్లో రావలసిన మొత్తాలూ, పదిరోజుల్లో వచ్చి తీరే మనియార్డర్లు, పదిహేనురోజులు తిరిగేసరికి ఒరిగిపడే పెద్ద మొత్తాలు, వాళ్ళకి వివరిస్తూ తనకి తెలుపుకుంటూ, వాళ్ళకి హామీ ఇస్తూ తనని నమ్మించుకుంటూ, ఓదార్చుకుంటూ ఆశపెట్టుకుంటూ, ఒట్టుపెట్టుకుంటూ అడుగులు వేశాడు నరసన్నగారు

* * *

హఠాత్తుగా వీధిలో సంచలనం రేగింది. దీర్ఘదర్శులు అయిన వాళ్ళంతా అందుబాటులో ఉన్న సైకిళ్ళు, బళ్ళు ఎక్కి హడావుడిగా వెళ్ళిపోతున్నారు వాహనాలు లేనివాళ్ళంతా 'వాకింగ్ రేస్' వేసుకున్నట్లు చక చక నడచి వెళ్ళిపోతున్నారు ఎక్కడి పనులు అక్కడ వదిలేసి

ఇందరిని ఇంత హడలేసిన ఆ ఉత్పాతం ఏమిటా అని నరసన్నగారు కొంచెం ఆగి పరకాయించిచూశాడు

పల్లనివాడు, నాలుగే అడుగుల పొడుగువాడు దడదడ అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు అతని సన్నని పల్లని కళ్ళు రెండూ, అతి బహిరంగంగా, సిగ్గూ లజ్జా డాబూదర్పం లేకుండా నవ్వేస్తున్నాయి. పారిపోయేవాళ్ళకి పగాలు తగిలించి, బిగించి, నిలేసి, కుదేసి, నువ్వు నవ్వితీరాలంటున్నాయి అవి నవ్వుతున్నాయి అవి నవ్వాక, అతనుకూడా నవ్వుతున్నాడు. ఆపైన అప్పు అడిగేసి పుచ్చేసుకుంటున్నాడు.

పారిపోయిన దీర్ఘదర్శులు, పారిపోగా, మిగిలిపోయిన ప్రాపకాలజ్ఞులంతా అతని చూపులు గుచ్చుకోకుండా, మొహాలు ఎటో తిప్పేసుకుంటున్నారు; కొందరు

చేతికి గొరికిన పుస్తకాలు, పేపర్లు, అవీ లేక పోతే, జేబులో పద్దుబుక్కులు, విజిటింగ్ కార్డులు, గోడలమీది బోర్డులూ విపరీతమైన శ్రద్ధతో చదివేస్తున్నారు. ఈ వైరాగ్యంవల్ల కొంచెం సముపార్జించ గలవాళ్లు ఏ బేడా ఇచ్చి, భారతీయ వర్తక వాణిజ్య రంగాల పురోభివృద్ధికీ, తద్వారా పంచవర్ష ప్రణాళిక సర్వతోముఖ విజయానికీ యధాశక్తిగా ఎంగుకు తోడ్పడరాదన్న ఉహతో దగ్గర్లో ఉన్న కాఫీహోటల్లోకి దూరిపోతున్నారు. ఆమాత్రం ఊహ కూడా లేని వారు అతనికి దొరకి పోతున్నారు. కానీ ఉండడానికి ఆస్కారం లేదని నిదర్శనాలు చూపి మరీ నిరూపించబోయిన జేబులించి గూడా అతను అర్ధో పర్దో అప్పు పుట్టిస్తూనే ఉన్నాడు అర్జంటుగా ఎక్సరే ఫోటోలు తీసేస్తున్న అతనికళ్లు క్షణంలోసగంసేపు నరసన్న గారిమీద వాలాయి అతను ఆయనకు తెలుసు నరసన్నగారి కళ్లు ఆ సంగతి మర్చిపోయినట్టు గాని, జ్ఞాపకం లేనట్టు గాని తెలియనట్టుగాని అభినయించలేదు నిజం చెప్ప ప్రతిహాసం విసిరాయి. ఎక్సరే ఫలితాలు మామూలే, ఆయనవంక జాలిగా ఓ చూపుచూసి, అతను తియవాతి కొళాదారు మీదకు ఉరికాడు.

*   *   *

దొరకని మూడో అర రూపాయ కోసం వేట కొనసాగించారు నరసన్న మేస్టారు

పది, పదకొండు, పదకొండున్నర ముప్పావు, యాభై, యాభైపగు, ఆరు ఏడు ఎనిమిది తొమ్మిది తొమ్మిదిన్నర 12 అయ్యాయి

ఎండ, గాడుపు, ఆకలి, అవమానం. మండుతున్నాయి; కాబలు వాయగొడుతున్నాయి నిస్రాణ, బెంగ క్షణ క్షణం పేరుకుతున్నాయి

"అయ్యా నరసన్నగారూ ఇంటికి దయ చెయ్యండి కాస్త ఎంగిలి పడదాం' అన్నాడు కడుపులో కాముడు.

"ఏడిశావు, లేవోయ్ పూర్తిగా తగ్గిపోవోయ్ ఇవాళ ఈయాభై అప్పు పుటించకుండా ఇంటికి వెళ్ళడానికి వల్లకాదు'' అన్నాడు నరసన్నగారు

"మీ ఇష్టం అఘోరించండి".

"చిత్తం మీరు కాస్సేపు నోరు మూసుకోండి"

"పోని కలర్...కనీసం ఒకసోడా కొని పెటండి"

నరసన్నగారికి ఒళ్లు మండిపోయింది పెంకెభడవాహాన్నా అనుకున్నాడు తిన్నగా వీధి కుళాయిదగ్గరకెళి పొట్టపూటుగా నీళ్లెక్కించేశాడు. అక్కడితో కడుపులో కాముడు ఊపిరిసలపక ఉక్కిరి బిక్కిరై నోరు మూసుకున్నాడు

మూడుగంటలు వేశారు. ఇంకో అర గంటకూడా గడచింది నరసన్న గారికి దమ్మిడీ పలకలేదు అరగంటలు తిరిగినకొద్దీ సోమవారం దగ్గర కొచ్చే స్తోందన్న భయం ఎక్కువ కాసాగింది.

అప్పులవాళ్లు పీకలమీదక త్తిలా ఉన్నారు ఉదయం బెదరించిన ఆసామి అన్నంతపనీ చేసితీరతాడు. మధ్యాహ్నానికల్లా పరువూ సాయంత్రానికి ఉద్యోగం, నాశనంచేస్తాడు. ఆ తరవాత ?

"ఆకలి" అన్నాడు అప్పుడే నిద్ర మేలుకున్న కడుపులో కామేశం

నరసన్నగారు సమాధానం చెప్పలేదు.


"ఆ చెట్టున మామిడిపండుంది ఈ సంఘులో ఎవరూ లేరు చటుక్కున అది కొయ్యరాదూ" అన్నాడు కామేశ్వరరావు

"తప్పు" అన్నాడు నరసన్నగారు కాస్త గంభీరంగా అన్నాక, కొంచెం సంతోషం, ఒక్కరవ్వ గర్వం, కలిగాయి కలిగాక, కొంచెం సత్తా వచ్చింది

ఈ కాస్తకే మహాపురుషుడవనుకుంటున్నావా అన్నారెవరో సన్నగా

"లేదనుకో. అయితే నేం......"

పంగుముళుపు తిరిగిన నరసన్నగారికి అల్లంతదూరాన, తప్పకుండా అప్పిచ్చేటంత మంచిమనిషి కనబడాడు ఉత్తర క్షణంలో అలంతదూరానికి. ఇల్లివత్రగా



★ 'అర్థాన్వేషణం' ★

నిలబడ్డ ఓ కడ్డీబాబు కనబడ్డాడు.

వరసన్న గారికి ప్రాణం లేచొచ్చి, మళ్లా పోయింది.

ఇతణ్ణి దాటివెళ్తేగాని అతడందడు; అప్పు దొరకదు. ఇతణ్ణి దాటడం సుఖాంతం కాబోతోంది. ఇతగాడికి ఈయనగారు పాతికవరహా బాకీ. ఈయన ఇచ్చుకోలేదు. అయన ఊరుకోలేదు.

'జేసన్ అండ్ ది గోల్డెన్ ఫ్లీస్' పాఠం జ్ఞాపకం వచ్చింది వరసన్న మేష్టారికి 'డ్రాగన్' అనుకున్నాడు కసిగా.

ఆయనకి దారిపొలుపోని, మహారాణ్ణాన హఠాత్తుగా, వల్లనివాడు నాలుగే అడుగుల పొడుగువాడు, పొద్దున్న కనపడ్డవాడు రిప్పున దూసుకుపోయాడు. ఆ ఊపుకి, ఆ జోరుకి 'డ్రాగన్' కూడా అదిరిపోయి సైకిలెక్కి ఉడాయించేశాడు. వరసన్నగారు ఎగిరి గంతేసి అల్లంత దూరాన ఉన్న అప్పిచ్చే మంచాయన కోసం బయల్దేరాడు కాని, ఆయన కూడా చూపుమేరలో పత్తా లేకుండా పోయాడు.

"హారి నీ యిల్లు బంగారం గాను" అనుకున్నాడు వరసయ్యగారు.

పూర్తిగా మతిపోయి, నిరాశపడిపోయి దిగాలుగా తాలూకాఫీసు వీధి తూముకి ఒక్క క్షణం జేరబడ్డ వరసన్న గారికి హఠాత్తుగా వల్లనివాడు నాలుగే అడుగుల పొడుగువాడు మళ్ళీ తటస్థపడ్డాడు. ఈసారి ఆగి పలకరించాడు.

"ఎంతకోసం?" అన్నాడు.

"నీ కెందుకు నా గోల? నువ్వేం ఆర్చేవాడివా తీర్చేవాడివా?" అన్నట్టు చూశాడు వరసన్న గారు!

"అలాటివాడు ఉంటే గింటే, ఉన్నవాళ్లలో ఎవడేనా అయితేగియితే నేనే" అన్నట్టు కొస్త దర్జాగా, కొంచెం లాలనగా చూసి నవ్వాడు అతను

వరసయ్యగారు చెప్పారు.

"డాండుంపతెగా నా దగ్గర లేదంటే... అంటే దొరక లేదనమాట అయితే నేం, నేను చెప్పినట్టు చెయ్యండి. మిమ్మల్ని ఆదుకుంటే నావంటివాడే 'కావాలి' నేను 'ఎకోటటం లేదు కాబట్టి 'పనే' వాణ్ని మీకు చూపిస్తా వెళ్తారా?"

నిరాశయ్య గారికి ప్రాణం లేచొచ్చింది.

"బాబ్బాబు మీ మేలు మర్చిపోను"

"మరేం ఫర్వాలేదు తిన్నగా వెళ్ళి కుడి వేపు తిరగండి ఆ వీధి చివర ఎడం వేపు సందు లోంచి వెళ్ళొచ్చుగాని, అందులో ఇద్దరికి మీరు బాకీ ఉన్నారు. అందుకని, సరాసరి వెళ్ళి, ఇంకో సందు దాటి, ఆ పైదాం లోంచి చెరువుగట్టుమీదుగా సినిమాహాలు దగ్గరకి వెళ్లండి. అక్కడ రావు కిళ్ళీ బడ్డీ దగ్గిర బల్లమీద బోడుగా పొట్టిగా ఉండే ఒక ఆసామీ కనబడతాడు. అతను మీకు తెలుసు. మిమ్మల్ని అతను ఎరుగును. వెళ్లండి వెళ్ళి అడగండి. మీ కష్టం ఆదుకునేవాడు అతనొక్కడే. అప్పులకు పెట్టింది పేరు పన్ను మించినవాడు. గురువంటివాడు పేరు తెలుసుగా అప్పన్న."

నరసన్న మేష్టారు ఆశ్చర్య సంభ్రమ సంతోషాలు వెలిబుచ్చి, సరాసరి, తన శ్రేయోభిలాషి చెప్పిన మార్గాన బయలుదేరారు. మజిలీలు, దాగుడుమూతలూ లేకుండానే అక్కడికి చేరుకున్నారు. అప్పన్న ఆయనకి కొద్దిగా తెలుసు. అతని పూర్తి పేరు అప్పలస్వామి. ఉద్యోగం బెడద లేకుండానే ఓ మాస్టరు దర్జాగా కాలం గడుపుతున్నాడు.

నరసన్న గారు అతన్ని చూచి నవ్వారు. గంభీరంగా బీడీ కాలుస్తున్న అప్పన్న, ఒకసారి ఆయనని నఖశిఖ పర్యంతం చదువుకుని, కూర్చోమన్నాడు. కుశలం అడుగుతూ బల్లమీద కూర్చున్నారు నరసన్న గారు.

"మీ దయవల్ల బాగానే ఉన్నా గాని..."

"కానీ ఏమిటి?"

అప్పన్న హుందాగా నవ్వాడు.

"బాబూ మీరు చెప్పక్కరలేదు. నాకు తెలుసు లెండి. ఒక్కమాట చెప్పనా?"

యాభై అప్పిస్తే, ఒకటి కాదు వందమాటలు వినడానికి సిద్ధంగా ఉన్నారు నరసన్న గారు.

"నాక్కూడా కొంచెం ఇబ్బంది వచ్చిందండి నేను కూడా రెండు రోజుల్నించి రెండొందల యాభై కోసం ప్రయత్నిస్తున్నాను."

"నిజమే. అయితే చూశావూ, ఈ సాయంత్రం దీపాలు పెట్టే వేళకి నేను యాభై జతపరచకపోతే పీకలమీద కొచ్చేనే" అన్నారు నరసన్న గారు బాధగా.

అప్పన్న మందహాసం చేశాడు. "హు" అన్నాడు మృదువుగా, లోకం తీరును ధ్వనిస్తూ. క్షణం ఆలోచించాడు. ఓ బీడీ తీసి ముట్టించాడు.

"భ్రమండి. అంతా భ్రమ. ఇబ్బంది కొద్దీ మీరలా అనుకుంటున్నారు గాని, పీకల మీద కొచ్చేదేముంది నా బొంది"

నరసన్న గారికి గుండె గుభేలు మంది. కొంపతీసి ఇవ్వనంటాడేమోనని.

"నీకు మళ్ళీ వారంలోగా ఫిరాయించేస్తా ఈ సారికి ఆదుకో. మంచివాడివి. లేకపోతే పీకల మీదికి"

"పెద్దలు తమరే అలా అంటే నేచెప్పేదేముందండి. మీ భయమే కాని...అయినా కాపోయినా, ఒక్కమాట చెబుతా వినండి బాబూ.. మనవంటి వాళ్లకి అసలు పీకల మీదికి రాని దెప్పుడు? మీకివాళ యాభై గాళ్ళ అప్పు పీకలమీద కూర్చుంది. నేనిచ్చానే మీరు తీర్చారే పీకల మీది ముప్పు తప్పించుకున్నారే అనుకోండి. మళ్లా రేపు సాయంత్రానికే ఇంకో ఉప్పెన వచ్చి పడుతుంది. అది గడిస్తే, ఇవాళ డబ్బు సర్దిన నేనే ఎల్లుండి సాయంత్రం పీకలమీది కత్తినౌతాను చూశారా..."

నరసన్న గారి నాలుక పిడచకట్టుకుపోయింది మాటరావటం లేదు. "ఇప్పుడు లేదంటావా ఏమిటి...చచ్చానే..." అన్నారు.

అప్పన్న నవ్వాడు "బాబూ! మీరు నేనూ మనవంటి వాళ్ళం అంతా, రోజూ గండాలు దాటుతూనే ఉంటాం పీకలమీద కత్తులూ గండాలూ మన్నేం చెయ్యవు. మీకివాళ డబ్బు దొరకదనుకోండి. అప్పులాడికేదో చెప్పుకుంటారు వాడు ధాంధూం అంటాడు. అని?.....ఏముంది. సరే మళ్లీ వస్తానంటాడు. ఎల్లుండి ఇచ్చేస్తారు. మళ్ళా ఆవతెల్లుండి ఎక్కడో పుచ్చుకుంటారు. ఆమన్నాడు మళ్ళా గండమేకద? అదే మన కథ మీరు చెప్పినట్టే అయితే, నాకు రెండొందల ఋణంమూలంగా మొన్న సాయంత్రం ఐదు గంటలకి పీక తెగిపోయి ఉండాలి... అక్కడికీ తిరిగా. ఇప్పుడు విసుగేసి గంటాయి ఇక్కడే కూలబడున్నా చూశారూ...అందరం ఇంతే..."

నరసన్న గారు తల వంచుకున్నారు ఏం తోచక. ఉదయం పదినుండి తిరిగిన తిరుగుళ్ళు, అడిగిన అప్పులు. పుచ్చుకున్న జవాబులూ సలహాలూ, విన్న ఏడుపులూ, గిర్రున తిరిగాయి.

ఒక పిసరు జ్ఞానోదయం కలిగినట్టై ఎండిన చిరునవ్వొక్కటి సందేహిస్తూ పెదిమల మీదకు వచ్చింది.

"అద్గదీ. అలా ఉండాలి. అందుకని, ఇంక ఆట్టే శ్రమపడకుండా ఆ అప్పులాణ్ణి సముదాయించి, బతిమాలుకుని......." నరసన్న గారికి అప్పన్న మాటలు వినబడ లేదు.

దొరకని అర రూపాయిని, తనని తిట్టుకున్నాడు. "నువ్వన్నది నిజమేలే" అన్నారు రెండు నిముషాల క్రితం అప్పన్న ప్రపంచించిన సత్యానికి జవాబుగా.

"వస్తానోయ్" అని బయల్దేరారు నరసన్న గారు. అప్పటికి ఆయన మనసు తేలిక పడింది ప్రశాంతత ఆయనలో పరుచుకోవడానికి ఉపక్రమించింది...మెల్లిగా అడుగులు వేస్తూ ఇంటికి బయలుదేరారు....

* * *

అన్వేషణ విరమించుకున్న నరసన్న గారు ఐదడుగులు వేసేవరకు, "బాబూ నరసన్న గారూ" అన్న పిలుపు వినబడింది.

అప్పన్న బల్లదిగి రెండు అడుగులు ముందుకు వేశాడు.

"బాబూ చిన్నమనవి ... ఏం లేదు. ఈ కిళ్లీకొట్టువాడికీ నాకూ అమ్యా కొంత చెడిసింది. అయినా ఇవాళ తిరిగి తిరిగి నోరెండి, గతిలేక వీడిదగ్గరే కలరు పుచ్చుకుని, తాగేసి అరువు పెట్టాను నాకుమాస్తే రాత్రి ఎనిమిదికల్లా రెండొందలు దొరక్కపోతే, యములాళ్లు వచ్చి పడతారు. వీడుమాస్తే కలరు డబ్బులు ముందిక్కడ పెడితే గాని కదలడానికి వల్లకాదంటాడు వెనక అక్కనూ వాడును. అంచేత, నేను ముందిక్కణ్ణించి బయటపడితే, ఇంకో నాలుగు వీధులు తిరగొచ్చు. చూశారూ...అంచేత ఒక్కబేడా అర్థణా సర్దితిరా..." ★

—'రవణ'

కన్నె చెర

రాజలక్ష్మి కెవరో ప్రేమలేఖ వ్రాశారు!

ఆ ఉత్తరంలో ప్రత్యక్షరం చదువుతూన్నంతసేపు తన హృదయం కొల్లలాడిపోయింది. నఖశిఖ పర్యంతం జలదరించిపోయింది. చేతులూ, కాళ్ళూ గాలికే ఊగులాడిపోతున్నయ్.

తనకి నాల్గయిదు రోజుల్లో ఆ మూడో పెళ్ళి ముసలిమొగుడితో సంబంధం స్థిరపడబోతోంది. తండ్రి అందుకోసం ప్రతి నిమిషం సిద్ధపడుతున్నాడు. తన దరిద్రం అంతకంటె వేరేవిధంగా ఉపయోగపడలేదు. తమమీద, తనమీద ఈసారి దరిద్రదేవత పూర్తిగా పగతీర్చుకొంటుంది. కట్నాలు, కానుకలు పోసి, తన జీవితం సుఖమయ మార్గాల్లో నడిపించలేని తండ్రి చివరికి ముసలి మొగుణ్ణి కట్టబెట్టబోతున్నాడు. ఆ సంబంధంవద్దని తనకళ్ళు ఉరిమి ఉరిమి వర్షించాయి. కుటుంబాన్ని ప్రతిఘటించింది. తండ్రి తనని కన్నె చెరనించి వదిలించాలి. పదికాలాలపాటు సుఖంగా డబ్బూ, దాబూ, దర్పంతో జీవించాలి. పదికాలాలపాటు కాదుగదా, పది గంటల సేపు ఆ ముసలిమొగుడితో కాపురం చెయ్యలేను.

ఇంటిచుట్టూ చిక్కని చీకటి వెంపరలాడుతోంది. ఇంకా దీపం వెలగలేదు. ఈ ఉత్తరం సంగతి తల్లికి చెప్తే! అమ్మో! ఇంకేవన్నా ఉందీ? శంకిస్తుంది...ఎన్నాళ్ళించి ఈ నాటకానికి నాంది? అని అడిగితే?......

ఆ ఉత్తరం ముక్కలు ముక్కలుకింద చింపేస్తే? పక్కింటివాళ్ళ ఇంట్లో అద్దెకుంటున్న ఆ అబ్బాయెంత బాధపడతాడు! అతని పేరు సోమశేఖరమట! పేరు చుట్టూ ఏదో పెద్దసుడిగుండం తిరుగుతున్నట్టనిపించింది తనకి! 'నామాటకూ నాకూ విలువనిచ్చి లాలించే అన్నగారు తప్ప ఇంకెవరూ లేరు. నా వివాహం విషయంలో సర్వాధికారాలు నావే' అని మరీ మరీ వ్రాశాడు.

దీపం వెలిగింది. తల్లి ఏదో ఆధ్యాత్మ రామాయణంలో కీర్తన చదువుతోంది.

ఆ ఉత్తరం వ్రాసినాయన్ని ఒక్కసారి నిలదీసి నిజమడిగితే? ఎందుకలా రేపో మాపో పెళ్ళికాబోతోన్న పరాయిపిల్లకు ఉత్తరం రాయడం? అందాన్ని చూశా? చివరికి ఆశలు పెట్టి మోసగించడానికా? తన కుటుంబంలో తల్లీ తండ్రీ, అన్నలూ, తమ్ములూ అంతా నగుబాటు పాలుకావడానికా?

గుమ్మంముందుకి వంగి చూసింది. పొరుగింటి ఆడవాళ్ళు అరుగుమీద బాతాఖానీ దంచుతున్నారు. ఆ అబ్బాయి ఈపాటికి వచ్చే ఉండవచ్చు. రోజూ ఆవేళకి తను చూచేసరికి నూతిదగ్గర స్నానం చేస్తుండేవాడు. తను బిందె తీసుకొని ముందుకు వెళ్ళడానికి సిగ్గుపడేది. అతను తనకంటె ఎక్కువగా బిడియపడుతూ తప్పుకొనేవాడు. తనని చూచినప్పుడెల్లా గౌరవంగా తప్పుకొని తొలగిపోయేవాడు. ఇటువంటి సౌమ్యమూర్తి హృదయంలోంచి వెలువడినది ఈ లేఖ. స్వార్థం గెలుచుకొని తనని ఉద్ధరించడానికి ముందంజవేస్తున్న నిండు మానవుడు——

'రమణశ్రీ'

ఆలోచనలతో మెదడులో శిలాద్రవం కరుగుతోంది. తన హృదయంలో తెరమీద విరవిరలాడుతూ నర్తిస్తున్నది సౌందర్య కల్పన...

తనలో నిశ్శబ్దాన్ని చీల్చుకొని ప్రవహిస్తోన్న భావ, అతని పేరు తన లోలోపల లోతుల్లో ఎంతబాగా చొచ్చుకుపోతున్నది?

నిజంగా మీరేనా నాకు ఉత్తరం రాసింది? ఎందుకలా రాశారు? అలాంటి ఉత్తరం సృష్టించడానికి మీకెలాంటి స్వాతంత్ర్యం ఉంది? ఇది జీవితాలతో పోరాటం గాని, ఆట కాదు!

ఇదీ అతన్ని నిష్కర్షగా అడగవలసిన విషయం! అతని సమాధానం ఎలా వుంటుందో వినాలి!

అతను గదిలోకి వెళ్ళబోతున్నప్పుడు తను అడ్డంగా వెళ్ళి నిలబడింది. అతను స్తంభించిపోయాడు.

పరిచయం లేని చిరునవ్వుతో పలకరించింది.

"మీ ఉత్తరం చదివాను"

"ఊ" అని మూగగా సమాధానం.

రాజలక్ష్మివైపు ముఖమన్నా తిప్పకుండా సిగ్గుపడుతూ నించున్నాడు.

"మీ ఉత్తరం మా నాన్నగారికి చూపిస్తాను. నేనిప్పుడు పెళ్ళి చేసుకోబోతున్నది యేళ్ళుమీరిన వాడినని తెలుసుకొని నన్ను రక్షించడంకోసం మీరు ముందుకు వస్తున్నారని అర్థం అవుతోంది. ఇప్పుడు నాకేం చేయాలో అర్థం గాకుండావుంది. దానికి మీ సలహా ముఖ్యంగా కావాలి"

"మీ తల్లిదండ్రులతో సంప్రదించే కదే మనవివాహం - నామీద పూర్తివిశ్వాసం ఉంటే నే ముందుకురండి! ఆత్మ వంచన మాత్రం చేసుకోవద్దు. చీకటి పడింది. వెళ్ళండి! ఎవరేనా చూస్తే లేనిపోనివి అంటారు."

అతను లోపలికి దూసుకుపోయాడు.

రాజలక్ష్మి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. కళ్ళనిండా మేఘం కమ్ముకొని ఉంది. ఇంట్లో అడుగుపెడుతోంటే తండ్రి రఘువయ్య ఏదో గొణుక్కుంటున్నాడు. తల్లి ఏదో సమాధానం చెపుతోంది.

"ఎక్కడికెళ్ళావు ఇంతసేపట్నుంచీ, ఏమిటి నువ్వు చేస్తున్నది?" తండ్రి ప్రశ్న వేశాడు.

"పక్కింటి వాళ్ళమ్మాయితో మాట్లాడుతున్నాను." అంటూ బొంకింది.

తండ్రి సమాధానంవినకండా, "ఆ మూడో పెళ్ళివారి సంబంధం స్థిరపరచడానికి రేపే వస్తున్నారు. అంతకంటే మంచి సంబంధం మాకు నచ్చింది కనిపించడంలేదు. ఇరవై ఎకరాల పొలం, సాలుకి పది వేలువచ్చే ఆస్తి అంతా ఆమాం బాపతు అరవై డబ్భై వేల రూపాయల ఆస్తి. ఆయన కావాలనికోరాలి గాని, ఎంతమంది కన్యాదాతలు పిల్లల్ని తెచ్చి ఆయన కాళ్ళమీద పారేస్తారో నీకేమైనా తెలుసా? మనకా స్థితిలేకపోయినా కుటుంబ గౌరవం, సంప్రదాయం, వంశప్రతిష్ఠ చూసి వప్పుకొంటున్నాడు. దమ్మిడీ కట్నం లేదు. మొదటి పెళ్ళాం, రెండో పెళ్ళాం నగలన్నీ మన అమ్మాయివే! ఇంతకంటే మంచి సంబంధం ఈ భూప్రపంచంలో ఎవరు తీసుకురాగలరు చెప్పు.

తల్లి అందుకుంది. "ఎన్ని ఆస్తులున్నా

దాని జీవితానికి కావలిసింది లేకపోయాక్క
ఎందుకు?"

"ఆయన మూడో పెళ్ళివాడు, మూడో పెళ్ళివాడని మీ గోలగాని, ఆయనకేం తక్కువచెప్పు! చిన్నప్పట్నుంచీ కష్టాలెక్కువై కాస్తవయసుమీరినట్టు కనిపిస్తాడు. మొన్న నేగా నలభయ్యో పడిలో పడిత—"

"ఆయన నలభయ్యో పడిలో పడితే, అమ్మాయి నూతిలో పడుతుంది ఆ తర్వాత మీ యిష్టం! ఎవరు విచారించీ ఏం లాభం లేదు." అని తల్లి నిష్కర్షగా వక్కాణించింది.

తండ్రి చిరచిరలాడుతూ గొణుక్కోవడం మొదలు పెట్టాడు మీ యిష్టం వచ్చినట్టేడవండి! నేను చేయగలిగిందేదో చేస్తాను"

రాజలక్ష్మి ఉత్తరం తీసుకొచ్చి తండ్రి పన్నిధానంలో ఉంచింది

అప అపలాడుతూ కూతురివంక ఆదోలా చూస్తూ "ఏమిటి కాయితం అన్నాడు.

"మీరు చదువుకోండి! మీ కిష్టమైతే నే చేసుకుంటాను" అంది

పూర్తిగా ఉత్తరం చదువుకుని విసవిసలాడుతూ, ఎవరో అప్రాచ్యుడు ఉత్తరం రాసిస్తే, నువ్వు పుచ్చుకుని, వాణ్ణి పెళ్ళాడతానని కులుకుతున్నావా? వాడి వంశం, గోత్రం, ఆస్తిపాస్తి చూచుకోనక్కరలే! కట్నం పుచ్చుకోకుండా చేసుకుంటానన్నమాత్రాన కాళ్ళు కడిగెయ్యాలనే! ఎన్నాళ్ళనించి సాగిస్తున్నావీ వ్యవహారం! ఇందాక అక్కడికేనా వెళ్ళివస్తా?" అని గర్జించాడు.

వెక్కి వెక్కి ఏడుస్తూ, "నేనేపాపం ఎఱగను! అతనెవరో నాకు తెలీదు. ఇందాక అక్కడికెళ్ళే వచ్చాను. ఎంతో నమ్మకంగా చెప్పారు నన్ను మూడో పెళ్లివాడి కిస్తున్నారని తెలిసి బాధపడి, ఈ ఉత్తరం రాశావన్నారు. మీరేవెళ్లి ఒక్కసారి మాట్లాడి రండి" అంది.

అతనికి కూతురికి ఏదో తెరవెనక భాగవతం ఉందేమోనని తండ్రికిశంక. అపమార్గములోపడి పాడయ్యిం దేమోనని భయం.

"ఐతే జరిగిందిం తేనన్నమాట!" తండ్రి, చివరికి అంతు తేల్చుకుంటూ, "ఎలాగైనా జాగ్రత్తగా వుండాలమ్మాయ్! ఇప్పట్లో స్థిరపడకపోతే, నీవు దారితప్పితే, ఏనాటికీ అవంకర దిద్దుకోలేం! పేరూ వూరూ లేకండా చెటూపుట్టకూ కాకండాపోతావు! ఇంతకంటె నీకేం చెప్పను? వెళ్లి పడుకో. పో! నేనతనితో మాట్లాడతాను!"—

రాజలక్ష్మి కంఠం గాద్గదికంలో గూడుకట్టుకొన్న ఆవేదన హృదయాన్ని చీలుస్తోంది. చెక్కిళ్లను కన్నీటిచారలు చురచురలాడిస్తున్నాయ్!

బయటికొచ్చి తొంగిచూసింది. కటిక చీకటినల్లబడిన కసాయికత్తిలా భయపెట్టింది.

రాజలక్ష్మి ప్రకృతిదేవతల్ని మనసులో తలుచుకుంటూ, "నన్నూ నా అభిజాత్యాన్నీ కాపాడేబాధ్యత మీ మీద నే వుంది! నాలాంటి అమాయకురాల్ని జీవితంలో వంచితురాల్ని చేయకండి!" అని దీనంగా ప్రార్థించింది.

*　　*　　*

"మీరేం సందేహించకండి! నాకు కట్నం, కానుకలమీద ఆశలేదు. పిత్రార్జితంలో నా వాటాకు ఆరెకరాల పొలం, ఇంట్లో సగం వాటా-మొత్తం నా భాగానికి వొచ్చేఆస్తి ఇరవై వేలకు తక్కువుండదు. నేనీ సంవత్సరం బి. ఏ. పూర్తిచేసి, ఏదైనా ఉద్యోగం సంపాదించుకోలేకపోలేను. ఇదీ సంగతి...తర్వాత మీ రాలోచించుకు నే నిశ్చయానికి రండి."

రాఘవయ్య ప్రశాంతంగా విన్నాడు. అతనిలో ఎలాంటి లోపం లేకపోగా మీదు మిక్కిలి స్వార్థరహితుడు, గుణవంతుడూ, ఉదారస్వభావుడుగా కనిపించాడు. రాఘవయ్య అనవసరంగా ఎందుకు శంకించావా అని విచారించి, ఆనందంతో ఉక్కిరిబిక్కిరయాడు.

"ఐతే మీ గోత్ర మేమిటి బాబూ?" ఆ ఒక్క సందేహం తీరిపోతే రాఘవయ్యకి జీవితం ధన్యమైపోయినట్లే!

"ఆంగీరస గోత్రీకులమండి."

దెబ్బతో ముసలాయన పిడుగుపడినట్లు కూలిపోయాడు.

"అంతా నాశనం....ఐపోయింది బాబూ! మా గోత్రం అదే...సమగోత్రీకులు సంబంధము కుదుర్చుకోవడం సంప్రదాయ విరుద్ధం...మహాపాపం."

సోమశేఖరం చిరునవ్వు నవ్వుతూ, "ఆ గోత్రాలొకమైనంతమాత్రాన కొంపమునిగే దేవుంది చెప్పండి! నా కలాంటి వాటిమీద నమ్మకంలేదు. కులాంతర వివాహాలే యీ కాలానికి పరిపాటయినప్పుడు గోత్రాలెందుకు పనికొస్తాయ్! మీరలాంటి చాదస్తం పడకండి! నేనెందుకొప్పుకున్నానో అదంతా మీమంచికోసం...మీ అమ్మాయికోసం..."

ముసలాయన క్రుంగిపోయాడు. ఏదో కూతుర్ని కేక వేసినా అనువైనసంబంధం దొరికిందని మురిసిపోయాడు. ఈ గోత్రాలగోడ అడ్డురావడంతో నే,ఆశలన్నీ కూలిపోయాయి.

"సంప్రదాయం నాశనంచేసి ఏకగోత్రాల్ని కలిపి పాడుచెయ్యలేను. అలాచేసి నలుగుర్లో నగుబాటు పాలవ్వలేను."

సోమశేఖరం నిట్టూర్పువిడుస్తూ, "మీదాకా మీ సంప్రదాయం మీ దగ్గరే దాచుకోండి! అమ్మాయిని ముసలిపెళ్ళివాడికిచ్చి తాడు తెంచకండి! అంతా చెయిజారిపోయ్యాక కులగోత్రాలు అడ్డొచ్చి ఓదార్చలేవు."—

ఇక నీతో నాకు పనిలేదన్నట్టు రాఘవయ్య లేచి నుంచున్నాడు: "వెళ్ళొస్తా. ఎవరికర్మ ఎవరు తప్పించగలరు?" అంటూ గదిలోంచి దాటుకుపొయ్యాడు. సోమశేఖరం బయటికొచ్చి తొంగిచూశాడు. చాదస్తంతో మథనపడుతూ కూతుర్ని ఆఖరికి ముసలి పెళ్ళివాడికిచ్చి గొంతుకోద్దామనుకుంటున్నాడు గాని, సంఘపు కట్టుబాట్లు దాటి సాహసించలేకపోతున్నాడనుకున్నాడు.

*　　*　　*

తర్వాత రాజలక్ష్మి సోమశేఖరాన్ని కలుసుకొని, అగమ్యగోచరంగావున్న తన జీవితానికి శాంతిపథాన్ని వెదికిపెట్టమంది. దుఃఖాన్ని దోసిళ్లతో పారబోస్తూ, "నాలో ఆశలు రేపారు. కాబోతున్నది కానివ్వక ఉత్తరంరాసి, నా హృదయాన్ని చిందరవందరచేశారు? నన్నెలాగైనా గట్టుకీడ్వండి, లేకపోతే బలవంతంగా చావడంతప్ప వేరే దారిలేదు"

"నాకోసం బలవంతపుచావు నువ్వెందుకు చావాలి? మీ నాన్నగౌరవం ధ్వంసంచేసి నువ్వేం బావుకొంటావు? నీకంటె నీతండ్రికి గోత్రం ముఖ్యం—నువ్వు సాహసించగలిగితే నాతో వచ్చెయ్. నీ కే ఆపద రాకండా పువ్వుల్లో పెట్టి పూజిస్తాను."

రాజలక్ష్మి త్రుళ్లిపడింది: "అమ్మో లేచి రావడమే! ఇంకేమన్నా వుందీ? మావాళ్ళకు తెలిస్తే రాచి రంపాన పెడతారు. ఊరూ వాడా కోడైకూస్తుంది. అలా లేచిపోయిన వాళ్ళనిగురించి ఎంతమంది ఎన్నివిధాల ఆడిపోసుకోవడం చూడలేదు. ఆ పనిమాత్రం నా వల్ల గాదు."

"ఇంత పిరికిదానివైతే, నువ్వు సంప్రదాయానికి కట్టుబడి వుండిపో! నేనేం చేయగలిగిందిలేదు. మీ నాన్నకి నేను చెప్పగలిగిందంతా చెప్పాను. తర్వాత మీ యిష్టం"

రాజలక్ష్మి ఇదమిత్థమని తేల్చుకోలేక "నా కర్మ ఎలావుంటే అలా అవుతుంది. ఎవరికర్మకి ఎవరుబాధ్యులు? ముసలిమొగుడే నాకు గతి...అప్పుడే ఈ ప్రపంచం నామీద పగతీర్చుకొని వికటాట్టహాసం చేస్తుంది. అప్పుడు మీరుకూడా నా విధికి పకపక నవ్వుదురుగాని"—అంది.

సోమశేఖరానికప్పుడూ రాజలక్ష్మిని చూచి నవ్వురాలేదు. కాని ఆపుకోలేకండా నవ్వేశాడు. "నీకు పడుచు మొగుడూ, మీ నాన్నకి తగుదు వీలాంటి వాడైనా సంప్రదాయంగావాలి! ఉత్తరదక్షిణాల్ని ఒకచోటికెలా ముడేస్తావు?"

సోమశేఖరానికి దిక్కు తోచలేదు. అతనితో ఆమె వచ్చెయ్యడం, తర్వాత సమాధానపరచుకోడంకన్న సుగమ మార్గం ఏవుంది? ధనసహాయం చేస్తాను, మరో సంబంధం చూడమని చెప్పితే? తన అన్నగారొప్పుకొంటాడా డబ్బిచ్చి కన్యాదానం చేయించడానికి! తనకు మాలిన ధర్మం ఎక్కడైనా వుంటుందా?

ఏం తోచిందో రాజలక్ష్మి చివాల్న లేచి వెళ్ళిపోయింది. సోమశేఖరం ఎంత పిలిచినా ఆగలేదు. వెనక్కి తిరిగి చూశాడు. గదంతా గలభాగా వుంది. పుస్తకాలు చిందరవందరగా పడి వున్నయ్. ప్రశాంతిలేని మానవ హృదయంలా, గది క్షోభిస్తోంది. ఎంత మథనపడినా, అంతు చిక్కని రాజలక్ష్మి సమస్య తన మీద నే విరుచుకు పడేలావుంది!

*　　*　　*

కూతురు నోయనొక్క రాఘవయ్య ముసలి పెళ్ళి సంబంధం స్థిరపరిచాడు. పెళ్లికి పెద్ద హడావుడేం లేకపోయినా ముహూర్తమప్పుడు పీటల మీద కూర్చోవడమే! రాజలక్ష్మి మాత్రం భవిష్యదంధకారంలో వెలుగు కిరణాలు గవేషిస్తున్నది.

తీరా ముహూర్తం నాటికి ఏమవుతుందో తనకే అర్థం కాకండా వుంది. ప్రాప్తకాలజ్ఞత్వాన్ని ప్రదర్శించి తప్పించుకుపోవాలని నిశ్చయించుకొంది. సోమశేఖరం ముభావంగా ఉండిపోయాడు. ఈ సమస్యతో తనకి నిమిత్తం లేదన్నట్టు!

*　　*　　*

రాజలక్ష్మి కారెలా ఎక్కి కూచుందో, కూచుంది. "ఏ ఊరెళతారు?" అని కండక్టరు అడిగినప్పుడు మాత్రం ఈ లోకంలోకి దిగి పడింది. మాటి మాటికి చేతిలో కాగితం వైపు చూసుకొని ఆవేగం ఆపుకొంటున్నది. వెనక తండ్రిగానీ పరుగెత్తుకొస్తున్నాడేమో అనే భయం రయంగా హృదయం చుట్టూ పరిభ్రమిస్తోంది. తీరా అక్కడికెళ్ళాక ఏమంటాడో, ఎలా భావిస్తాడో, అవమానిస్తాడో అంతా అగమ్యగోచరమైపోయి వుంది. తన కట్టూ బట్టా చూసి ఎవరైనా అనుమానించినా అనుమానించవచ్చు. కార్లో వున్న వాళ్ళందరి ముఖాలవైపు పరిశీలనగా చూసింది. ఎవరూ తన్ని గుర్తించేవాళ్లు లేకపోవచ్చు. ఎవరో ఒక వ్యక్తి తనవైపు అదే పనిగా చూడటం గమనించి తలవంచుకుంది.

కారెప్పుడాగిందో, ఇలా ఎంతదూరం సాగిపోయి వచ్చిందో, ఎందుకిలా తను పరారై వచ్చిందో అంతా విధి విలాసం! ఈ

పోటికి లగ్నం దాటిపోయే వుంటుంది. ముడితెలుపడ్డ ముసలాయన మూర్ఛపోయుంటాడు. తన తండ్రి ఎలా కంగారు పడుతున్నాడో తలుచుకొనేసరికి చిరునవ్వు పెదవులమీద విరిసింది.

"ఎక్కడికెళతారమ్మగారూ!" అని రిక్షావాడు ఊహాలోకాల్లోంచి మేల్కొలిపేవరకూ, తన్ని తాను మర్చిపోయింది. పరిష్కృతమైన తన సమస్య చుట్టూ భయం, వింత వేశంలో నర్తిస్తోంది.

"సూర్య నారాయణపురం వెళ్ళాలి."

రాజలక్ష్మి ఆశలుపండే ఇల్లు అక్కడే వుంది! అక్కడికే తన పయనం!

తను గమ్యం ఎక్కుతోంటే సోమశేఖరం కనిపించి, స్వాగతం చెబుతాడని ఆశించింది కాని అతడు కనబడలేదు వదినగారు మాత్రం నిండు హృదయంతో ఎదుర్కొంది. రాజలక్ష్మి స్థితిని, "అయ్యో! ఇంతకష్టం వచ్చిపడినా నిన్నొదిలి యిలా వచ్చాడు మరదిగారు" అని సంభ్రమించింది.

"ఎప్పుడొస్తారూ? లేకపోతే నేను వెళ్ళి మరోమార్గం చూసుకొంటా."

రాజలక్ష్మి మొహమాట పడుతూ అంది. సోమశేఖరం వదినగారు విశాలాక్షి ఆ మాటల కభిమానపడుతూ, "నీ సంగతంతా వాడు తెలుసునమ్మాయ్! నీవేం బాధపడకు! నీ తల్లి తండ్రుల్ని ఒప్పించి మా మరదిగారికిచ్చి పెళ్ళి చేస్తాం. అంతవరకూ ఓపిక పట్టు—" అంది.

సాయంకాలానికి సోమశేఖరం, అతని అన్న నారాయణరావు ఇద్దరూ సైకిళ్ళమీద వచ్చేరు.

విశాలాక్షి సోమశేఖరానికి ఎదురెళ్ళి, "నీకో మంచి విచిత్రం చూపించనా? నా గదిలోకి రా" అని తీసుకెళ్ళి తాను పక్కకు తప్పుకొంది.

రాజలక్ష్మి!

కళ్ళ ఎదురుగా చూస్తున్నా నమ్మలేకపోయాడు. ఆఖరికి 'సాహసే లక్ష్మి' అని రెక్కలు కట్టుక వాలింది. సంఘర్షణ తట్టుకోలేక పారిపోయి వచ్చింది. సోమశేఖరాన్ని చూచి తలవంచుకొంది. కాలి బొటనవ్రేలు నేలరాస్తూ, "తెగించి వచ్చేశాను! మీ అడ్రసు వాళ్ళింట్లో అబ్బాయి రాసిచ్చాడు. రెండురోజులుండి తర్వాత వెళ్ళిపోతాను అంతవరకూ నాకు ఆశ్రయ మిప్పించండి!" అంది

అతని కళ్ళనుంచి ఆనందబాష్పాలు ధారావాహినిగా శూన్యలోకాలకి ప్రవహించ సాగినయ్! ఒక్క క్షణం విద్యుదాఘాతం తిన్నవాడిలా నిశ్చేష్టుడైపోయాడు. అన్నగారు వదినగారు వచ్చి ఇద్దర్నీ లోపలికి తీసుకెళ్ళి, "మీ మనసులు రెండూ ఏకమైతే వెంటనే వివాహం రహస్యంగా జరిగేట్టు చేదాం. వాళ్ళకీ విషయం తెలియనిస్తే ఏమాత్రం పనిజరక్కపోగా లేనిపోని అభాండాలు మనమీద వేస్తారు" అన్నారు. సోమశేఖరం, "రాజలక్ష్మిని ఆలోచించుకోనివ్వండి! తల్లి దండ్రులకి కూతురిమీద పగా, యేం?" అన్నాడు.

అక్కడ పెళ్ళికూతురు లేకపోవడంతో రాఘవయ్య వ్యవహారం రసాభాసయింది. పెళ్ళి వారు చిరుచుకుపడ్డారు. నీతి నియమం లేని కుటుంబమన్నారు. నానా విధాలుగా ఆడిపోసుకున్నారు. ఒక్క క్షణంలో ఆ పేటంతా అట్టుడికినట్టుడికిపోయింది - రాజలక్ష్మి లేచిపోయిందని!

ఇక్కడ తాత్కాలికంగా పెళ్ళి పూర్తిచేసేందుకు సన్నాహాలు జరుగుతున్నయ్! రాజలక్ష్మి నోరెత్తలేకపోయింది విశాలాక్షి చెప్పినట్టు చేయడమే తన జీవితానికి పరమావధిగా తోచింది. ఎక్కడ తండ్రి వచ్చి లాక్కుపోతాడో అని భయం వెంటాడుతున్నా, వాళ్ళు నూరిపోసిన ధైర్యంతో నిలబడగలుగుతోంది! కాని తమ ఊరికీ ఇక్కడికీ ఎంతో దూరం లేకపోవడంవల్ల తన తండ్రి పసిగట్టి ఏ క్షణములోనైనా వచ్చి తన్ను లాక్కుపోవచ్చు! ఆ దురదృష్ట క్షణంనుంచి తప్పించుకొనేందుకు తను దాక్కోవాలి ఎవరికీ కనిపించకుండా ఇక యీ ప్రపంచం వించే దాక్కోవాలేమో?

విశాలాక్షి ముందు తన బరువునంతా వెలారుస్తూ, "ఏ క్షణంలో నా కెలాంటి బుద్ధి పుడుతుందో నేను చెప్పలేను. ఒకవేళ మా నాన్నగానీ వచ్చి తీసుకుపోతానంటే మీ రడ్డగిస్తారా? పీడ వదిలిందని సంతోషిస్తారు నన్ను అప్పజెప్పేయండి! నేను వెళ్ళిపోతాను. నాకిక బ్రతుకుమీద ఆశలేదు. అటు వాళ్ళ మాటా కాదనలేక, ఇటు మీకూ పనికి రాక లోకంలో తలకిందులుగా వేలాడుతున్నాను. నన్నుద్ధరించడానికి మీరు ప్రయత్నించకండి! నా దారిన నన్ను పోనిస్తే అదే పదివేలు—నిమిషానికో మాట, గడియకో ఆలోచన, క్షణానికో భావంతో బాధపడుతున్న నాకు విషమే మంచిమందు' అంది.

ఎవరో తలుపు కొడుతూ కొత్తగొంతుతో కేక వేశారు. విశాలాక్షి రాజలక్ష్మిని లోపలికి నెట్టి, తలుపు తీసి, వచ్చిన వ్యక్తిని విచారిస్తూ, "ఎవరికోసం?" అంది. ఆయన కూడా గౌరవంగా జవాబిస్తూ, "సోమశేఖరం గారికోసం" అన్నాడు. "లోపల భోజనం చేస్తున్నారు కూచోండి!" అంది కుర్చీ చూపించింది. విశాలాక్షి హృదయంలో రాజలక్ష్మి తండ్రి రాఘవయ్య కాదుగదా! అన్న శంక మెరిసింది.

ఇంతట్లో సోమశేఖరం బయటికొస్తూ ఆగంతుక వ్యక్తిని ఆశ్చర్యంగా పలకరిస్తూ "మీరా! ఇలా వచ్చేరేం! ఏమిటి విశేషం" అన్నాడు కొంత తడబాటుతో.

విశాలాక్షి కొక్క క్షణంలో అర్థమైపోయింది ఆయనెవరైందని. ఏం జరుగుతుందోనని గుండె గుబగుబ కొట్టుకోసాగింది. మెల్లగా వెళ్ళి రాజలక్ష్మి వున్న తలుపు గొళ్ళెం పెట్టింది.

రాఘవయ్య ఉచ్ఛస్వరంలో ఉద్రేకంతో మాట్లాడుతూ, "మాశావా నాయనా! రాజలక్ష్మి ఎంత చిచ్చు పెట్టిందో! కులానికీ సంప్రదాయానికి విరుద్ధంగా ప్రవర్తించింది. ఇంత ఘోరం ఏ ఆడదానికైనా చేతనౌతుందనిఅనుకోగలమా! ఎవడితోనో లేచిపో

(43-వ పేజీ చూడండి)



నర్త



చిత్రకారుడు : కేతినీడి భాస్కరరావు



మహీవారి 'శ్రీ గౌరీమాహాత్మ్యం'లో సూర్యకళ, సి. ఎస్. ఆర్.

ఆర్. కె. ఫిలింస్‌వారి 'జాగ్ తే రహో'లో రాజకపూర్, పహాడీసన్యాల్.





'ఛూమంతర్' లో శ్యామ.



'జయా ఆర్ట్స్' అనే లలితకళాలయం "వదినగారి గాజులు" చిత్రం నిర్మించిన 'గోకుల్ పిక్చర్స్'కు ఈ నెల 8 న రజత ఫలకాన్ని బహూకరించి గౌరవించారు. (ఎడమనుండి) మాస్టర్ వర్మ, చిత్రనిర్మాత శ్రీ కృష్ణమూర్తి, నటుడు శ్రీ చలం, అధ్యక్షులు శ్రీ ఎం. లింగమూర్తి, శాసనసభ్యుడు శ్రీ ఎం. ఆర్. అప్పారావు, దర్శకుడు శ్రీ ఎస్. రజనీకాంత్ గార్లు.

బొంబాయి సినిమా లేఖ

బొంబాయి ఫిలిం జర్నలిస్టుల సంఘం జూన్ 9 న ప్రథమ వార్షికోత్సవం జరుపుకుంది. ఈ సందర్భంలో చలనచిత్ర కళలో ఉత్తమస్థాయినందుకున్న కళాకారులకు ఈ సంఘం బహుమతులిచ్చి గౌరవించింది. ఉత్తమ చిత్రానికి, ఉత్తమ దర్శకత్వానికి బహుమతులను శ్రీ వి. శాంతారాం (ఝనక్ ఝనక్ పాయల్ బాజే)కు ఇచ్చారు. కథ (సీమ) పేరిట శ్రీ అమియా చక్రవర్తికి కూడా బహుమతి ఇచ్చారు. పాటల రచన (జాగృతి)కు బహుమతి శ్రీ ప్రదీప్‌కు, మాటల రచన (శ్రీ 420)కు శ్రీ కె. ఎ. అబ్బాస్‌కు, బహుమతు లిచ్చారు. ఉత్తమ నటిగా నూతన్ (సీమ)ను, నటుడుగా దేవానంద్ (మునీంజీ)ను గౌరవించారు.

ఈ సంఘం సభ్యులు ఓటు చేయడం ద్వారా బహుమతులను ఎవరెవరికి ఇచ్చేదీ నిర్ణయించడం జరిగింది. వీటిని 'విమర్శకుల బహుమతులు' అని వ్యవహరిస్తున్నారు.

బహుమతిప్రదానోత్సవసభకు బొంబాయి ముఖ్యమంత్రి శ్రీ మురార్జీ దేశాయి అధ్యక్షత వహించారు. నటీనటులు, దర్శకులు, నిర్మాతలూ పలువురు సభకు వచ్చారు.

* * *

ప్రభుత్వం బహుమతులిచ్చి గౌరవించే చలనచిత్రాలను నిర్ణయించే పద్ధతులు, ఆ నిర్ణయాలు చేసే బృందం వ్యవహరించే విధానాలూ అయోమయంగానూ, శాంతికంగారుగానూ ఉన్నాయని ఇక్కడి ఫిలిం నిర్మాతలు, వివిధ సంఘాలవారూ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ వ్యవహారంలో అనుసరించ తగ పద్ధతులూ, చేయతగ్గ కట్టుదిట్టాలూ, నిర్ణయాలకు ఏర్పరచుకోవలసిన ప్రాతిపదిక, విధిగా ఉండాలన్న విషయమై ఫిలిం పరిశ్రమ ప్రతినిధులు గత రెండేళ్లలోను ఆసెహాతిసెహా ప్రభుత్వానికి సూచిస్తూ వచ్చారు.. కాని ప్రభుత్వం ఇంతవరకూ వాటివిషయమై శ్రద్ధ తీసుకోలేదు. చివరకి ప్రభుత్వ నిర్ణయాలు చాలామంది నిర్మాతలకు అసంతృప్తి కలిగించాయి. ఈసారి బహుమతులకోసం చాలామంది తమ చిత్రాలను పంపడానికి విముఖత ప్రదర్శిస్తున్నారు. మొన్న కేంద్ర సెన్సారు సంఘం బొంబాయి ప్రాంతీయాధికారి, "ఝనక్ ఝనక్ పాయల్ బాజే" చిత్రం, కథా సంగ్రహం మొదలైన వివరాలను బహుమతి నిర్ణాయక సంఘానికి పంపడానికై ప్రయత్నించారు. ఆ చిత్ర నిర్మాత శ్రీ వి. శాంతారాం అందుకు నిరాకరించారు.

* * *

రెండవ పంచవర్ష ప్రణాళికలో, చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి అవసరమైన పరిశ్రమల స్థాపన విషయమై బొంబాయి ప్రభుత్వ పరిశ్రమల డైరెక్టరు ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు అందచేశారు. ఈ వివరాలను ఆయన మొన్న ఫిలింపరిశ్రమ ప్రతినిధులకు తెలియచేశారు. సినీ కెమేరాలు సౌండ్ ప్రొజెక్టర్లు ఫోటోగ్రఫీకి కావలసిన వివిధ రసాయనిక పదార్థాలు, ఇతర పరికరాలూ మొదలైనవన్నీ మనదేశంలో నే తయారుచేయాలనీ, అందువల్ల రెండవ



సాహిణీవారి "పెంకిపెళ్లాం"లో అయోమయస్థితిలోపడ్డ గోవిందరావుగారి పరివారం. రామకోటి, బాబ్జీ, రత్నకుమారి. యజమాని భూమికను రేలంగి నిర్వహిస్తున్నాడు.

ప్రణాళిక క్రింద, వ్యాపారస్తుల రంగంలో వీటికై లఘుపరిశ్రమలూ, భారీ పరిశ్రమలూ నెలకొల్పడానికి ఏర్పాట్లు చేయాలనీ ఈయన ప్రభుత్వానికి సూచించారు.

ప్రారంభదశలో ఏ ఏ రకాల పరికరాలు, ఏ మేరకు ఇక్కడ తయారుచేయవచ్చునన్న విషయం, ఆయా విదేశీయ సంస్థలతో సంప్రతించి తేల్చుకోవాలనీ, ఆయా పరిశ్రమలను బొంబాయి, పూనా, అహమదాబాద్, బరోడాలలో నెలకొల్పాలనీ కూడా ఈయన తమ నివేదికలో పేర్కొన్నారు. కాగా, దేశంలో రంగుచిత్రాల నిర్మాణం క్రమేణా పెరుగుతున్నందువల్ల బొంబాయి, మద్రాసు, కలకత్తా నగరాలలో ఇందుకు కావలసిన లెబొరేటరీలు నెలకొల్పడంలో ఫిలిం పరిశ్రమకు ప్రభుత్వం తోడ్పడాలనికూడా సూచించారు.

* * *

గతవారం, చిత్రసీమలో రెండుచోట్ల మంగళవాద్యాలు మోగాయి. ఒకటి బొంబాయిలోను, రెండోది కలకత్తాలోనూ జరిగింది. గృహస్థి, ఫణిహారివంటి చిత్రాల ద్వారా ప్రసిద్ధికెక్కిన సులోచన చటర్జీ కెమేరామన్ బసేశ్వర్ చెటర్జీల వివాహం దాదర్‌లోని సోహ్రాబ్ పాలంకోట హాలులో జరిగింది.

బెంగాలీ తార కావేరీబోస్ వివాహం కలకత్తాలో జరిగింది. వరుడు అజిత్ కుమార్ చటర్జీ కలకత్తాలోని ఒక సిగరెట్ కంపెనీ ఉద్యోగి. వివాహం కావడంతో కావేరి చలనచిత్రాలనుంచి విరమించుకుంది

* * *

జూన్ 1 వ తేదీ నర్గిస్ పుట్టినరోజు. ఆరోజున ఆమెకు 27 వ సంవత్సరం వచ్చింది. నర్గిస్ మేనకోడళ్లు, మేనల్లుళ్లు ఒక "కేక్" తయారుచేయించి అత్తయ్యకి బహూకరించి పండుగ చేసుకున్నారు. ఆరోజు సాయంత్రం రాజ్‌కపూర్ స్టుడియోలో కూడా, చిన్న విందు జరిగింది

నటుడు మోతీలాల్, నూతన్ తల్లి శోభన సమర్థ్‌లు మొన్న జూరిచ్ వెళ్లారు. మోతీలాల్‌కు కొంచెం అస్వస్థతగా ఉన్నందువల్ల ఆయన అక్కడ నెల్లాళ్లుండి వైద్యం చేయించుకోదలచారు. ఆ పైన అక్కడే ఓ నుంచి 'లిమోజిన్' కొనుక్కుని, యూరప్ దేశాలన్నీ పర్యటించి, స్వదేశం వస్తారు.

* * *

'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' నటి సంధ్య అస్వస్థతనుండి క్రమంగా కోలుకుంది. ఇప్పటిప్పుడు ఆమె విందులకూ, వినోదాలకూ వెళ్ళగలుగుతోంది. 'ఝనక్ ఝనక్' చిత్రంలో పనిచేస్తూ ఉండగా ఆమె గాయపడి, వెన్నెముక కొంత దెబ్బతిన్నందువల్ల నాలుగుమాసాలు ఆస్పత్రిలో ఉండవలసివచ్చింది ఇప్పటికైనా శాంతారాం కొత్త చిత్రం "ప్రభాకర్ షైన్"లో ఆమె పనిచేయగలదో లేదో తెలియలేదు.

* * *

ఈమధ్య రెండు చిత్రాలు విడుదల అయ్యాయి. వాటిలో నగీనాఫిలింస్ వారి 'చార్ మినార్' సంగీత ప్రధాన చిత్రం. కథను 'అరేబియన్ నైట్స్' బాపతు గా రూపొందించినా రక్తికట్టలేదు. నసీర్ ఖాన్, జబీన్, భగవాన్, రేణుమేకర్, ఎస్. కె.



లక్ష్మీ ప్రొడక్షన్స్ వారి "ఇలవేలుపు" లో గంపగయ్యాళి శేషమ్మగా సూర్యకాంతం.

ఆఫ్రికన్లను గౌరవించని చలన చిత్రాలు

భారతప్రభుత్వ నిర్ణయానికి ఆఫ్రికన్ ప్రముఖుని హర్షం

ఆఫ్రికా జాతీయులను అనాగరికులుగా చిత్రించిన ఆరు అమెరికన్, రెండు బ్రిటిష్ చలనచిత్రాలను భారతప్రభుత్వం నిషేధించినందుకు లండన్‌లోని పశ్చిమ నైజీరియా ప్రతినిధి శ్రీ ఎం. ఇ. ఆర్. ఓకోరోడూడూ హర్షం వెలిబుచ్చారు. మన మిత్ర దేశాల స్థితిగతులను, ప్రజలను అగౌరవ దృశ్యాలకోసం, సభ్యంగా సగౌరవంగా చిత్రించకుండా నిర్మించిన చిత్రాలను చలన మన దేశంలో నిషేధించాలని ప్రభుత్వం నిశ్చయించడం విదితమే.

ఈ రంగంలో ఇటువంటి విధానం అవలంబించి ఆచరణలో పెట్టడానికి ప్రపంచం మొత్తంమీద భారతదేశానిదే ప్రథమస్థానమనీ, ఈ రూపేణా, ఆదేశం ఆదర్శప్రాయమైనదనీ ఆయన అన్నారు. ప్రపంచంలో సమానత, సద్భావం వ్యాపింప చేయడానికి కృషిచేస్తున్న వారిలో శ్రీ నెహ్రూ అగ్రగణ్యులని మరొకసారి ఋజువైనదని ఆఫ్రికన్ రాయబారి పేర్కొన్నారు. బ్రిటన్ ప్రభృతి కామన్‌వెల్తు రాజ్యాలన్నీ కూడా ఈ పద్ధతిని అవలంబించగలరని ఆశిస్తున్నామన్నారు. టైమ్స్ పత్రికకు వ్రాసిన ఒక లేఖలో ఆయన ఈ విషయాలు పేర్కొన్నారు.

* * *

చలన చిత్రాలకు ప్రభుత్వ బహుమతులు

భారత ప్రభుత్వ బహుమతులకు అర్హమైన చలన చిత్రాలు నిర్ణయించే పరీక్షా కార్యక్రమం సెప్టెంబరునాటికల్లా ముగిసి ఫలితాలు ప్రకటిస్తారు. నిర్ణాయక సంఘాలు చూడడానికై నిర్మాతలు చలన చిత్రాలను, వాటి కథా సంగ్రహాలనూ పంపడానికి గడువు జూను 30 తో ముగిసింది. ఇతః పూర్వం నిర్ణయించినవ్యవధి మే 15 అయినా, ఆ తేదీ తరువాత కొన్ని దరఖాస్తులు వచ్చినందువల్ల, మరి కొందరుకూడా పంపవచ్చునన్న భావంతో ఈ గడువు పొడిగించారు. నిర్ణాయక సంఘం చూడతగ్గ చిత్రాల పేర్లను సినిమాసంఘ ప్రాంతీయాధికారులు సిఫార్సు చేసినా, ఆయా నిర్మాతలు స్వతంత్రంగాకూడా చిత్రాలను పోటీకి పంపడానికి ప్రభుత్వం అవకాశం కలిగించింది.

* * *

బొంబాయి సినిమా లేఖ

...పెన్ నటించారు. దర్శకుడు రవీంద్రదవే. సంగీతం శార్దూల్ క్వాత్రా కూర్చారు. ఏ అంశంలోనూ కొత్తదనం లేదు. కొత్తనటి జబీన్ ఏమంత అమోఘంగా రాణించలేదు.

* * *

ఎస్. టి. పిక్చర్స్ వారి "మాలిక"లో శకీలా, మహిపాల్, ఓంప్రకాశ్, యశోధరకట్టూ, సుందర్, కుంకుం పాల్గొన్నారు. ఇది 'చార్ మీనార్'కు ఉజ్జీ కథ, దర్శకత్వం, వలపయావత్తూ మూసపోసినట్టు పాతపంథాలోనే ఉన్నాయి. చిరాకు కలిగించనిది, ఉన్నవాటిలో ఆకర్షవంతంగా ఆహ్లాదకరంగా ఉన్నది హంసరాజ్ బెహల్ కూర్చిన సంగీతం ఒకటే. ★

(ఆంధ్రవారపత్రిక, బొంబాయి విలేఖరి.)

మరో 'టీ సెంటర్' మద్రాసులో నెలకొల్ప నిర్ణయం

'తేనీరు' ప్రచార కార్యక్రమం క్రింద 'టీ బోర్డు' వారు మద్రాసులో మౌంటు రోడ్ వద్ద ఒక 'టీ సెంటర్' నెలకొల్పడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బొంబాయిలో ఈ మధ్య ఇటువంటిదొకటి నెలకొల్పడం విదితమే. మద్రాసు 'టీ సెంటర్' లో కూడా, ఒక చిన్న సినిమా హాలు నిర్మిస్తారు. ఇదికాక, అక్కడే, అడిగిన వారికి 'టీ తయారు చేయడంలో మంచి పద్ధతులను తెలియచెప్పే ప్రదర్శనం కూడా ఉంటుందట.

* * *

చార్ దోస్త్

బాల చలన చిత్ర సంస్థ నిర్మించిన తొలి చిత్రం "చార్ దోస్త్" (నలుగురు నేస్తాలు) చిత్రాన్ని ఎడింబరో చలన చిత్రోత్సవానికి పంప నిశ్చయించారు. ఉత్సవాలు ఆగస్టు మొదటి వారంలో జరుగుతాయి. ఈ చిత్రం ఇంగ్లీషులోనూ, హిందీలోను తయారైంది. ఇంగ్లీషు చిత్రానికి హిందీ నటుడు డేవిడ్ కథ చెబుతారు. దర్శకుడు శ్రీ నితిన్‌బోస్.

బాలచిత్ర సంస్థ ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఇందిరాగాంధీ ఈ చిత్రం ప్రతిని తీసుకు వెళ్తారు.

* * *

సినిమా వార్తలు

"నవభారత పునర్నిర్మాణ కార్యక్రమాలను, అందులో పాలొని కృషిచేస్తున్న భారత ప్రజలను, వారి జీవిత విధానాలనూ, చలన చిత్రంగా నిర్మించగలగడం నాకు ఎంతో సంతోషం కలిగిస్తున్నది" అని మాస్కో సెంట్రల్ డాక్యుమెంటరీ స్టుడియో డైరెక్టర్ రోమన్ కార్మెన్ ఇటీవల శ్రీనగర్‌లో మాట్లాడుతూ అన్నారు. భారతదేశం పై ఈయన నిర్మిస్తున్న డాక్యుమెంటరీ. దేశపునర్నిర్మాణ కార్యక్రమాలను చిత్రిస్తుంది. ఈ చిత్రం నిడివి 9 వేల అడుగులు ఉంటుంది. దీనికై, శ్రీ కార్మెన్, ఆయన వెంట వచ్చిన సోవియట్ టెక్నిషియన్‌లు దేశంలో పర్యటిస్తున్నారు.

భారత రష్యాల మధ్య ఫిలిం ప్రతినిధి వర్గాల రాకపోకలు ఇతోధికం అయితే ఇరు దేశాల మధ్య సద్భావ స్నేహ సంబంధాలు పెంపొందడానికి మరింత దోహదం జరుగగలదని శ్రీ కార్మెన్ సూచించారు.

* * *

శ్రీ ధనసాయి ఫిలింస్ వారి చిత్రం 'బలే బావ' షూటింగ్ వీనస్‌లో సాగుతోంది. జానకి, గిరిజ, రేలంగి, జగ్గయ్య, గుమ్మడి, సి. ఎస్. ఆర్. సీతారాం ప్రభృతులు పాల్గొంటున్నారు. దర్శకుడు శ్రీ రజనీకాంత్. నిర్మాత శ్రీ టి. రంగయ్య.

* * *

వీనస్‌లో తయారవుతున్న మరి రెండు తెలుగు చిత్రాలు అంజలీ వారి జానపదం, అనుపమ వారి "ముద్దుబిడ్డ."

అంజలీ వారి ఈ చిత్రానికి ఇంకా నామకరణం జరుగలేదు. నాగేశ్వరరావు, అంజలీ ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. దర్శకుడు శ్రీ వేదాంతం రాఘవయ్య. ఒక సాహసోపేత గాథ ఆధారంగా తయారవుతున్న ఈ చిత్రంలో, పెద్ద సెట్స్, కంటింపైన నృత్యాలూ, మంచి సంగీతం పుష్కలంగా ఉంటాయట. ఈ చిత్రానికి మాటలూ పాటలూ శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి వ్రాస్తున్నారు. సంగీతం శ్రీ ఆదినారాయణరావు. నృత్యదర్శకుడు శ్రీ వెంపటి సత్యం. ఈ చిత్రం తమిళంలో కూడా నిర్మింపబడుతోంది.

శరత్ రచన "బిందుగారి అబ్బాయి" ఆధారంగా అనుపమ ఫిలింస్ నిర్మిస్తున్న చిత్రానికి "ముద్దుబిడ్డ" అని పేరు పెట్టారు. లక్ష్మీరాజ్యం, జమున, సూర్యకాంతం, నాగయ్య, జగ్గయ్య, సి. ఎస్. ఆర్. రమణారెడ్డి, కుటుంబరావు, పేకేటి మొదలైనవారు నటిస్తున్నారు. మాస్టర్ వెంకటేశ్ ముఖ్య పాత్రను నిర్వహిస్తున్నాడు. దర్శకుడు శ్రీ తిలక్.

* * *

లక్ష్మీ ప్రొడక్షన్స్ వారి "ఇలవేలుపు" జూన్ 21 న విడుదల అయింది. శ్రీ యోగానంద్ దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో అంజలి, నాగేశ్వరరావు, రేలంగి, జమున, కృష్ణకుమారి, ప్రభృతులంతా పాల్గొన్నారు. శ్రీ ప్రసాద్ పర్యవేక్షణ చేశారు.

* * *

నందీ పిక్చర్స్‌వారు శ్రీ జంపన దర్శకత్వాన నిర్మిస్తున్న "సౌభాగ్యవతి" మూడు రీళ్లపై చిలుకు పూర్తి అయింది. ఇందులో సావిత్రి, రామారావు, రంగారావు, రేలంగి, సూర్యకాంతం, హేమలత నటిస్తున్నారు.

* * *

మినర్వా పిక్చర్స్‌వారి 'సారంగధర' సగానికి పైగా పూర్తి అయింది. భానుమతి, రామారావు, రాజసులోచన, రేలంగి నటిస్తున్నారు. దర్శకుడు శ్రీ శ్రీనివాసరాఘవన్.

★

బొంబాయిలో ఫిలిం జర్నలిస్టుల సంఘ ఉత్తమచిత్రానికీ, దర్శకుడికీ, నటీనటులకూ మొన్న సన్మానం చేసింది. సభకు అధ్యక్షత వహించిన బొంబాయి ముఖ్యమంత్రి మురార్జీ, ఉత్తమ నటుడుగా ఎన్నిక అయిన దేవానంద్, నటి నూతన్ సమర్థ్.



డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణవలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

19. థాలియా కొత్త ఉద్యోగం

బ్రబజాన్స్ బ్యాంకి దివాలా తీయడంతో దాని వ్యవహారాలన్నీ సరిచెయ్యడానికి వారం పైగా పట్టింది. థాలియా డ్రమండ్ వారం రోజుల జీతమూ తీసుకొని తోలుసంచీలో వేసుకుని బ్యాంకి వదిలి వెళ్ళిపోయింది. మరో ఉద్యోగం దొరికే సూచన ఎక్కడా లేదు.

ఇన్స్పెక్టర్ పార్ ఆమెను నలుగురి మధ్యా నిలబెట్టి నీతిబోధ చేస్తున్నట్లు చేస్తూనే కొంచెం బెదిరించి చూశాడు.

"నువ్వు మార్ల్ గృహంలోంచి రావడం, మార్ల్ తలుపులు వేసుకోవడం నేను స్వయంగా చూశాను కనుక బతికిపోయావు లేకపోతే నీమీదనే పడేది హత్యానేరం."

"మీ నీతిబోధ కూడా లేకపోతే ఇంకా బతికిపోదును," అని థాలియా నిశ్చలంగా జవాబిచ్చింది.

ఆమె వెళ్ళిపోగానే పార్ ఆమె వెళ్ళిన వైపే చూస్తూ, "ఇక ఆమెను చేసేదేం లేదు మనం" అన్నాడు.

"చాలా చిత్రమైన యువతి," అన్నాడు డెరిక్ యేల్. "ఆమెనుగూర్చి ఆలోచించిన కొద్దీ చిత్రంగా కనిపిస్తోంది బ్యాంకిలో ప్రవేశించినప్పటినుంచీ ఈమె చిల్లర దొంగతనాలు చేస్తూనే ఉందని మిలీమాక్రాయ్ చెబుతోంది. కాని దానికి ఋజువేమీ లేదు. బ్రబజాన్ ఒక్కడే సాక్ష్యం ఇవ్వగలడు. కాని అతడు పారిపోయాడు. అసలు బార్నెట్‌ను విచారణ చేసినప్పుడు థాలియాను సాక్షిగా ఎందుకు పిలవలేదు నువ్వు?"

"బార్నెట్ సంగతంతా నేను కళ్లారా కనిపెట్టినప్పుడు ఇంక మరొకరి సాక్ష్యమెందుకు నాకు?"

యేల్ తీవ్రంగా ఆలోచిస్తూ "అసలు..." అని ఏదో అనబోతూ ఆగాడు.

"ఏమిటది?"

"ఈ యువతి అరుణవలయాన్ని గూర్చి మనకేమైనా చెప్పగలదేమోనని ఆలోచిస్తున్నాను. అసలు నేనే ఈమెను ఉద్యోగంలోకి తీసుకుందామా అనుకుంటున్నాను," యేల్ అన్నాడు.

పార్ ఏదో అస్పష్టంగా గొణిగాడు.

"నేను మూర్ఖంగా ప్రవర్తిస్తున్నానని నీ ఉద్దేశం. కాని నా ఆఫీసులో దొంగిలించదానికేమీ లేదు; నేనామెని జాగ్రత్తగా కనిపెడుతూ ఉంటాను. ఆమె గనక అరుణవలయంతో వ్యవహారం సాగిస్తూ ఉంటే ఆ సంగతి నాకు తేలికగా తెలియడానికి వీలుంటుంది. అదీ గాక ఆమెమీద నాకు ఆసక్తి అధికమవుతోంది."

"ఆమెతో కరస్పర్శ చేసినట్లున్నావే ఇందాక?" పార్ అడిగాడు. డిటెక్టివ్ యేల్ మందహాసం చేసి,

"ఆమె ఎలాంటిదో కనిపెట్టాలనే కరస్పర్శ చేశాను. ఆమె జీవితం పాపభూయిష్ఠమైన శక్తులకు లోబడినట్లు నేను గ్రహించాను. అసలు ఈ యువతి స్వతంత్రంగా వ్యవహరించడం లేదు ఆమె వెనుక..."

"అరుణవలయం ఉన్నదనేనా?" పార్ వెటకారం చేస్తున్నట్లు ప్రశ్నించాడు.

"ఏం, ఎందుకు ఉండకూడదు. ఏమైనా నేను ఆమెను చూడడానికి వెళుతున్నాను," అని యేల్ గంభీరంగా అన్నాడు.

థాలియా బసకు వెళ్ళాడు యేల్. ఆమె పనికత్తె అతన్ని డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకు వెళ్ళింది. ఒక నిమిషం తరవాత థాలియా వచ్చింది. అందంగా మెరుస్తున్న ఆమె నేత్రాల్లో చిరునవ్వు రేఖామాత్రంగా గోచరించింది యేల్‌ను ఆమె గుర్తుపట్టింది

"ఓ, మిస్టర్ యేల్! నన్ను హెచ్చరించడానికి వచ్చారా మీరు?"

"కాదు. నీకు ఉద్యోగం ఇవ్వడానికి వచ్చాను."

ఆమె కనుబొమలెగరేసింది. "ఓ, మీకు అసిస్టెంటు కావాలా? దొంగని పట్టుకోడానికి దొంగే కావాలనే సిద్ధాంతం ఆచరణలో పెడదామనుకుంటున్నారుగదూ! లేకపోతే నన్ను బాగుచేద్దామని భావిస్తున్నారా? నన్ను బాగుచెయ్యాలని చాలామంది ప్రయత్నిస్తున్నారు." థాలియా వ్యంగ్యంగా ఈ మాటలంది.

ఆమె వ్యంగ్యాన్ని అతడు గ్రహించాడు.

"మిస్ డ్రమండ్! నువ్వు ఎందుకూ దొంగతనం చేస్తూంటావు?"

"అది నా స్వభావం."

"దాని వలన నీకేమైనా తృప్తి కలుగుతోందా! నేను ఊరికే అడగడం లేదు. మానవ ప్రవృత్తులను పరిశోధించే కుతూహలంతో అడుగుతున్నాను."

ఆమె తన గది అంతా చేత్తో చూపిస్తూ ఇలా అన్నది:

"చూడండి నాకు ఎంత మంచి ఇల్లు లభించిందో? మంచి పనిగత్తె కూడా ఉంది. తిండికి లేక మాడే అవస్థ కూడా నాకు లేదు. కనక ఇవన్నీ నాకు తృప్తి కలిగించక ఏమవుతాయి? సరే, మిస్టర్ యేల్! మీరు వచ్చిన పనేమిటో చెప్పండి. నన్ను పోలీసు పని చెయ్యమంటారా?"

"అబ్బే అది కాదు. నాకు నమ్మకమైన సెక్రటరీ కావాలి. నా బాధ్యతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. నాకు వచ్చే ఉత్తరాలకు జవాబివ్వడం అసాధ్యమవుతోంది. అదీ ఉంచి నా ఆఫీసులో నీ దొంగతనాలు సాగించడానికి అవకాశమే లేదు.. ఒక వేళ ఉన్నా, పరవాలేదనే ఉద్దేశంతో వచ్చాను," అన్నాడు డెరిక్ యేల్.

అతని వంక సూటిగా చూస్తూ కొంత ఆలోచించింది.

"సరే, మీకు ఫరవాలేకపోతే నాకు ఫరవాలేదు మీ ఆఫీసెక్కడ?"

యేల్ తన చిరునామా ఇచ్చాడు.

"రేపు పొద్దున మిమ్మల్ని కలుసుకుంటాను. కాని మీ చెక్కు బుక్కు ఎక్కడున్నా భద్రంగా దాచుకోండి. చిల్లర డబ్బులు కూడా జాగ్రత్త చేసుకోండి."

డెరిక్ యేల్ తిరిగి వెళ్ళిపోతూ "ఏం ధైర్యం! మెప్పుకోదగిన అమ్మాయి!" అనుకున్నాడు.

ఆమె ప్రవర్తన చిత్రంగా ఉన్నదని పార్‌తో చెప్పినప్పుడు అతడు అతిశయోక్తిగా ఏమీ చెప్పలేదు. తన జీవితకాలంలో

అతడు అనేకరకాల నేరస్థులను చూసి ఉన్నాడు. పార్ కు ఎంత అనుభవమున్నా డిటెక్టివ్ యేల్ కు తెలిసినంతగా నేరస్థుల మనస్తత్వం అతనికి తెలియదు.

అతని ఆలోచనలు పార్ మీదికి మళ్లాయి. పాపం, పార్ చాలా అవమానంతో కుంగిపోయాడు. అరుణవలయం నేరాల్లో మూడో దాన్ని కూడా అతను అరికట్టలేకపోయాడు. ఇంతవరకూ అరుణవలయం రహస్యం ఛేదించలేక పోయాడు. పై అధికారులు అతన్ని ఆట్టేకాలం ఉద్యోగంలో ఉంచరనికూడా అనిపించింది.

ఇన్‌స్పెక్టర్ పార్ కూడా ఆ రాత్రి అదే విధంగా ఆలోచిస్తున్నాడు. పోలీసుశాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లగానే అతని కక్కడ ఒక అధికారలేఖ అందజేశారు. చాలా బాధపడుతూ చదివాడు. ఇది ఇంతటితో ఆగిపోదనికూడా భయపడ్డాడు.

మరునాడు ఉదయం అతనికి ఫ్రాయంట్ ఇంటినుండి పిలుపు వచ్చింది. డెరిక్ యేల్ అంతకుముందే అక్కడకు వచ్చాడు.

పార్, యేల్ ఉభయులూ పైకి మామూలుగా, స్నేహంగానే ఉన్నట్లు కనిపించినా, అరుణవలయం అపరాధ పరిశోధన మాత్రం వీరిద్దరికీ తెలియచేటల పోటీగా పరిణమించింది. పార్ కు త్వరలో సంభవించనున్న ఉద్యోగచ్యుతికి ముఖ్యకారణం అరుణవలయాన్ని పట్టుకోలేక పోవడం కంటె, అతని అనధికార ప్రత్యర్థియైన డెరిక్ యేల్ అసాధారణ, మానవాతీత ప్రజ్ఞయేనని కొన్ని వార్తాపత్రికలు కూడా ఆరోపణ చేశాయి. కాని యేల్ ఈ భావాన్ని సాధ్యమైనంతవరకూ తగ్గించి వేయడానికే ప్రయత్నించాడని ఒప్పుకోవాలి. అయినా ఆ భావం తొలగిపోలేదు.

ఫ్రాయంట్ కు 'హెచ్చరిక' రాగానే, తన లోభిత్వాన్ని, యేల్ వసూలుచేసే పెద్ద ఫీజునుకూడా లక్ష్యంచేయక వెంటనే అతన్ని పిలిపించాడు. పోలీసులలో ఫ్రాయంట్ కు నమ్మకం పోయింది. ఈ విషయం అతను దాచుకోనూ లేదు.

"మిసర్ ఫ్రాయంట్ చెల్లించి వేయడానికే నిశ్చయించారు" అన్నాడు యేల్ పార్ ను చూడగానే.

"ఏం తప్పా? చెల్లించేస్తాను." అని ఫ్రాయంట్ కోపంగా అరిచాడు.

గడచిన కొలది దినాలలో ఫ్రాయంట్ పదేళ్లు వృద్ధుడైనట్లు కనబడ్డాడు. అతని ముఖం తెల్లబడి చిక్కిపోయింది. మనిషి బాగా కుంగిపోయాడు.

"ఈ హంతకుల ముఠానుంచి ప్రజల ధన మాన ప్రాణాలను పోలీసులు రక్షించలేకపోయిన తర్వాత అడిగినంతా చెల్లించి వెయ్యడంకంటె మార్గం ఏముంది? నాస్నేహితుడు మిస్టర్ పిండిల్ అనే అతనికిలాగే బెదిరింపు వచ్చింది. అతడు చెల్లించేశాడు. నే నింక ఈ ఆందోళన భరించలేను", అన్నాడు ఫ్రాయంట్.

అలిసిపోయినవాడిలా అతడు లైబ్రరీగదిలో పచార్లు చేయసాగాడు.

"మిస్టర్ ఫ్రాయంట్ చెల్లిస్తే చెల్లించవచ్చును. కాని ఈ సారి అరుణవలయంవారు మరీ సాహసం చేస్తున్నట్లు తోస్తుంది".

"ఏమిటి నీ ఉద్దేశం?" పార్ యేల్ ను అడిగాడు.

"మీ దగ్గిర ఆ ఉత్తరం ఉందా?" యేల్ అడిగాడు. ఫ్రాయంట్ విసురుగా డ్రాయరు తెరిచి కార్డును బల్లమీద పడేశాడు.

దానిమీద ఉన్న అరుణవలయ ముద్రను గమనించి పార్ "ఎప్పుడు వచ్చిందిది?" అని అడిగాడు.

"ఇవ్వాళ పొద్దున పోస్టులో వచ్చింది".

వలయమధ్యంలో ఉన్న అచ్చు అక్షరాలిలా చదవసాగాడు పార్ :

"శుక్రవారం మధ్యాహ్నం మూడున్నరకి డెరిక్ యేల్ ఆఫీసుకి మేము వచ్చి డబ్బు

తీసుకుంటాను. మీరు తెచ్చే నోట్లు ఒకే వరుసలో ఉండకూడదు. ఆ సమయానికి మీరు డబ్బు తీసుకురాకపోతే మీరు ఆ వేళ రాత్రే హతమైపోతారు".

ఈ లేఖను ఇన్‌స్పెక్టర్ పార్ మూడు సార్లు చదివాడు. నిట్టూర్పు విడిచి "దీనికేం భయపడవక్కర్లేదు. వారు ఎలాగూ రారు-" అంటుండగా యేల్ అడ్డు వచ్చి

"తప్పకుండా వస్తారు. అయినా నేను సిద్ధంగా ఉంటాను. పార్! నువ్వు కూడా అక్కడే ఉండాలి" అని గంభీరంగా అన్నాడు.

"ఆరు నూరైనా, నూరు ఆరైనా నేను అక్కడే ఉండితీరుతాను. కాని వాళ్లు వస్తారని నేననుకోను."

"నీతో నేనేకీభవించలేను పార్! అరుణ వలయం నడుపుతున్న వ్యక్తి ఎవడైనా, ఎవతైనా, ధైర్యసాహసాలకు మాత్రం లోటు లేదు. తప్పకుండా ఆ వ్యక్తి వస్తాడని నా నమ్మకం. అన్నట్లు పార్! నా ఆఫీసులో నీకు తెలిసిన ఒక వ్యక్తిని చూపిస్తాను," అన్నాడు యేల్.

"మిస్ డ్రమండ్ 'అనుకుంటాను". యేల్ అవునన్నాడు.

"అయితే ఆమెను ఉద్యోగానికి తీసుకున్నావా?"

"ఆమెమీద నా కెందుకో శ్రద్ధ బయలు దేరింది. ఈ రహస్యభేదనంలో ఆమె చాలా ఉపయోగిస్తుందని నా నమ్మకం."

ఇంతలో ఫ్రాయంట్ వచ్చాడు. ఇరువురూ సంభాషణను చాకచక్యంతో మార్చేశారు.

20. జాక్ బియర్డ్‌మోర్ ఇంటికి తాళంచెవి

గురువారం ఉదయమే ఫ్రాయంట్ బ్యాంకిలోనుంచి డబ్బు తీసుకుని యేల్‌కి అప్పగించేటట్లు, యేల్ ఆఫీసుకి ఇన్‌స్పెక్టర్ పార్ ముందుగానేవచ్చి అరుణవలయం వ్యక్తిని బంధించేందుకు తగిన కట్టుదిట్టాలన్నీ చేసేటట్లు ఏర్పాటు చేయబడింది.

పార్ పోలీసుకార్యాలయానికి వెడుతూ దోవలో జాక్ బియర్డ్‌మోర్ యింటివద్ద ఆగాడు. జాక్ ఆ ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నాడు.

గడచిన కొలదివారాలుగా జరిగిన సంఘటనలతో జాక్ బాగా మారిపోయాడు. కుర్రతనం పోయి, ప్రౌఢవయస్కుని నిబ్బరం, నిగ్రహం వచ్చాయి. పెద్ద ఆస్తికి వారసుడైనాడు. ఆస్తి రావడంతో, జీవనోత్సాహం నశించింది. థాలియా డ్రమండ్‌ను మరిచిపోదామన్నా మరవలేకుండా ఉన్నాడు. నిద్రపోతున్నా, మేలుకున్నా, ఏంచేస్తున్నా థాలియావదనమే అతని మనస్సులో సాక్షాత్కరించి ఉంటోంది. ఇదేం బాగాలేదని అతడు ఎంత ప్రయత్నించినా ఆమెమాత్రం అతని భావపీఠినుండి తొలగడంలేదు.

ఇన్‌స్పెక్టర్ పార్‌కీ, జాక్‌కీ మధ్య తెలియకుండానే ఒక స్నేహానుబంధం ఏర్పడింది. పార్‌ను అతడు ద్వేషించిన రోజులు లేకపోలేదు. అయితే తనకు థాలియా మీద ప్రేమకొద్దీ ఆమెలో దుర్గుణ లేశమైనా కనిపించకపోవచ్చుగాని, పోలీసు అధికారి కూడా అదేవిధంగా భావించాలనడం భావ్యంగా లేదని సమాధానపరచుకున్నాడు.

జాక్ భవన ప్రాకారంవద్ద పార్ ఆగాడు. వెళ్ళిపోదామనుకున్నాడు గాని, మళ్ళీ ఏం ఆలోచన కలిగిందో లోపలికి వెళ్లి ఎలెక్ట్రిక్ బెల్ మ్రోగించాడు. నౌకరువచ్చి తలుపు తీసి లోపలికాహ్వానించాడు.

జాక్ ప్రాతఃకాల భోజన మారగిస్తున్నాడు.

"రండి రండి. మీరు భోజనం చేసేశారనుకుంటాను. ఏమిటి విశేషాలు?" అని జాక్ అడిగాడు.

"ఏమీ లేదు. ఫ్రాయంట్ అరుణవలయానికి డబ్బు చెల్లించడానికే నిశ్చయించాడు."

జాక్ ఫ్రాయంట్ పేరువిని అసహ్యంతో "ఇస్తాడు. ఎందుకివ్వడు?" అనినవ్వుతూ "నేనుమాత్రం ఆ అరుణవలయం యజమానిని కావడానికి ఇష్టపడను" అన్నాడు.

"ఏం ఎందుకని?" అని పార్ మందహాసం చేస్తూ అడిగాడు.

"మా తండ్రిగారు అంటూండేవారు, ఫ్రాయంట్ దగ్గిర్నించి ఎవడన్నా ఒక చిల్లిగవ్వ తీసుకున్నా సరే, అది తిరిగి తన చేతికి వచ్చేదాకా నిద్రపోడని. హోక్వే ఫ్రాయంట్ ముందు డబ్బు చెల్లించినా, భయం తగ్గాక అరుణ వలయాన్ని వెంటాడి తను ఇచ్చిన ప్రతి బ్యాంకి నోటు తిరిగి సంపాదించేదాకా ఊరుకోడు."

"కావచ్చును. కాని ఇంకా డబ్బు చెల్లించలేదుగా?" అన్నాడు పార్.

ఫ్రాయంట్‌కు ఆ ఉదయమే చేరిన అరుణ వలయలేఖ వృత్తాంతమంతా పార్ జాక్‌కు వివరించాడు. జాక్ విభ్రాంతుడైనాడు.

"అరుణవలయంవారు మరీ సాహసానికి ఒడిగడుతున్నారు. డెరిక్ యేల్‌ను మోసగించాలంటే సామాన్యం కాదు."

"అవును" అని పార్ కుర్చీలో కాలుమీద కాలు వేసుకుని సుఖంగా కూర్చుంటూ "యేల్‌ను కొన్ని విషయాల్లో మెచ్చుకోవాలి", అన్నాడు.

"ముఖ్యంగా, వస్తువులను చూసి వాటి సంగతి సందర్భాలు చెప్పివేయగల ప్రజ్ఞ అసాధారణమైనది".

"ఏమో, ఆ ప్రజ్ఞమీద నా కేమీ నమ్మకం లేదు. అతని ఇతర ప్రజ్ఞల విషయం నేను మాట్లాడేది," అని పార్ ఒక్కసారిగా మౌనంగా ఉండిపోయాడు. అతని మౌనానికి కారణం జాక్ గ్రహించాడు.

"మిమ్మల్ని మీపై అధికారులు ఇబ్బంది పెడుతున్నారనుకుంటాను. అరుణవలయాన్ని నిగ్రహించలేకపోయినందుకు వారు మీ మీద కారాలు, మిరియాలు నూరుతూ ఉండి ఉండాలి"

పార్ తల ఊపాడు. "నా పరిస్థితి ఏమంత సుఖంగా లేదు ప్రస్తుతం. కాని అందుకు నేనేమీ బాధపడటం లేదు," అని జాక్ కేసి సూటిగా చూసి "మీ స్నేహితురాలికి కొత్త ఉద్యోగం దొరికింది, తెలుసా?" అన్నాడు.

"నా స్నేహితురాలా? మిస్—"

"అవును మిస్ డ్రమండ్. డెరిక్ యేల్ ఆమెకు తన ఆఫీసులో ఉద్యోగం ఇచ్చాడు." జాక్ ఆశ్చర్యం చూసి పార్ నవ్వుకున్నాడు.

"యేల్ ఆఫీసులోనా? నిజమా, వేళాకోళమా?"

"మొదట యేల్ చెప్పినప్పుడు వేళాకోళమేమోనని నేనూ అనుకున్నాను. యేల్ చిత్రమైన మనిషి."

"అసలు డెరిక్ యేల్ పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారంలో ఉండదగినవాడని చాలామంది ఉద్దేశం," అని జాక్ వెంటనే అలా అని ఉండకూడదని గ్రహించాడు. పార్ నొచ్చుకున్నాడో లేదో గాని, నొచ్చుకున్న భావమేమీ అతని ముఖంలో ద్యోతకం కాలేదు.

"బయటవారిని అలా పోలీసుశాఖలోకి చేర్చుకోరు. అలా చేర్చుకునేటట్లయితే నిన్నే తీసుకునేవాళ్ళంగదా! డెరిక్ యేల్ తెలివైనవాడని నేనూ ఒప్పుకుంటాను. సాధారణంగా మేము ఈ ప్రైవేటు డిటెక్టివులను అనవసరంగా పోలీసుల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే మూర్ఖులుగా జమకడతాం. కాని యేల్ విషయం వేరు. అతడు నిజంగా తెలివైనవాడు."

ఇరువురూ ఇలా మాట్లాడుతూ కిటికీ వద్దకు చేరారు. కిటికీలోంచి బయటికి చూస్తున్నారు. హఠాత్తుగా జాక్ "అదిగో ఆమె మిస్ డ్రమండ్ కాదూ?" అన్నాడు.

పార్ ఆమెనంతకుముందే చూశాడు. థాలియా రోడ్డు అవతలిపక్కన నెమ్మదిగా నడుస్తూ ఇళ్ళ నంబర్లు చూస్తోంది. చివరికి రోడ్డు దాటింది.

"ఆమె ఇటే వస్తోంది...." అని జాక్ సంభ్రమంతో అరిచాడు. గబగబ గదిలోంచి పరిగెత్తి వాకిలి తలుపు తెరిచాడు.

"థాలియా! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి? లోపలికిరా. నీకు తెలిసిన ఒక వ్యక్తి కూడా ఇక్కడే వున్నాడు."

ఆమె కనుబొమలెత్తి "మిస్టర్ పార్ కదూ?" అన్నది.

"నీ ఊహాశక్తి అద్భుతం" అని జాక్ నవ్వి, తలుపులు మూసేశాడు. "నన్ను ఒంటరిగా కలుసుకుందామని వచ్చావా?"

"కాదు. మిస్టర్ యేల్ ఒక పనిమీద పంపించాడు. మీ ఎస్టేటులో ఒక చిన్న ఇల్లు ఉన్నదట, దాని తాళంచెవి కావాలని ఆయన అడిగాడు," అన్నది థాలియా.

ఇరువురూ భోజనాల గదిలోకి వచ్చారు. పార్ ఆమెకేసి శూన్యదృక్కులతో చూశాడు. ఆమె నిర్భయంగా అతనికేసి చూసి తల ఆడించింది.

థాలియా వచ్చిన పని జాక్ పార్‌కు వివరించాడు.

"మా ఎస్టేటులో నదిపక్కన ఒక చిన్న శిథిలగృహం ఉన్నది. కొన్నాళ్ళనుంచీ అందులో ఎవరూ ఉండడంలేదు. దాన్ని మరమ్మతు చేయించడానికి కొత్త ఇంటి

కైనంత ఖర్చు అవుతుందని అంటున్నారు. పారిపోయిన బ్యాంకర్ బ్రబజాన్ ఆ ఇంట్లో దాక్కొని ఉంటాడని యేల్ ఎందుకో అనుమానిస్తున్నాడట. అసలా ఇల్లు కొంతకాలంనుంచీ బ్రబజాన్ అధీనంలోనే ఉంది. అతడు మా తండ్రిగారి ఆస్తిలో కొంతభాగం అజమాయిషీ చేస్తూ ఉండేవాడు. అయితే ఆ ఇంట్లో ఉంటాడని నాకు తోచదు."

పార్ పెదవులు బిగించి చాలాసేపు ఆలోచించి, చివరికిలా అన్నాడు:

"ఇంతవరకూ బ్రబజాన్ ఈ దేశం విడిచిపెట్టి వెళ్ళలేదని మాత్రం నేను చెప్పగలను. ఆ ఇల్లు సోదా చేస్తారని తెలిసి కూడా అక్కడతడు తలదాచుకుంటాడని నేననుకోను."

"అది పూర్తిగా వాసయోగ్యమైనది కాదు. సగం సామానులు దాచడానికి, సగం నివసించడానికి అది ఉపయోగించబడేది. నేనెప్పుడూ దాన్ని చూడలేదు" అన్నాడు జాక్. డ్రాయరు తెరిచి తాళం చెవులగుత్తి బయటికి తీశాడు. ఒక తాళంచెవి ఊడదీసి "మిస్ డ్రమండ్. ఇదిగో తాళం చెవి" అని ఇచ్చాడు. "నీ కొత్త ఉద్యోగం ఎలా ఉంది?" అని అడిగాడు. ఆమె సమక్షంలో అతడు సాధారణంగా నోరు విప్పడానికే భయపడతాడు. అందుచేత చాలా సాహసించే ఈ ప్రశ్న వేశాడు.

ఆమె అందంగా మందహాసం చేసింది. "బాగానే ఉంది. కాని ఇవ్వాళే ఉద్యోగంలో చేరి ఇవ్వాళే ఏం చెప్పగలను?" అని ఇన్‌స్పెక్టర్ కేసి తిరిగి "మిస్టర్ పార్! మీకీసారి శ్రమకలిగించను. మిస్టర్ యేల్ ఆఫీసులో కాస్త ఖరీదైన వస్తువల్లా వెండి పేపర్ వెయిట్ ఒకటే. ఇంకేమీ లేదు. ఉత్తరాలు పోస్టు చెయ్యవలసిన పనికూడా లేదు. ఆఫీసు అమెరికన్ పద్ధతిలో కట్టబడింది. యేల్ ప్రైవేటు గదిలో ఒక రంధ్రం ఉన్నది. ఆ రంధ్రంలోంచి ఉత్తరాలు పడేస్తే సరాసరి కింద హాలులో ఉన్న తపాలా పెట్టెలో పడతాయి. కనక, నాకీ పని నిరుత్సాహంగానే ఉంది" అన్నది. ఆమె ఈ మాటలు గంభీరంగానే అన్నా, ఆమె కళ్లల్లో కొంటెతనం, వ్యంగ్యం ప్రస్ఫుటమవుతూనే ఉన్నాయి.

"నువ్వు చిత్రమైన దానివి థాలియా డ్రమండ్! అయినా నీలో కొంచెం మంచితనం లేకపోలేదనిపిస్తోంది" అన్నాడు పార్.

ఈ మాటలతో ఆమె కెందుకో నవ్వు వచ్చింది. నవ్వి నవ్వి కళ్ళలో నీళ్ళు వచ్చేదాకా పగలబడి నవ్వింది. జాక్ కూడా నవ్వాపుకోలేక కొద్దిగా నవ్వాడు.

కాని పార్‌కు నవ్వవలసినదేమీ కనిపించలేదల్లే ఉంది. తీవ్రంగా ముఖం పెట్టి "జాగ్రత్తగా ఉంటూఉండు. నోళ్ళు దగ్గర పెట్టుకుని మసులుకో. తెలిసిందా?" అని హెచ్చరించాడు. ఆమె ముఖంలో వెంటనే నవ్వు మాయమైంది.

"నా గురించి మీరేమీ బెంగపడనక్కర్లేదు మిస్టర్ పార్! నా సంగతి నేను చూసుకోగలను. ఒకవేళ నా కేదైనా ఆపద సంభవించినా వెంటనే మీకు కబురు చేస్తాను."

"మంచిదే. అయినా, నా అనుమానాలు నాకున్నాయి. అందుచేతే హెచ్చరిక చేస్తున్నాను," అన్నాడు పార్.

21. నదిప్రక్కన ఇల్లు

థాలియా సరాసరి ఆఫీసుకు వెళ్ళింది. డెరిక్ యేల్ తనగదిలో కూర్చుని జవాబివ్వవలసిన ఉత్తరాలన్నీ చదువుతున్నాడు.

"అదేనా తాళంచెవి? ఇలా ఇవ్వు. ఈ ఉత్తరాల్లో చాలామటుకు నువ్వే సమాధానాలు రాయాలి. ప్రైవేటు డిటెక్టివులుగా తర్ఫీదు పొందాలని ఉందని చాలమంది యువకులు రాస్తున్నారు. అందరికీ ఒకే మాదిరిగా సమాధానాలు రాసెయ్యవచ్చు. నువ్వే సంతకంకూడా పెట్టు. ఇదిగో ఈవిడెవరో ఉత్తరం రాసింది నేను ఇప్పటికే తీరికలేకుండా ఉన్నాను గనుక, కొత్త కేసులేమీ చేపట్టలేనని రాయి," అని ఆజ్ఞాపించాడు.

బల్లమీద ఉన్న తాళంచెవిని తీసుకుని దాన్ని తనచేతులో ఒక సెకండుసేపు ఉంచుకున్నాడు.

"నువ్వు మిస్టర్ పార్‌ను చూశావు గదూ!"

ఆమె నవ్వింది.

"మీరు భయంకరమైన మనిషిలాగా ఉన్నారు చూస్తే నేను మిస్టర్ పార్‌ను చూసినమాట నిజమేగాని మీ కెలా తెలిసింది?"

"చాలా తేలిక. అదో గొప్పగాకూడా నేను భావించను. నీ అందమూ, నీ—నీ స్వభావమూ—అదే చిన్న చిన్న దొంగతనాలు చేయడం, ఎంత సహజసిద్ధాలో నా ఊహకికూడా అంతే."

ఆమె వెంటనే సమాధానం చెప్పలేదు.

"నే నిప్పుడు బాగుపడ్డాను" అన్నది చివరికి.

"నువ్వు నెమ్మదిగా బాగుపడతావనే నా నమ్మకం. నీ మీద నాకు అమితమైన ఆసక్తి కలుగుతోంది."

ఆమె టైపురైటరువద్ద కూర్చుని తీవ్రంగా పని చేస్తుండగా యేల్ తన గదిగుమ్మం వద్దకు వచ్చి,

"పార్‌ను టెలిఫోనుమీద పిలుస్తావా? రిజిస్టరులో అతని నంబరు ఉంటుంది," అన్నాడు.

ఆమె టెలిఫోను చేయగా, పార్ తన ఆఫీసులో లేడని సమాధానం వచ్చింది. అరగంట తర్వాత పార్ సమాధానమిచ్చాడు. యేల్ ఫోనులో మాట్లాడాడు:

"పార్! నువ్వేనా మాట్లాడేది?"

కొద్దిగా తెరిచిఉంచిన తలుపు సందులోంచి ఆమెకి మాటలు వినిపిస్తున్నాయి.

"బియర్డ్‌మోర్ ఎస్టేటులోని ఇంటికి నేను వెడుతున్నాను. అక్కడ బ్రబజాన్ దాక్కొని ఉండవచ్చునని నేను అనుమానిస్తున్నాను. మధ్యాహ్నం భోజనమయాక వెడతాను. నువ్విక్కడికి రెండున్నర కల్లా వచ్చెయ్యగలవా?"

థాలియా డ్రమండ్ ఈమాటలన్నీ షార్టుహాండులో వ్రాసుకున్నది.

రెండున్నరకి పార్ వచ్చాడు. ఆమె అతన్ని చూడలేదుగాని వచ్చినట్లు కనిపెట్టింది. ఆతర్వాత ఆఇద్దరూ కలిసి బయటికి వెళ్ళిపోయారు.

వారి అడుగులచప్పుడు ఆగిపోయేంతవరకు ఉండి ఒక టెలిగ్రామ్ ఫారమ్ తీసుకుని "జాన్సన్, నం. 23, మిల్‌బ్రిడ్ వీధి, సిటీ" చిరునామాకు ఇలా సందేశం పంపింది:

"బియర్డుమోర్ ఎస్టేటులోని ఇంటికి డెరిక్ యేల్ సోదాకి వెళ్ళాడు."

* * *

బియర్డ్ మోర్ ఎస్టేటులోని ఇల్లు శిథిలావస్థలో ఉంది. కొన్నిచోట్ల గోడలు పడిపోయాయి అంతటా దుబ్బులు పెరిగి, ముళ్ళతో మార్గాన్ని నిరోధిస్తున్నాయి

"అబ్బ, ఏం దారుణంగా ఉంది ఈ ప్రదేశం ఇలాంటిచోట బ్రబజాన్ ఉంటాడంటే అనుమానమేమరి," అన్నాడు యేల్. తలుపు తెరిచి లోపలికి వెళ్ళారు. సాలెగూళ్లు దట్టంగా అల్లుకుని ఉన్నాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా, నిర్జీవంగా ఉంది. అన్నిగదులూ గబగబా వెదికారు. కాని ఎక్కడా నిందితుని జాడలేదు.

"ఇక్కడేవో మెట్లున్నాయే" అని యేల్ చూపించాడు. అక్కడ పైఅంతస్తుకు పోయే మెట్లున్నాయి. గబగబా మెట్లెక్కి వెళ్లాడు. పైన అతని అడుగులచప్పుడు పార్‌కి స్పష్టంగా వినిపిస్తోంది. మళ్ళీ యేల్ కిందికి వచ్చేశాడు.



భారత మహిళల పురోగమనం

మానవ చరిత్ర పుటలు తిరగవేసి చూస్తే మహిళల దుస్థితికి అనేక కారణాలు గోచరిస్తాయి. పరిస్థితులను అర్థముచేసుకోవటములో చరిత్ర సహకరిస్తుంది గాని, వాటిని త్రవ్వుకొంటూ కాలాలు మరిచిపోయాలు, నూరుకొంటూ కూర్చుంటే వారి జనము పురోగమించలేకపోయేది. భారత దేశములో మహిళోద్యమాలు సాధించిన కార్యాలను సానుభూతితో సింహావలోకనము చేస్తే ప్రథమ పంచవర్ష ప్రణాళికకు పూర్వముకూడా చెప్పుకోతగినంత కృషి జరిగినదని తెలియకమానదు.

భారతదేశము పరాధీనమై ఉన్నకాలములో ప్రజాభ్యుదయకరమైన కార్యక్రమాలన్నిటికీ రాజకీయాలు ఆధారముగా ఉండేవి. 19 వ శతాబ్దములోనే మనదేశములో ప్రాథమిక స్వత్వముల కొరకు అఖండమైన ఉద్యమము సాగింది దాని ఫలితముగా భారతీయులందరికీ జాతిమత భేదము లేకుండా సర్వమానవ సమానత్వముతో ప్రాథమిక స్వత్వాలు లభించటమూ, స్వతంత్ర భారతము శ్రేయోరాజ్యము కావటమూ సంభవించింది.

~~~~~~~~~~~~~~~~~~~~

ఇల్లిందల సరస్వతీదేవి

~~~~~~~~~~~~~~~~~~~~

దేశ స్వాతంత్ర్యోద్యమాలలో మహిళోద్యమ మొకటాయె సాంఘిక, ఆర్థిక, విద్యా వైజ్ఞానికముగా స్త్రీ అభివృద్ధి పొందితేగాని జాతి వీర్య వంతము కాజాలదన్న చైతన్యం ప్రజలలో వ్యాపించింది. స్త్రీ పురుషులలో ఉద్భవించిన చైతన్యమే మహిళోద్యమముగా రూపొందింది 19 వ శతాబములో 'సతి' దురాచార నిర్మూలనముతో భారత స్త్రీ జీవితములో నూతన శకము ప్రారంభమయినది. రావు బహదూర్ వీరేశలింగం పంతులు, విద్యా వైజ్ఞానికముగా స్త్రీల అభివృద్ధికి పాటుపడి నూతన సంస్కరణలను ప్రవేశ పెట్టాడు రాజరామమోహన్ రాయలు ప్రదానము చేసిన ఆయుస్సుతో-కందుకూరి వీరేశలింగం పంతులు ప్రసాదించిన సౌభాగ్యశ్రీతో స్త్రీలు పురోగమించి విద్యా విజ్ఞానాలను అలవరచుకొన్నారు. గాంధీయుగములో స్త్రీలు రాజకీయ చైతన్యముతో పురుషులతో సమానముగా స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్నారు.

భారతదేశములో మహిళోద్యమాలు విప్లవాత్మకమయిన తిరుగుబాటు కాదు కనుక నే విజ్ఞుల సలహాలతో, నాయకుల చేయూతతో, సంఘ సహకారముతో నిరుపద్రవకరముగా కృషిచేయ కలిగాయి.

1917 లో ప్రప్రథమముగా మదరాసు నగరములో భారత మహిళా సంఘము స్థాపింపబడ్డది ఆంగ్ల స్త్రీలయిన డాక్టరు అన్‌బిసెంటు, శ్రీమతి మారరెట్ కజిన్సు ఆ సంస్థకు వ్యవస్థాపకులు ఈ ఇద్దరి సన్నిహితత్వము భారత మహిళోద్యమ చరిత్రలో విస్మరింపరానిది

ఆ సంస్థ స్థాపనతో క్రమముగా భారత

"ఏమీ లేదు పైన." అంతా పాడుబడి ఉంది," అన్నాడు.

"నీకక్కడవేవో కనిపిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు," అని పార్ ఇంటి వెలుపలికి దారి తీశాడు.

వారు వెళ్లిపోతుండగా పైఅంతస్తు కిటికీ గాజు తలుపులోంచి ఒకవ్యక్తి వారికేసే చూస్తున్నాడు. ఆవ్యక్తికి గడ్డం పెరిగిఉంది అతన్ని బాగా తెలిసినవాళ్లు కూడా అతనే బ్రబజాన్ అంటే నమ్మలేరు.

(ఇంకావుంది)

★ భారతమహిళల పురోగమనం ★

నారీ స్వాతంత్రోద్యమముపట్ల ప్రజలు సుముఖత్వము చూపుతూ వచ్చారు. తత్ఫలితముగా అనేకమంది స్త్రీలు ఉద్యమములో చేరారు. 1925 లో 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ విమెన్' అను సంస్థ నెలకొల్పబడి స్త్రీ జనాభ్యుదయము కొరకు కృషి చేయ నారంభించింది. రాష్ట్రాలలో దీనికి అనుబంధంగా 18 శాఖలు వ్యవస్థీకరింప బడినాయి. ఈ మహిళా జాతీయ సంఘము అంతర్జాతీయ మహిళా సంఘానికి అనుబంధించ బడ్డది.

1927 లో అఖిల భారత మహిళాసభ మొదటి సమావేశము పూనాలో జరిగింది. కార్యక్రమాలలోను ఆదర్శాలలోను ఈ సంఘము జాతీయ మహిళా సంఘాన్ని అనుసరించింది. ఈ సంస్థకు 200 శాఖలు ఏర్పడ్డాయి. దేశమందంతటా శాఖోపశాఖలై వెలసిన ఈఅఖిలభారత మహిళా సంఘము, స్త్రీల సమస్యలను ప్రధానముగా తీసుకొని అమోఘమైన కృషి చేసింది వీటి ద్వారా జరిగిన అద్వితీయమైన కృషి ప్రజా దృష్టి నాకర్షించి, వారి అభినూనాన్ని చూరగొన్నది. అఖిల భారత మహిళా సంఘము ఐక్యరాజ్యసమితి యొక్క అన్ని సంస్థల సహాయము సలహాలను పొందగల అర్హత సంపాదించటను ప్రశంసించ తగినది

దేశమందంతటా ఉపసంఘాల నేర్పరచుకొని కృషి చేసిన యంగ్ విమెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (Y W.C A) కూడా ఎన్నతగిన కృషి చేసింది. ఈసంస్థపక్షాన చక్కగా వ్యవస్థీకరింపబడిన వసతిగృహాలు, ఎంప్లాయిమెంటు బ్యూరోలు ప్రధాన నగరాలలో నెలకొల్పబడిన బాలికా పాఠశాలలూ, ఆదర్శవంతముగా నడుపబడుతున్నాయి. స్త్రీలకు ఆర్థికదుస్థితి నుండి రక్షించే ఉద్దేశ్యముతో ఈసంస్థ నెలకొల్ప బడ్డది.

స్త్రీల విద్యాభివృద్ధి, పట్టభద్రుల సమస్యలూ 'ఇండియన్ ఫెడరేషన్ఆఫ్ యూనివర్సిటీ విమెన్' అనే సంస్థ స్థాపింపబడటానికి కారణాలయినాయి రాష్ట్రాలలో దీనికి 7 శాఖలు ఏర్పడ్డాయి ఈసమాఖ్య విధానము విద్యారంగములోను, వృత్తులలోను స్త్రీల హక్కులను కాపాడి, అన్నివృత్తి వ్యాపారాలలోను పురుషులతో సమానముగా స్త్రీలకు ప్రవేశార్హతను కల్పించి, స్త్రీల అవకాశాలను అభివృద్ధి పరచింది.

ఇటీవల నెలకొల్పబడిన సంస్థలో ఎన్నతగినది 1944 లో స్థాపింపబడిన కస్తూరిబా గాంధీ జాతీయ స్మారకసంఘము ముఖ్యంగా గ్రామీణ స్త్రీ శిశువుల సంక్షేమానికీ, గ్రామ సేవికలకు శిక్షణ నివ్వటానికీ స్మారక నిధినుండి ధనము వెచ్చింపబడుతున్నది దేశ శ్రేయస్సును దృష్టియందుంచుకొని ప్రారంభింపబడిన ఈగ్రామసేవ ఉజ్జ్వల భవిష్యత్సూచకము.

రెండవ ప్రపంచ యుద్ధకాలములో వెలసిన సంస్థ అఖిల భారత ఆహారసమితి (All India Food Council) ఈసమితి పక్షాన అనేక శాఖలు ఏర్పడి అన్నపూర్ణాలయాలు సమృద్ధిగా స్థాపింపబడ్డాయి వీటిలో పుష్టివంతమయిన చౌకభోజనము ప్రజలకు లభించేది పుష్టికరమయిన ఆహార పచనావిధానాన్ని వివరించే గ్రంథాలను గృహిణులకు ఉపయోగకరముగా ఈసంఘము ప్రకటించింది.

ఈ మహిళా సంఘాలన్నీ స్థానికముగా సహకరింపబడి సమర్థింప బడ్డాయి; అనేకమంది స్త్రీలకు రాజకీయ సాంఘిక రంగాలలో సేవ చేయటానికి తగిన ధైర్య స్థైర్య శక్తులాదులను కలిగించాయి. ప్రజాస్వామ్య సిద్ధాంతాల ననుసరించి జాతి పటిష్టతకూ ప్రధానసాంఘిక ధర్మాలకు చేయూత నివ్వగల శక్తిని స్త్రీలకు కలిగించాయి సహస్రాధికముగా ఉత్పన్నమవుతున్న సంక్షేమ కార్యకలాపాలలో స్త్రీలు విశాల దృక్పథముతో కృషి చేసి మార్గదర్శను లవటానికి మూలమయినాయి

ఈ ఉద్యమాల ఫలితముగా నారీ ప్రగతి ఏ తీరున సాగినదీ గమనించి నట్లయితే పురోగమించటానికి తగిన కార్యోత్సాహము స్త్రీలకు కలుగుతుంది. భారత దేశములో 1951 లో ప్రకటింపబడిన రిపోర్టుననుసరించి అప్పటి లెక్కల ప్రకారము చదువుకొన్న స్త్రీల సంఖ్య, పదిసంవత్సరాల లోపలి వారిని జనాభాలో లెక్కింపని యెడల నూటికి 9 3 అని తేలినది వారిని కూడా లెక్కించి నట్లయితే నూటికి 7.9 అని తేలినది.

మన దేశములో ప్రాథమిక విద్యకంటె తొలిదశలో బాలబాలికల విద్యకు అవకాశాలు లేవు కొన్ని రాష్ట్రాలలో ఈ అవకాశాలు బొత్తిగా లేవు ఇటువంటి విద్యాలయాలు నగరాలలో మాత్రమే స్థాపింపబడి కొద్ది మందికి మాత్రమే ఉపయోగపడుతూ ఉండేవి ఇవి కూడా ప్రత్యేక సంస్థలచేత నడుపబడినందువల్ల సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితు లేర్పడ్డాయి

1905 లో ప్రకటింపబడిన లెక్క ననుసరించి 1700 మంది బాలికలలో ఒక్కరు (మూడు సంవత్సరాలనుండి ఆరు సంవత్సరాల లోపు) ఈ రకపు పాఠశాలకు హాజరయినట్లు తెలుస్తున్నది ఇటువంటి బాలికల పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినుల సంఖ్య 531 బాలుర విద్యాలయాలలో కూడా స్త్రీలే అధికసంఖ్యలో నియమింపబడినట్లు తెలుస్తున్నది

1950 లో దాదాపు 50 లక్షల మంది బాలికలు పాఠశాలలలో చేరారు 6 సంవత్సరాల నుండి 11 సంవత్సరాల నడుమ పాఠశాలకు పోతగిన బాలికలలో అయిగురిలో ఒక్కరు చేరినట్లు అంచనా వేయబడ్డది. ప్రాథమిక పాఠశాలలలో చాలా వరకు సహవిద్యావిధానమే అవలంబింప బడేది. 1950 లో 5 12 000 మంది ప్రాథమిక పాఠశాలలలో పనిచేసే ఉపాధ్యాయులలో నూటికి 15 4 మంది స్త్రీలు నియమింప బడ్డారు

మాధ్యమిక, ఉన్నత విద్యాపాఠశాలలలో కొన్ని ప్రభుత్వము వారిచే నడుపబడేవీ, కొన్ని ఇతర సంస్థలచే నడుపబడేవీను. 1950 లెక్కల ప్రకారము 7 లక్షల మంది బాలికలు విద్య నభ్యసించారు అనగా ఆరుగురు బాలురకు ఒక బాలికవంతున విద్య నభ్యసించారు. 1949-50 లో దాదాపు 31,000 మంది స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఈ విద్యాలయాలలో పనిచేశారు.

1950 లో వృత్తి విద్య సాంకేతిక విద్యలలో చేరిన బాలికల సంఖ్య 38,926 అనగా నూటికి 18 మంది బాలికలు ఉపాధ్యాయుల ట్రైనింగు కళాశాలలలోను, పాఠశాలలలోను, తదితర విశ్వవిద్యాలయ తరగతుల లోను నూటికి 18 మంది స్త్రీలు ఉన్నారు. ఉపాధ్యాయినుల సంఖ్య 16,834.

సంగీతము, నాట్యము, చిత్ర లేఖనము, శిల్పము, కవిత్వము లలితకళలని పేర్కొనబడుతున్నాయి స్త్రీలకొరకు ప్రత్యేకముగా స్థాపింపబడిన శ్రీమతి నాతిబాయి దామోదర్ థాకర్ విశ్వవిద్యాలయములో ఈ లలిత కళలకు ప్రాముఖ్యమివ్వబడ్డది ఇది భారత స్త్రీల విద్యాభివృద్ధికొరకు ప్రత్యేక సౌకర్యాలతో నెలకొల్పబడ్డది. దీని లక్ష్యాలు: 1. మాతృభాషల ద్వారా విద్య గరపుట,

2. పాఠశాలలలోని విద్యను క్రమబద్ధము చేయుట, 3. స్త్రీల జీవితావసరాలకు తగిన ప్రత్యేక విద్యా విధానము నేర్పాటు చేయుట. ఈ విశ్వవిద్యాలయము పట్టాప రీక్షలు నడుపబడుతున్నాయి. దీనికనుబంధముగా నాలుగు కళాశాలలు స్థాపింపబడ్డాయి.

కొన్ని విశ్వ విద్యాలయాలలో ఓరియంటల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ పరీక్షలను ప్రభుత్వము గుర్తించింది. మద్రాసు, ఆంధ్ర విశ్వవిద్యాలయాలలో విద్వాన్, భాషాప్రవీణ పరీక్షలలో ఉత్తీర్ణులయినవారు ఉపాధ్యాయ వృత్తికి తగిన అర్హత కలవారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులయిన స్త్రీలు అనేకమంది ఉపాధ్యాయినులుగా పనిచేస్తున్నారు. భారతదేశములోని అన్ని విశ్వవిద్యాలయాలలోనూ స్త్రీలకు ప్రవేశార్హత ఉన్నది. 1950 లో విశ్వవిద్యాలయ తరగతులలో నూటికి 12 మంది స్త్రీలు ఉన్నట్టు తేలింది.

మన దేశములో స్త్రీ విద్య వెనుకబడటానికి అనేక కారణాలు; బాల్య వివాహాలు, మతాచారాలు, పరదాపద్ధతులు, ఆర్థిక సమస్యలు, మూఢనమ్మకాలు ప్రజలను ముందుకు పోగనివ్వలేదు. ఇవేకాకుండా స్త్రీ విద్యకు తగినన్ని పాఠశాలలు లేకను, ఉపాధ్యాయినులు అధిక సంఖ్యలో లేనికారణముచేతను, విద్యార్థినులకు తగిన వసతిగృహాలు లేకపోవటము చేతను, అన్నిటికంటె ప్రధానమైనది విద్య నిర్బంధము కాకపోవటముచేతను స్త్రీ విద్యావ్యాప్తి ఆశించినంతగా జరుగలేదు. ఈ పరిస్థితులు దృష్ట్యా ప్రభుత్వము వారి నూతన విద్యావిధానములో ఈ క్రింది అంశాలు చేర్చబడినవి :

(1) బాలబాలికల కందరికీ ఉచితముగా ప్రాథమికవిద్య లభించునట్లు చేయటము, (2) నిరక్షరాస్యతా నిర్మూలనానికిగాను సాంఘికవిద్య అందరికీ లభ్యమగునట్లుగా వసతులను కల్పించటము, (3) సాంకేతికవిద్య నభివృద్ధిపరచిను ఆ విద్యలలో నిపుణులయినవారిసంఖ్య, అధికము చేయటానికిగాను స్త్రీలకు ప్రత్యేక సౌకర్యాలను కల్పించటము.

మన దేశములో స్త్రీ విద్య వెనుకబడిన కారణాలన్నిటినీ పరిశోధించి, స్త్రీ విద్యా సమస్యలను సమగ్రముగా విచారించిన తరువాత యూనివర్సిటీ కమిషను ఈ క్రింది సలహాలను సూచించింది:

(1) విద్యావిషయకమయిన అవకాశాలనూ, సౌకర్యాలనూ స్త్రీలకు ఏమాత్రమూ తగ్గించకూడదు. సాధ్యమయినంతవరకు అధికము చేయాలి.

(2) సహవిద్యా విధానముగల కళాశాలలలోను, పాఠశాలలలోను స్త్రీలకు కొన్ని సాధారణ సౌకర్యాలను కల్పించాలి.

(3) ఉపాధ్యాయులతో పాటుగా ఉపాధ్యాయినులకు కూడా సమముగా వేతనాలు లభించాలి.

(4) కళాశాలలలోను, విశ్వవిద్యాలయాలలోను అధ్యాపకులుగా స్త్రీ పురుషులుభయులూ నియమింపబడాలి.

(5) పోటీ పరీక్షలకు హాజరయి, నెగ్గిన స్త్రీలకు ప్రభుత్వ శాఖలన్నిటిలో ఉద్యోగాలు చేయటానికి తగిన అవకాశాలు కల్పింపబడాలి.

సాంకేతిక విద్య, వృత్తి విద్యలలో శిక్షణ పొందుతున్న బాలికల సంఖ్య మిగతా వాటికంటె అధికముగా ఉండేది. ప్రాథమిక పాఠశాలలలో పనిచేయటానికిగాను శిక్షణగరపే విద్యాలయాలు 200 ఉన్నాయి. ఉన్నత పాఠశాలలలో బోధించే ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చే కళాశాలలు 16 నడుపబడుతూ ఉన్నాయి. 1947 లెక్కల ప్రకారము సంవత్సరానికి 880 మంది ఈ కళాశాలలలో ఉపాధ్యాయ వృత్తికొరకు శిక్షణ పొందారు. 1949-50 లో శిక్షణ పొందటానికి వచ్చిన వారిలో నూటికి 24.7 మంది స్త్రీలు ఉన్నారు.

భారత రాజ్యాంగ చట్టము ననుసరించి సైనికదళము, విమానదళము, నావికదళములలో తప్ప మిగతా అన్నిరకాల ఉద్యోగాలలో స్త్రీలకు ప్రవేశార్హత కలిగింది. సైనికదళాలలో స్త్రీలు వైద్యురాండ్రుగా పని చేయటానికి అవకాశము ఉన్నది. రాజ్యాంగము ఆమోదింపబడిన నాటినుండీ స్త్రీలకు పురుషుడితోపాటు సమానమయిన పనికి సమానమయిన వేతనము లభించవలెనన్న సూత్రాన్ననుసరించి ప్రభుత్వము సమవేతనాలను ఏర్పాటుచేసింది. వైద్యులకు, న్యాయవాదులకు, రచయితలకు స్త్రీ పురుష భేదము లేకుండా సమాన వేతనాలు లభించుతున్నాయి.

విదేశాంగ వ్యవహారశాఖకు సంబంధించిన ఉద్యోగాల పోటీపరీక్షకు స్త్రీ పురుషులుభయులూ అర్హులే. కర్మాగారాలలోను, తోటలలోను, గనులలోను స్త్రీలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. ఇంజనీరింగు శాఖలోను పురపాలక సంఘాలలోను చిన్న చిన్న ఉద్యోగాలలో కూడా స్త్రీలు నియమింపబడ్డారు.

★ భారతమహిళల పురోగమనం ★

1950 నాటికి మనదేశములో పనిచేస్తున్న స్త్రీలసంఖ్య ఈ విధముగా ఉన్నది. ప్రాథమిక బేసిక్ పాఠశాలలలో ఉపాధ్యాయినులుగా పనిచేసే స్త్రీలసంఖ్య 5,12,000 ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులుగా పనిచేస్తున్న స్త్రీలు 31,000 మంది 1952లో రిజిస్టరయిన వైద్యురాండ్ర సంఖ్య 2602 లైసెన్సుపొందిన వైద్యురాండ్రు 2394 సీనియరు నర్సులు 15722 జూనియరు నర్సులు 1961. హెల్తు విజిటర్లు 635

ఉన్నతవిద్య కోరిన ఉపాధ్యాయినులు ప్రయివేటుగా విద్యార్జన చేయటానికి తగిన అవకాశాలు కల్పింపబడ్డాయి. విద్యాశి వేతనాలకూ, శిక్షణావకాశాలకూ స్త్రీలకు అర్హత ఉన్నది. అన్ని రాష్ట్రాలలోను పాఠశాలల పర్యవేక్షణకు స్త్రీలు (Inspectress of Schools) నియమింప బడుతున్నారు.

పైన వివరింపబడిన ప్రగతి స్త్రీ విద్యకూ, వృత్తులకూ సంబంధించినది దీనిలో కూడా హెచ్చుతగులు ఉండే అవకాశము ఉన్నది కార్మిక పారిశ్రామిక రంగాలలో కూడా ఆ కాలపు పరిస్థితుల ననుసరించి కృషి జరిగింది. అదికూడా తెలిసికొనతగినదే ★

★ కన్నె చెర ★

(27-వ పేజీ తరువాయి)

యిందని, క్షణంలో మారొమ్మగిపోయింది ఇంత పాపిష్టిది బ్రతికేకంటె చస్తే నయం. నీ యింట్లోకి గానీ వస్తే వీధిలోకి గెంటేసి తలుపేసుకో బాబూ! ఆ భండాలపు ముఖం నేను చూడలేను" అన్నాడు

సోమశేఖరం ఏం ఎరగనట్లు ముఖం పెటి, "అంతపని చేస్తుందనుకోలేదు సుమండి! ఏం ఎరగనట్టుంటేది—ఇక మీరు వెళ్లండి ఒక వేళ వస్తే మీదగ్గిరికి పంపిస్తాను" అన్నాడు.

రాఘవయ్య ముఖం తుడుచుకొంటూ, "దాని పేరెత్తకు! ఆ భండాలిని మళ్లీ మా యింట్లో అడుగుపెటనీయను పేమే! మా యిల్లు మైలపడి పోదూ!"—

ఒక్క పెట్టున తలుపు దబదబ బాదుతూ రాజలక్ష్మి "నాన్నా నే నిక్కడే వున్నాను. నన్ను తీసుకపో, నీతో వచ్చేస్తాను" అంటూ భోరున యేడ్చింది.

ముగ్గురూ స్తంభీభూతులైపోయారు.

"ఇంట్లో పెట్టుకునే ఇంత నాటక మాడుతున్నారా నాయనా!" అన్నాడు రాఘవయ్య.

సోమశేఖరం కేకవేస్తూ, "తలుపు తీసి ఆమె నివతలికి తీసుకురండి ఆమె పిచ్చిదీ కాదు మంచిదీ కాదు—"

ఎవరూ అడ్డుచెప్పలేదు తలుపు తీశారు. బయటికొచ్చి తండ్రి కాళ్ల ముందు వాలిపోయింది "నన్ను ముక్కలు కింద నరికినా పాపం లేదు నాన్నా! మిమ్మల్నందర్నీ వీధిలో పెట్టాను. నన్ను తీసుకెళ్లి మీ ఇష్టం వచ్చినట్టు చేయండి" అంటూ ఏడ్చింది.

విశాలాక్షి కన్నీరు కారుస్తూ "లే పిచ్చిపిల్లా! మీ నాన్నగారితో మేం చెప్పి ఒప్పించుతాం. సోమశేఖరాన్నే పెళ్లాడుదువు గాని" అంది.

కూతుర్ని చూసి రాఘవయ్య చలించిపోయాడు. నిండు వాత్సల్యంతో రాజలక్ష్మిని దగ్గరికి తీసుకొని, "నిన్ను రక్షించలేని సంప్రదాయం ఎందుకమ్మా! నీ యిష్టమొచ్చినట్టే చేస్తాను" అన్నాడు కన్నీళ్లు పెట్టుకుంటూ.

అంతే! సోమశేఖరం జన్మలో మళ్లీ ఆమె పిచ్చిదీ కాదూ మంచిదీ కాదు; అనలేదు. ★

ఒక పువ్వు కథ

'కేసరి'

అదొక ప్రశాంత ప్రభాతము.

మసకచీకటి తెరలింకా భూమిని కప్పుకొనున్నాయి. ఆ నిశ్శబ్దవాతావరణాన్ని ఒత్తిపలుకుతుందో అన్నట్లుగా దూరాన సన్నాయి సవ్వడి గుబులుగుబులుగా వినవస్తూంది. పొలాన కాబోలు నీరు తోడుతున్నపుడు బావి గిలక 'కిఱ్ఱు' 'కిఱ్ఱు' సంగీతం, పల్లె పదాల రాగాలతో కలిసి గిలిగింతలు పెడుతూంది. ఇంతలో రెక్కల రెపరెప శబ్దంతో కాకమ్మ రెక్కలు రెపరెపలాడించి, 'కాఁ కాఁ' అని తనవారిని తట్టిలేపింది. పిచ్చుకమ్మల కిచకిచలతో చెట్లకన్నింటికి గొంతులు వచ్చినాయి. అపుడే కోయిలమ్మ గొంతు సరుదుకొని 'కుహూ, కుహూ' మని తేనె వాకలను గాలి అలలలో ఒలికించింది. ఇన్ని గొంతులొక్కమారుగా మేలుకొలుపు లాలపించే సరికి, ప్రకృతిమాత కన్నులు నులిమికొనిలేచి చిరునవ్వు నవ్వింది ఆ చిరునవ్వు చల్లనివెలుగునంతా తూరుపు దిన పులుముకొంది. ఆ కాంతిలో మింటిలోని వెలుగు చుక్కలు వెలవెలబోయి మూతులు ముడుచుకున్నాయి. తూరుపునుండి వెలుగు వెల్లువై వచ్చింది.

దూరాన ఒక గుడి గోపురం కనబడుతూంది. అదేగుడితోట. బారులు తీరిన పూలమొక్కలూ, గుబురులై మొలిచిన పూపొదలతో, ఆతోట తోటంతా నేలతల్లి సృష్టికర్త కిస్తూన్న కుసుమాంజలిలా వుంది. తోట నడుమ కొలనులో నీరు కానరాకుండా కప్పిన తామరాకుల నడుమ విరిసీ విరియని పద్మాలు ఆకసంలోని నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

తోట కంచె కవల గంగరేణు చెట్టొకటి మొలిచింది. దాని కొమ్మలన్నీ గుడితోటలోకి తొంగిచూస్తున్నాయి. ఆ గంగరేణు చిటారు కొమ్మలో ఒక తేరిన మొగ్గ లేతగాలులుయ్యాలలూపుతూంటే ఇంకా నిద్రపోతూంది. ఇంతలో కొమ్మ గూటిలోని కాకమ్మ 'కాఁ'మని కేకేసేసరికి మొగ్గ ఉలిక్కిపడి లేచింది. అపుడపుడే తూరుపు దిక్కున తొంగిచూస్తూన్న దినకరుని తొలికిరణాలు తన్నొక్కమారు చక్కిలిగింతలు పెట్టగా, గంగరేణు మొగ్గకు పులకలు తొడిగాయి. మధురమైన వేవో క్రొంగ్రొత్తభావాలుక్కిరిబిక్కిరి చేసినాయి. అపుడే విరిసిన రెక్కల అపరంజి బంగరు రంగు సూర్యుని తొలి వెలుగులో మరింత కాంతులీనినాయి. ఆ పూగుమ్మలో క్రొత్త ఆశలుబికినయి. వయసుకీవిమెరిసింది. సూర్యుడు తనకోసమే, తన కడగంటి చూపుకోసమే తనవైపు వొస్తున్నాడనుకుంది గంగరేణు గర్వంతో ఒకసారి క్రింది! చూచింది. క్రింది తోటంతా ఒక్కసారి తన్ను చూచి నవ్వినట్లైంది!

గంగరేణు చురచుర చూచింది— "నేలను పొరలుతూన్న యీ సంపెంగ కింత గర్వం పనికిరాదు! ఇంత లేని మల్లె కింత ఉడుకెందుకో? ఈ గులాబికి తన తోబుట్టువులు ముండ్లు జ్ఞాపకంరావేమొ? చాటంత మొగంతో యీ తామర కెందుకింత కావరం?...ఏం చూచుకొని చెప్మా వీటికింత మిడిసిపాటు? ఒక్కదానికైనా నా బంగరు మేని వుందా?" అనుకొని యీసడించుకుంది. గంగరేణు వయసు కావరానికి మల్లెలు పకపక నవ్వినాయి! సంపెంగ కన్నుగీటింది! గులాబి పక్కుమంది!—ఈ పువ్వుల నవ్వులతో మలయానిలుడుక్కిరిబిక్కిరైనాడు!

* * *

ఇంతలో గుడితోటలో కెవరో ముదుసలి ప్రవేశించాడు. చేతిలో తాటాకు బుట్టుంది, తోటమాలి కాబోలు! గోవిందనామాలు రాగాలు తీస్తున్నాడు. కూడా ఒక బుడుతడు చేయి పట్టుకొని తాత

★ ఒకపువ్వుకథ ★

అడుగులకు సరిగా వడిగా నడుస్తున్నాడు.

"తాతోయ్! నీతోనే కూడా పూలు కోస్తానే! దేవుడిపూలు నేను కూడా కోస్తానే? తాతోయ్...?" కీచురాయి గొంతుతో అరుస్తూ తాత వైకొంగు లాగుతూంటే పారాయణేం సాగుతుంది?

"ఒరేయ్, బుజ్జిగా ఏమిట్రా నీ గోల? పూలు కోస్తే కోశావు గాని, మొగ్గలు మాత్రం తుంచి పాడు చేయకు" అని అదిలించాడు.

"ఒహోయ్ నే పూలు గోస్తానే, దేవుడి పూలు కోస్తానే!" అని కేక లేస్తూ, చేతిబుట్ట ఊగులాడించుకుంటూ ముందుకురికాడు బుజ్జిగాడు. తోటమాలి తాతయ్య గోవిందనామాలు పాడుకుంటూ పూలు కోయడం మొదలెట్టాడు.

గులాబి, సంపెగ, మల్లె, మొల్ల మొదలైన పూలన్నీ పోటీలుపడినై, తోటమాలి పూలబుట్టలో చేరడానికి దేవుని కంఠసీమ నలంకరిస్తామని, పాదాలను మూర్కొంటామని తహతహపడ్తున్నా యవి! ఆ దయామయుని సన్నిధి చేరడంకంటే కోర గల దేముంది?

తోటమాలి పూలబుట్ట నిండింది. మనవడి కోసం యిటు అటూ చూచాడు.

"ఒరేయ్ బుజ్జిగా! ఏమున్నావురా బుజ్జీ?"

ఊహుఁ...బదుల్లేదు...తాతయ్య కటపటలాడుతున్న గుండెతో నలువైపుల కలియజూచాడు.

"బుజ్జాయ్! ఓయ్ బుజ్జిగా!"

వెనకనుండి కీచుగొంతు "తాతోయ్" అంటూ వినిపించింది తాత అటుచూచి "హమ్మయ్య" అనుకొని ఆవైపు నడిచాడు. కుఱ్ఱాడు గంగరేణు కొమ్మలక్రింద పైకి చూస్తూ కనిపించాడు వాడి బుట్టలో గరికపూలూ ఇంకా ఏవేవిటో పిచ్చిపూలు నిండున్నాయి. తోటమాలి తనలో తాను నవ్వుకుంటూ "ఇదేమిట్రా, బుజ్జిగా?" అనడిగాడు

"దేవుడి పూలు తాతయ్యా, దేవుడి పూలు! ... తాతోయ్ తాతోయ్! అల్లదిగో ఆపూ గోసియ్యే!" అని తన చిట్టివేలు గంగరేణు చిటారుకొమ్మవైపు చూపించాడు. తాతయ్య పైకి చూచాడు—చిటారు కొమ్మ మీద గాలికెరటాలలో వుయ్యాలలూగుతున్న గంగరేణు పూవు! ఫక్కున నవ్వాడు తోటమాలి ఉలిక్కిపడింది గంగరేణు! "ఆ పూవట్రా దేవుడికి?"

"ఆహఁ, హఁ తాతోయ్! ఆ పూవు కోసియ్యే! అల్లపూవు గావాలే, తాతోయ్!" అంటూ మారాం ప్రారంభించేసరికి తాతకి చికాకేసి "వెదవ, పట్టినపట్టు వదలడు మరీను! పద, పద పూజారయ్య కాచుకోనుంటారు" అని అదమాయించేసరికి మనవడు "ఊఁ" అంటూ బూరోగ అందుకున్నాడు. తాత "హరి పిడుగా" అంటూ పొడుగాటి తన చేతికఱ్ఱతో గంగరేణి పూవు నందుకోబోయాడు. ఒక్క తాపుకే గంగరేణు "అబ్బా" అంటూ కొమ్మ నుండి విడిపోయి, గాలిలో అల్లలాడుతూ నేల వ్రాలింది. మనవడి మొగం వికసించింది. గంతులు వేస్తూ ఆ పూవు నేరి చేతబట్టేడు.

ఇంతలో గుడిగంటలు మ్రోగాయి తోటమాలి తత్తరపాటుతో "అమ్మోయ్! పూజవేళైంది పదోయ్ పద!" అని గుడివైపు కదిలాడు బుజ్జడితో. వాడు తన చేతిలోని గంగరేణును కన్నులింతింత చేసి చూస్తూ, దాంతో ఏదో సరసాలాడుకుంటూ, మురిసిపడుతూ నడుస్తున్నాడు తాతతో. గుడి చెంతకొచ్చింది. "తాతా! ఈ పూవు దేవుడికిస్తానే! ఎంతందంగుందో చూడే!" అని తన మురిపాలు చూడని తాతయ్య చేయి గుంజడం మొదలెట్టాడు. గంగరేణు హృదయంలో ఒక్క ఆశారేఖ తళుక్కుమంది - "దేవుని పాదాలనైనా తాకుదామని." తాతయ్యకు వేళైపోయిందని అనలే దిగులు, యీ గుంటడిపోటొకటి తట్టు, మహాచిరాకేసి "ఏమిట్రా, నీ పోకిళ్లు! పూవిస్తాడట, పూవు! వెదవ పూవు, వాసనా లేదు, గీసినా లేదు! ఏం అందంరా, ఏడ్చినందం? వాసన లేని అందం?" అంటూ మనవడి చేతిలోని గంగరేణు నలా లాగి గిరాటేసేడు కొనవూపిరితో నున్న గంగరేణు గుడిమెట్లపై వాలింది నిరాశతో, తన్ను తానే యేవగించుకుంటూ! కుఱ్ఱడు "ఊఁ ఊఁ" లాడుతూ, తిరిగి తిరిగి చూచుకుంటూ గుడిలోకెళ్లాడు తాతతో. పాపం! గంగరేణు గుడిలోకి జాలి చూపులు చూచింది!

ఇంతలో భక్తజనం ఆలయాన్ని ప్రవేశిస్తున్నారు అందులో ఒక భక్తుడు, లంబోదరుడు "మాధవా! ముకుందా! శ్రీహరి!" అని ఆయాసంతో పలుకుతూ గుడిమెట్లె

గురుదక్షిణ

'శాండిల్య'

పూర్వం సీతానగరం అనే పట్నంలో ధీరశర్మ అనే పిల్లవాడుండేవాడు అతడికి సంగీతం అంటే చాలా ఇష్టం వచ్చీరాని ధోరణిలో పాడుతూండేవాడు. ఎక్కడో డొక్కులాంటి వీణ నొకదానిని సంపాదించాడు ధీరశర్మ. దానిమీద సరళీస్వరాలు సాధన చేస్తూండేవాడు అతనికి శాస్త్రీయమైన సంగీతం నేర్చుకోవాలని అభిలాష ఉండేది కాని చెప్పేవారు ఎవరూ దొరకక వినికిడిగా వచ్చిన సరళీస్వరాలు ఆ వీణమీద వాయిస్తూ ఉండేవాడు.

అసలతని గ్రామం వికృష్టపురం. అయితే ఆ ఊళ్ళో జీవనోపాధికి, విద్యాభ్యాసానికి సౌకర్యంలేక సీతానగరం ప్రవేశించాడు అతడికి తల్లిదండ్రులు లేరు. ఏకాకి. ఒక్కడూ దిక్కులేక, ఎవరూ చేరదీయువారు లేక ఈ నగరం వచ్చాడు కాని, ఈ నగరంలోనూ ఎవరూ ఇతనికి అండదండగా ఆదుకొనేవారు లేకపోయారు అందువల్ల సీతానగరపు ఉత్తరభాగాన, ఒక చిన్న కుటీరం నిర్మించుకొని, అందులో ఉంటూండేవాడు ధీరశర్మ ఇంటికెదురుగా బ్రహ్మాండమైన రావిచెట్టు ఒకటి ఉండేది. ఊరిచివర ఉన్న ఆ రావిచెట్టు వచ్చేపోయే బాటసారుల పాలిట కల్పవృక్షం లాగా ఉండేది. పగటిపూట ఆ చెట్టు క్రింద బాటసారులు విశ్రమించి వెళ్ళిపోతూండేవారు. ధీరశర్మ ఇల్లు చిన్నదైనా, ఈ రావిచెట్టు నీడ అతడికి చాల సహాయకారిగా ఉండేది. ఉదయం నగరంలో యాయవారం చేసుకొని, మధ్యాహ్నానికి ఇల్లు చేరేవాడు ధీరశర్మ. ఇంటికి రాగానే వంటచేసుకొని, భోజనంచేసి కాసేపు విశ్రమించేవాడు. రాత్రిపూట ఈ రావిచెట్టు క్రింద కూర్చొని, వీణ సాధనచేసేవాడు. ఇదీ అతడి దినచర్య. ఇక్కడా అతడికి సరియైన గురువు లభించలేదు. అందువల్ల గురువుగారి నన్వేషించటం మాని, పట్టుదలతో, స్వయంకృషి వల్లనే సంగీతాన్ని సాధించాలన్న నిర్ణయానికి వచ్చాడు విడవకుండా సాధన చేస్తూండేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు రాత్రి అప్పుడే భోజనం ముగించుకొని వచ్చి కూర్చున్న ధీరశర్మకు-వీణ మీద మునుగు తీయగానే పిడుగులు పడుతున్నట్లు "ఆగు! ఆగు!" అన్న కంఠధ్వని వినిపించింది. వెంటనే ధీరశర్మ నలువైపులా పరికించాడు ఎవరూ కనిపించలేదు. చెట్టుపైకి దృష్టి ప్రసరించాడు. అక్కడా ఎవరూ కనిపించలేదు. కాని, మాటలు ఇలా వినిపించాయి:

"ధీరశర్మా! నీ వాద్యము వినలేక చస్తున్నాను. దయచేసి నేటినుండి ఇక్కడ వాయించటం మానెయ్యి బాబూ! నీకు చాలా పుణ్యముంటుంది లేదా నన్నే పొమ్మంటే నా దారిన నేను పోతాను," అని.

ధీరశర్మకు ముచ్చెమటలు పోసాయి మనిషి కనపడకుండా మాటలు వినిపిస్తున్నాయంటే— ఇది ఏ దయ్యమో, భూతమో అని చాలా భయపడ్డాడు కాని ప్రతి నిత్యము తాను ఇక్కడ ఉండవలసినవాడు కనుక భయపడి లాభం లేదని మొండిధైర్యం తెచ్చుకొని, "ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాడు.

ఆ గొంతు ఇలా చెప్పింది:

"ధీరశర్మా! నేను ఒక బ్రహ్మరాక్షసిని! ఎన్నిరోజులుగానో ఈ చెట్టుమీద కాలం గడుపుతున్నాను. ఇన్నిరోజులుగా నాకు ఎలాంటి ఇబ్బందిలేకుండా జరిగిపోతోంది. కాని, కొన్నిరోజులుగా నీవిచ్చటికి రావడం, ఈ చెట్టుకిందే సంగీత సాధన మొదలెట్టడం నాకు


కుతూ, తుదిశ్వాసాలు గడుపుతూన్న గంగరేఖపై తన పాదాన్నుంచాడు "భగవాన్" అంటూ కన్నుమూసింది గంగరేఖ, భగవంతుని కాకున్నా, భక్తుని పాదాన్నైనా తాకేనుగదా అన్న సంతృప్తితో! ★

చాలా కంటకంగా తయారయింది. నీవు మీటే ప్రతి మీటూ పీక కోస్తున్నంత బాధగా ఉంది. కర్ణకఠోరమైన నీ వాయిద్యం వినలేకుండా ఉన్నాను. కనుక దయచేసి మానెయ్ బాబు! నీ కేదైనా ఉపకారం చేస్తాను." అని ఎంతో ఆప్యాయంగా చెప్పింది.

ధీరశర్మ అంతా విన్నాడు. ఏమయినా సరే నేను మానేది లేదన్నాడు. బ్రహ్మరాక్షసి, ఎంత చెప్పినా ధీరశర్మ వినడన్న నిశ్చయానికి వచ్చింది. తన మకాం రావిచెట్టు మీద నుంచి మార్చేసుకుంది. ధీరశర్మ ధైర్యంగా బ్రహ్మరాక్షసి నెదిరించి జయించినందుకు సంతోషిస్తూ కాలం ఆనందంగా వెళ్ళబుచ్చుతున్నాడు. రాత్రిపూట రావిచెట్టుక్రింద సంగీతంలో అవిరళ కృషి చేస్తున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

* * *

ఇలా ఉండగా ధీరశర్మ రాను రాను, రోజులు కష్టంగా గడుస్తున్నట్లు బాధ కలిగింది. యాయవారంవల్ల ఏమీ లాభం కనిపించలేదు. తన సంగీత విద్య ఎందుకూ కొరగాకుండా తయారయింది. బ్రహ్మరాక్షసిని పారద్రోలానన్న ఆనందం ఒక్కటి తప్ప—అతడికి నిరుత్సాహం ఎక్కువ కాసాగింది. అంత మహానగరంలోనూ పిడికెడు బియ్యం పెట్టేవారు ఎవరూ కనిపించడంలేదు. రాను రాను, "నికృష్టపురానికి నగరం చెల్లెలయిందేమో," అని చింతింప సాగాడు ధీరశర్మ.



ఒకరోజున ఆ నగరపు రాకుమార్తెకు బ్రహ్మరాక్షసి పట్టిందనీ, ఎందరెందరో వచ్చి నయం చేయలేక వెళ్ళిపోతున్నారనీ, నయం చేసినవారిని రాజుగారు గొప్పగా సన్మానిస్తారనీ, ధీరశర్మ ఒక పుకారు విన్నాడు.

ఈ మాట వినగానే బ్రహ్మరాక్షసి జ్ఞాపకం వచ్చింది ధీరశర్మకు. తాను వెడలగొట్టిన బ్రహ్మరాక్షసే అయి ఉంటుందని అనుకున్నాడు. తప్పక ఆ బ్రహ్మరాక్షసిని జయించగలనన్న ధైర్యం వచ్చిందతనికి. అప్పుడు అతని మనస్సు ఆనందంతో ఉరకలు వేసింది. వెంటనే ఇంటికి వచ్చి, భోజనం చేసి, వీణ చంకన బెట్టి కోటకు బయలుదేరాడు.

కోట సింహద్వారం దగ్గర కాపలావాళ్లు—ధీరశర్మను, అతని వాలకాన్నీ చూసి--లోనికి పోనీయకుండా అడ్డగించారు నేను రాకుమారి గ్రహబాధ నయంచేస్తాను. నన్ను లోనికి పోనివ్వండి!" అని ఎంత బతిమాలినా ధీరశర్మను వాళ్లు లోనికి పోనియ్యలేదు. కాగా అతన్ని అవహేళన చేశారు. "నీ మొహం! నువ్వేం చేస్తావు పొమ్మని."

ఇంతలో అదృష్టవశాత్తూ సింహద్వారం సమీపానికి వచ్చిన మంత్రిగారు, కాపలావాళ్ళకూ, కుర్రాడికీ జరుగుతున్న వివాదం విన్నారు. ఆయన వాళ్ళకు ఆ కుర్రాణ్ణి వదిలిపెట్టమని ఆజ్ఞ ఇచ్చారు. ధీరశర్మ లోపల ప్రవేశించాడు. మంత్రిగారు చేతిలో వీణ, చురుకైన కండ్లు, ఏదో హడావుడిగావున్న ధీరశర్మను ఎగాదిగా చూచి, "ఎందుకొచ్చావు?" అని అడిగారు. "బ్రహ్మరాక్షసిని వదిలించటానికి వచ్చా" నని ధైర్యంగా చెప్పాడు ధీరశర్మ

మంత్రిగారు ధీరశర్మవైపు సాలోచనగా చూసి, "అయితే నువ్వు నిజంగా నయంచేయగలవా?" అని అడిగారు. ధీరశర్మ వెంటనే "తప్పక చేస్తాను" అని వెనుకాడకుండా జవాబుచెప్పాడు

"అలా చేయలేకపోతే, నీతల తీయిస్తాను. ఒప్పుకుంటావా?" అని కొంచెం బెదిరింపుగా అన్నారు మంత్రిగారు.

ధీరశర్మ కించిత్తయినా ధైర్యం కోల్పోక, తాను అనుదినం అనుభవించే కష్టాలన్నా తప్పుతాయనీ, నయం చేయలేకపోతే వారు విధించే మరణదండనవల్ల తనకు ఉపకారమే జరుగుతుందని, ఆలోచించి, "అలానే చేయండి," అని సమాధానం ఇచ్చాడు.

మంత్రిగారు అతని ధైర్యసాహసాలకు మెచ్చుకుని, వెంటనే అంతఃపురంలో ప్రవేశపెట్టారు. ధీరశర్మ లోపల ప్రవేశించి, రాకుమారిని చూశాడు. అక్కడ ఉన్నవాళ్ళందర్నీ బయటకు వెళ్లిపొమ్మన్నాడు. నేను తలుపు తీసేవరకు మీరెవరూ లోపలికి తొంగిచూడనైనా కూడదన్నాడు. గొప్ప మంత్రగాడిలా ఆర్భాటం చేశాడు. అలాగేనని అందరూ బయటకు

వెళ్ళిపోయారు. ధీరశర్మ తలుపులన్నీ బిగించాడు. రాకుమారి దగ్గరకి వెళ్ళాడు. అదే బ్రహ్మరాక్షసి!!! ఆమె కేకలను విని గుర్తుపట్టాడు వెంటనే వీణ బయటకు తీశాడు.

"ఓరి దుర్మార్గుడా! నువ్వు ఇక్కడగూడా దాపురించావా? ఆ రావిచెట్టుమీద సుఖంగా ఉన్న నన్ను లేవకొట్టావు. ఇక్కడనైనా సుఖపడదామని వచ్చాను. ఇక్కడికీ తయారయ్యావా! నీచుడా!" అని ఆ భవనం దద్దరిల్లేలా తిట్టింది బ్రహ్మరాక్షసి.

"వీణ తీయమన్నావా? లేక ఇక్కడినుంచి వెళ్లిపోతావా? చెప్పు వెంటనే," అని ధీరశర్మ పళ్ళు పటపట కొరికాడు. పట్టరాని ఆవేశం ప్రదర్శించాడు. దెబ్బతో బ్రహ్మరాక్షసి లొంగిపోయింది.

"వద్దు! వద్దు! నేనే వెళ్ళిపోతాను; నీ కర్ణకఠోరమైన వాయిద్యం వినిపించకు," అని బ్రహ్మరాక్షసి రాకుమారిని వదిలి వెళ్ళిపోయింది.

బ్రహ్మరాక్షసి వదిలి వెళ్ళిపోగానే రాకుమారి నీరసంగా పడిపోయింది. వెంటనే ధీరశర్మ తలుపులు తెరిచి, ఉపచారాలు చెయ్యడానికి పరిచారికలను పిలిపించాడు. వాళ్ళు వచ్చి రాకుమారికి ఉపచారాలు చేస్తున్నారు. కొంతసేపటికి రాకుమారి తేరుకుంది. మామూలుగా మాట్లాడింది. అందరూ ఆశ్చర్యపోయారు కుర్రవాడి మంత్రశక్తికి! వెంటనే రాజుగారు, మంత్రిగారు ధీరశర్మను తెగపొగిడి, కోటివరహాలతో గొప్పగా గౌరవించి పంపించారు.

నాటినుండి ధీరశర్మ కోటీశ్వరుడైపోయాడు. చక్కని భవనం కొనుక్కుని అందులో ఉంటున్నాడు. తనకు అన్ని పనులూ చేయడానికి నౌకర్లను పెట్టుకొని హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు. కాని సంగీత విద్యను సంపూర్ణంగా నేర్చుకోవాలన్న ఆశమాత్రం పోలేదతనికి గురువుకోసం మళ్ళీ యత్నించాడు. ఎవరూ తటస్థపడలేదు అదే అతడికి పెద్ద విచారంగా తయారయింది. ధనం వచ్చిద్దామన్నా దొరక్కపోతే ఏం చేస్తాడు, పాపం! నిరాశ చెందకుండా సరళీ స్వరాలనే సాగదీస్తున్నాడు.

అయితే అతడు వాయించే వాయిద్యాన్ని ఇంట్లోఉండే నౌకర్లు సయితం వినలేక చచ్చిపోతున్నారు. అసలు 'సరిగమ'లు తప్ప, రాని ధీరశర్మ వాయిద్యం— మీటు మీటినప్పుడల్లా ఏదో వికృతమైన ధ్వని బయల్దేరేది! అందువల్ల బాధపడేవాళ్లు నౌకర్లు! కాని, ఏం చేస్తారు? అతడు తమ యజమాని!- ఎదిరించడానికి శక్తిలేక, వినడానికి ఆసక్తి లేక నానాయాతనా పడేవాళ్ళు. అతడు మాత్రం తన ధీరత్వం వదలలేదు. నిత్యనూతనమైన సంగీతాన్ని సాధించాలన్న అతడి పట్టుదల, ధనం సంపాదించాక మరీ ఎక్కువ కాజొచ్చింది. వినికిడిగా నేర్చుకున్న కొన్ని స్వర వరుసలను వదలకుండా సాధన చేస్తున్నాడు. పట్టుదల హెచ్చి, సాధన చేస్తున్నకొలదీ, మెరుగులు దేరవలసిన అతడి వాయిద్యం వికృతరూపం దాల్చుతోంది'!!

అతడు తన గదిలో కూర్చుని, వీణ ముసుగు తీశాడంటే, ఆ భవనమంతా ఏదో పెద్ద భూకంపం వచ్చి పునాదులతోసహా కదిలిపోతున్నట్లు ప్రపంచమంతా గిర్రున తిరుగు

బాలగేయం:

మా వూరి ఏరు

మధురాంతకం రాజారాం

పేరొకటి వున్నదని నాకెరుక లేదు
నీరు కూడా నిరంతర ముండబోదు
పేరు, నీరును లేని ఏరైన నేమి!
మా యూరి కీయేరె గంగాభవాని!
చూడచక్కని ఏరు మావూరి ఏరు
ఏడాది కొకసారి ముచ్చటగ పారు!

తెల్లవారక ముందె చలిచెలమ చేరి
చల్లన్ని నీటితో తబిలె నాడించి
తలకెత్తుకొనివచ్చు అమ్మలక్కలను
తిలకించలేదేమొ కవిశిఖామణులు
తిలకించియుండిన ఈపాటి కిపుడొ
తులలేని కావ్యమొక్కటి పుట్టియుండు.

ఏటి మధ్యను గలవు నల్లనల్లని గుండ్లు
ఏటి కిరువైపులా మొగలి పొదరిండ్లు
పొదరిండ్లలో దాగి మొగలి మొగ్గల్లు
మధుర సుగంధమ్ము దిక్కులకు చల్లు
పూల నాశించి మే మటకు చనరాదు
మొగలి చెట్లల్లోన మిన్నాగులుండు!

వాన బాగుగ కురిసి చెరువుల్లు నిండి
వరద వచ్చిన వేళ చూడాలి మీరు
ఉప్పొంగి మా ఏరు ప్రవహించుతుంది
ఉరవడితో మా ఏరు ప్రవహించుతుంది
హోరు హోరున రొదలు విను వీధి ముట్ట
హొయలుగా మా ఏరు ప్రవహించుతుంది.

ఎంత ఎర్రటి నీరు మాఏటి నీరు!
ఎంతగా చేస్తుంది అది కారు బారు!
చూడవలెనే గాని చెప్పంగ లేము
మూణ్ణాళ్ల తిరణాలు మాఏటి వరద!
ఆపైన, ఆ పొంగు ఏమౌనొ గాని
ఆశ్చర్యముగ ఏరు యింకిపోతుంది!

ఇంకిపోయిన నేమి, మా ఏటిలోన
ఇసుక తిన్నెలు కనుల పండువై యుండు
దినకరుండస్తాద్రి గ్రుంకేటి వేళ
తిన్నెల్లపై మేము కొలువు తీరెదము!
ఎవ్వరేమనుకొన్న మాకేమి కొఱత?
మా ఏరె మాకొక్క ఉద్యానవనము!

★ గురుదక్షిణ ★

తున్నట్లు అల్లకల్లోలంతో అవస్థపడి పోయేవాళ్లు నౌకర్లు. అదేమి వాయిద్యమో బోధపడేదిగాదు, వాళ్లకు! రానురాను నౌకర్లు ధీరశర్మను భూతంలా చూడసాగారు. ఇది గమనించిన ధీరశర్మ ఇంట్లో వాయించటం మానుకున్నాడు. తనకు అన్నివేళలా సేవ చేస్తున్న నౌకర్లకు కష్టం కలిగించడం భావ్యం కాదని తోచింది ధీరశర్మకు. కాని సాధనమాత్రం మానదల్చలేదు! అందువల్ల రాత్రివేళల మాత్రం 'రావిచెట్టు' క్రింద గడపడానికే నిశ్చయించుకున్నాడు ధీరశర్మ.

* * *

ఒకరోజు రాత్రి సుష్టుగా భోజనంచేసి, 'వీణ' చంకన బెట్టుకుని తిన్నగా రావిచెట్టు క్రిందకు వచ్చి కూర్చున్నాడు సాధన చేయడానికి ధీరశర్మ వీణ ముసుగు తీస్తున్నాడు. ఇంతలో పిడుగుపాటులా ఒక పెద్దకంఠం గర్జించింది ఇలా:

"ఒరే మూఢుడా!! మళ్లీ తయారయ్యావా? నీకంత ధనం 'సంపాదించి పెట్టినా తృప్తికలగలేదా? విశ్వాస ఘాతకుడా! ఛో! ముంది క్కణ్ణించి," అని నిప్పులు కురిపించింది. ధీరశర్మ ధైర్యం కోల్పోయాడు. కోపానికి బదులు దుఃఖం వచ్చింది 'తానిక వీణ వాయించుకొని ఆనందించే అదృష్టం లేదా?' పెల్లుబికి వస్తున్న దుఃఖం ఆపుకొని రెండుచేతులూ పైకెత్తి బ్రహ్మరాక్షసిని గద్గద కంఠంతో ఇలా ప్రార్థించాడు:

"నాకీ ప్రపంచంలో ధనంకంటె, ఈ వాద్యమే ఎక్కువైనది. నాకున్న ధనం పదార్థాలుగు తరాలు అనుభ

మన దేశం

భారతదేశపు మొత్తం వ్యాపారపు విలువ 1954 లో రూ. 1,179 కోట్లనుండి 1955 లో రూ. 1,248 కోట్లకు పెరిగింది.

* * *

గృహ నిర్వహణశాస్త్రానికి ఏర్పడిన శిక్షణాలయాలలో 18 రాష్ట్రాలనుండి 400 మంది గ్రామసేవికలు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు.

* * *

పోస్టాఫీసులలో సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్లు 1951 లో 40,90,020 నుండి 1955 లో 53,84,147 వరకూ పెరిగాయి.

వించవచ్చు; కాని, ఈ విద్యను సాధించందే నాకు తృప్తి లేదు. నా ఇంట్లోనూ వాయించటం కుదరక, ఇక్కడా వీలులేక మానుకోలేను. గనుక నన్ను అనుగ్రహించి, వాయించుకోటానికి అనుమతించు మహాశయా!" అని అశ్రుపూరిత నయనాలతో, దీనాతిదీనంగా అర్థించాడు ధీరశర్మ.

బ్రహ్మరాక్షసి మనసు మంచులా కరిగిపోయింది. మృదుమధురమైన స్వరంతో ఇలా అంది.

నాయనా! ధీరశర్మా!! నీ విద్యాదీక్షకు ఎంతో ఆనందిస్తున్నాను. నీలాంటి శిష్యుని కోసం దేశాలు గాలించాను. కాని నాకు ఎక్కడా దొరకలేదు. నిరుత్సాహంతో ఈ రావిచెట్టు మీద రాత్రింబగళ్లు గడుపుతున్నాను. ఇప్పటికి నీవు తటస్థించావు; నేర్చుకో. నీకు నా విద్యంతా చెప్పి, కృతార్థుడనవుతాను. ఇన్నినాళ్ళుగా నిన్ను ఎన్ని విధాలుగా పరీక్షించాలో అన్నివిధాలా పరీక్షించాను. నా పరీక్షలో నీవు నెగ్గావు. నీకే గాంధర్వ విద్య కరతలామలకమవుతుంది. శ్రద్ధతో అభ్యసించు," అని ఆనాటినించీ ధీరశర్మకు సంగీతం నేర్పడం మొదలు పెట్టింది బ్రహ్మరాక్షసి.

ధీరశర్మ అత్యుత్సాహంతో అనునిత్యమూ అభ్యసిస్తున్నాడు సంగీతాన్ని.


* * *

ఒకనాటి వెన్నెలరాత్రి ధీరశర్మ రావిచెట్టు క్రింద రాగాలాపన చేశాడు. చక్కని ఆ వెన్నెల రాత్రిలో ప్రశాంత గంభీరమైన ఆ ప్రకృతి వసంతకాలాన్ని జ్ఞాపకం చేసింది! వెయ్యి కోకిలలు గానం చేసినట్లు అనిపించింది. అతడి ప్రతి మాటూ ఎంతో లలితంగా వినిపించింది. ధీరశర్మ మైమరచి వాయిస్తున్నాడు. బ్రహ్మరాక్షసి—మకరకుండలములు ధరించి బ్రహ్మతేజస్సులో ధీరశర్మ ముందు నిలచింది. ఇది చూడనే లేదు ధీరశర్మ గానానందంలో మునిగిపోయి. నెమ్మదిగా బ్రహ్మరాక్షసే పిలిచింది. అమృతము నోలికి పోస్తున్నట్లు మాట్లాడింది:

"నాయనా! నేనిక వెళుతున్నాను. నాకు విముక్తి కలిగింది. సాధించిన విద్యను సక్రమంగా వినియోగించుకో!" అని ఆప్యాయంగా చెప్పింది.

ధీరశర్మ దిగ్గున లేచాడు. సాష్టాంగ పడ్డాడు "గురువర్యా! నాకు మీరు చేసిన మహోపకారానికి నా గురుదక్షిణ స్వీకరించరూ!" అని అతినమ్రతతో అన్నాడు.

"వద్దు! నాయనా వద్దు!! నాకీ రూపం నీవల్లనే వచ్చింది మహోపకారం చేసింది. నీవు గాని నేను కాదు. అయినా అంతగా కోరుతున్నావు గనుక ఒక్కమాట చెబుతాను. నేను నావిద్యను ఎవరికీ చెప్పక, గర్విష్ఠినై చరించి, ఊర్ధ్వలోకంలోని పెద్దల నదిరించి, శాపవశాన ఇలా బ్రహ్మరాక్షసినై ఎంతో మనోవేదన ననుభవించాను. ఈనాటికి, నీకు చెప్పి-స్వస్వరూపం పొందగలిగాను. కనుక నీ విద్యను నిరాపేక్షతో అందరికీ చెప్పు—అదే నాకు గురుదక్షిణ," అని అంతర్థానమైనాడు ఆ యక్షుడు. ★



12

జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకల కది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సెల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగుకనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నౌక దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి కుష్టుగా భోజనం పెడతారు. భోంచేసి అందరూ హాయిగా నిద్రపోతారు. తిరిగి తమ కన్నపాశాలు రాలేదని అంతా మథన పడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. ప్రొఫెసర్ అరోనా నీమో గదిలో వింతలు విశేషాలు చూచి ఎంతో ఆశ్చర్యపోతాడు.

అనువాదం: "వినాయక"

అటుపిమ్మట కెప్టెన్ నీమో నాతో ఇలాగన్నాడు: "ప్రొఫెసర్! మీరీ చిన్న చిన్న యంత్రాలన్నీ జాగ్రత్తగా పరిశీలించండి. వీటివల్ల నాకు జలాంతర్గామి నడక, వేగము, సముద్రంలో మేమున్న ప్రదేశము మొదలైన విషయాలన్నీ స్పష్టంగా తెలుస్తూంటాయి. నేనీ గదిలో కూర్చుంటే చాలు! అన్ని విషయాలు అద్దంలో కనిపించినట్టు తెలిసిపోతాయి. వీటిలో కొన్నికొన్ని యంత్రాల ఉపయోగం మీకిదివరకే తెలుసుననుకుంటాను"

"అవునవును. నాకు సామాన్యంగా ఓడలలో వాడే యంత్రాల సంగతులన్నీ తెలుసును. కాని ఇక్కడ జలాంతర్గామికి అత్యావశ్యకమైన కొన్ని ప్రత్యేకయంత్రాలేవో ఉన్నాయని అనుకుంటాను. ఆ కదిలే ముల్లు భారమితియం

త్రంలా ఉందే!"

"అవును. దానివల్ల నీటిఒత్తిడి మొదలైనవిషయాలన్నీ తెలుసుకో వచ్చును."

"ఈ పక్కనున్న యంత్రాలు?"

"వీటివల్ల ఆయా సాగరగర్భాలలోఉన్న ఉష్ణపరిమాణము మొదలైనవిశేషాలు గ్రహించవచ్చును."

"ఈపక్కన ఇంకా కొన్ని చిత్రవిచిత్రమయిన యంత్రాలు కనిపిస్తున్నాయి. వీటి ఉపయోగమేమో నా కవగాహన కావడంలేదు."

"దానికొక చిన్న కారణం ఉంది. ఈ జలాంతర్గాల అంతా ఒక అత్యద్భుత శక్తితో నడుస్తున్నది. అది మా జలాంతర్గామి అంతా అత్యంత వేగంతో నడిపించగల మహాశక్తి. అది ఎలాగ కావలిస్తే అలాగ పనిచేస్తుంది. మా పనులన్నీ దానిమూలంగానే జరుగుతూంటాయి. అదే మా విద్యుచ్ఛక్తి."

"అయితే సామాన్య విద్యుచ్ఛక్తికి ఓడ ఇంత వేగంగా నడిపించగలశక్తి ఉన్నట్లు కనబడదే."

దానిపై కెప్టెన్ నీమో కొంచెం నెమ్మదిగా ఇలాగన్నాడు: "ప్రొఫెసర్! మీ రన్నమాట నిజమే. మా విద్యుచ్ఛక్తి మీరంతా వాడుకునే విద్యుచ్ఛక్తి వంటిదికాదు. దాన్ని గురించి ఇంతకంటె ఎక్కువగా ప్రసంగించడానికి వీలులేదు."

"మీ రది అంత రహస్యంగా ఉంచదలుచుకుంటె నా కాగొడవ అక్కర్లేదు. అయితే ఒక చిన్న ప్రశ్న అడగాలని అనుకుంటున్నాను. అది కూడా రహస్యమయితే మీ రా విషయం చెప్పనక్కర లేదు. మీరీ విద్యుచ్ఛక్తి తయారు చెయ్యడానికుపయోగించే వస్తువుల సరఫరా తగ్గిపోతూండాలి. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కావలిసిన తుత్తునాగం అంతా ఎక్కడ సంపాయిస్తున్నారు? ప్రస్తుతం భూమికీ, మీకు ఏవిధమైన సంబంధము లేదు గదా!" దానికి కెప్టెన్ నీమో ఇలాగ సమాధానం ఇచ్చాడు:

"ప్రొఫెసర్! ఈ ప్రశ్నకు మీ కేమీ అనుమానించ నక్కరలేదు. దీనికి సమాధానం చెప్పడానికి నాకేమీ అభ్యంతరం లేదు. అయితే సముద్రం అట్టడుగున భూమిలో ఎన్నెన్నో గనులున్నాయి. వాటిల్లో బంగారము, వెండి, రాగి మొదలైన లోహాలన్నీ దొరుకుతాయి. అయితే నే నా గనుల జోలికి పోవడం లేదు. సముద్రంలోనించే నాకు కావలసిన విద్యుచ్ఛక్తి అంతా సేకరించుకొంటున్నాను."

"నిజంగా?"

"నిజమే! సంగ్రహంగా నే నీ విద్యుచ్ఛక్తి తయారు చేసుకొనే మార్గం ఇది: మీకు సముద్ర జలంలో ఉండే రసాయన ద్రవ్యాల సంగతి తెలుసును గదా! అందులో సోడియం క్లోరైడ్ ఎక్కువగా ఉంటుంది. దానితో పాదరసం మిళాయిస్తే లభించినపదార్థం నాకు వోల్టాఘటంలో తుత్తునాగంలా ఉపయోగపడుతుంది. ఆ విధంగా తయారైన విద్యుచ్ఛక్తి ద్వారా నా జలాంతర్గామిలో సమస్త వ్యవహారాలు సాగిపోతున్నాయి. తెలిసిందా?"

"అయితే సముద్రగర్భంలో మీకు గాలి ఎలాగ సరఫరా అవుతూంది?"

"నాకు కావలసిన గాలి అంతా కృత్రిమంగా తయారుచేసుకోగలను. కాని దానికోసం నేనంత శ్రమపడడంలేదు. సముద్రంపైకి వెళ్ళినప్పుడు నాకు కావలిసినంత గాలి నిలవ చేసుకొంటున్నాను. కేవలం విద్యుచ్ఛక్తిమూలంగా నాకు కావలిసినంత గాలి సప్లయి కాక పోవచ్చును. అయితే పెద్దపెద్ద పంపులద్వారా జలాంతర్గామిలో నీరు నిలవచెయ్యడానికీ, అది మళ్ళీ పైకి తోడివెయ్యడానికీ అది బాగా సహాయపడుతున్నది. అవైన నేనన్నాను:

"కెప్టెన్! మీరు సాధించిన మహాత్కార్యాలుచూస్తూంటే నాకెంతో ఆశ్చర్యం కలుగుతున్నది. ముందు కాలాలలోని మానవులు విద్యుచ్ఛక్తి మహోపయోగాలన్నీ గుర్తిస్తారు. అందులో అనుమాన మేమీ లేదు. కాని అవన్నీ మీరిప్పుడే గుర్తించివేశారు."

నామాటలకు కెప్టెన్ నీమో ఇలాగన్నాడు:

"ముందు ముందు తరాలవాళ్ళు విద్యుచ్ఛక్తి ఉపయోగాలన్నీ ఇంత లోతుగా గుర్తించగలరో లేదో నే నిప్పుడు చెప్పలేను. ప్రస్తుతం నేను కనిపెట్టిన అపూర్వాద్భుతాలన్నీ స్వయంగా మీ కళ్ళతో చూశారుగదా! మాకీ విద్యుచ్ఛక్తి వల్ల సూర్యకాంతితో సమానమైన వెలుగు లభిస్తున్నది!

అదిగో అలాగచూడండి! అక్కడ మీకు కనిపించే గడియారం విద్యుచ్ఛక్తిబలంమూలంగానే తిరుగుతూంది. అది ఎప్పుడు ఒకలిప్త కూడా తప్పు తిరగదు. ఇటలీ గడియారాల్లోలాగ అందులో 24 గంటలుండే టట్లేర్పాటు

చేశాను. సముద్రగర్భంలో ఉన్నప్పుడు నాకు పగలు, రాత్రి ఒక్కమోస్తరుగానే కనిపిస్తాయి. అదిగో, చూశారా! ఇప్పుడునరిగా ఉదయం పదిగంట లయిందన్నమాట."

"అవునవును!"

"దానిపక్కగా ఇంకొకయంత్రం కనిపిస్తూంది. అది ఎప్పటికప్పుడు ఓడ వేగాన్ని తెలియజేస్తూంటుంది. అయితే ఇంతమాత్రంచేత మీరు చూడవలిసినవన్నీ ముగిసిపోలేదు. ఇక ఓడ వెనకభాగానికి వెడదాం రండి!"

ఆ తరవాత నేను కెప్టెన్‌తో కలిసి కొన్నిగదులు దాటి మెల్లిగా ఒక నిచ్చెన ఎక్కి టాపు చివరిభాగానికి చేరుకొన్నాను. అక్కడ నాకొక చిన్న నావ కనిపించింది:

"ఇక్కడ ఒక నావకూడా కనిపిస్తూందే!" అన్నాను ఎంతో ఆశ్చర్యంగా.

"అవును అది చాలా మంచి బోటు. ముంచినా మునిగేబోటు కాదది. చాలా తేలిక. చేపలు పట్టడానికీ, కులాసాగా షికారు వెళ్ళడానికీ బాగా ఉపయోగపడుతుంది."

"అయితే మీరెప్పుడైనా కులాసాగా షికారు వెళ్ళాలనుకొంటే సముద్రంపై భాగానికి వెడతారన్నమాట."

"అబ్బే! అంత శ్రమపడవలిసిన అవసరమేమీ లేదు. ఈ బోటు మా జలాంతర్గామిపైన అతుక్కుని ఉంటుంది. ఆ భాగంలోనికి నీరు ప్రవేశించకుండా గట్టి ఏర్పాట్లు చేశాం. ఇంకా ఈ నిచ్చెన మీద పైకి వెడితే మనిషి దూరడానికి వీలైన దారి కనిపిస్తుంది. అది క్రమంగా నావలోకి వెళ్ళిపోతుంది. బోటులోకి చేరుకోగానే ఆదారి గట్టిగా మూసివేసే ఏర్పాట్లున్నాయి. అల్లాగే ఓడలో దారికూడా మూసివేస్తారు. బోటులో ప్రవేశించగానే మీట నొక్కితే వెంటనే అది సముద్రం పైకి వెళ్ళిపోతుంది. తరవాత నెమ్మదిగా నావ పైభాగంలో ఉండే కప్పు ముడిచివేస్తాము. తరవాత నావకి తెరచాప. తెడ్లు బిగిస్తాము. హాయిగా షికారు సాగిస్తాము."

"అయితే మళ్ళీ తిరిగి రావడమెలాగ?"

"నావ తిరిగి రాదు. ఓడే నావ దగ్గిరికి వస్తుంది."

"నావలోనించి మీ రేమైనా ఫర్మానా జారీ చేస్తారా?"

"అవును! నావకీ, ఓడకీ మధ్యన బిగించిన తీగద్వారా నా ఫర్మానా జారీ చేస్తాను."

"ఇదంతా చాలా తేలికగా జరిగిపోయేటట్టుందే!"

అటు తరువాత నేను కిందికి దిగి ఆపక్కగా ఉన్న ఇంకో గదిలోకి వెళ్లాను. నెడ్‌లాండు, కొన్సిలు ఆ గదిలో కూర్చుని భోజనం చేస్తున్నారు. అది 12 అడుగుల పొడవున్నగది. దానిపక్కనే ఒక వంటగది, ఇంకొక సామానుగది, ఉన్నాయి. విద్యుచ్ఛక్తి మూలంగానే వంటగది వ్యవహారం అంతా సాగిపోతూంది. శుభ్రమైన మంచి నీరుకూడా ఆ విధంగానే సప్లయి అవుతోంది. దానిపక్కనే ఇంకొక స్నానాలగది ఏర్పాటు చేశారు. దానిలో వేన్నీళ్లకీ, చన్నీళ్లకీ వేరే వేరే కొళాయిగొట్టాలున్నాయి.

వంటగదికి పక్కగా జలాంతర్గామి ఉద్యోగులందరు సుఖంగా విశ్రాంతి తీసుకోడానికీ, పడుకోడానికీ వీలైనది వేరే ఇంకోగదికూడా ఉంది. అయితే ఆ గదితలుపు వేసిఉండడంవల్ల దాని సంగతి సందర్భాలేవీ పూర్తిగా బోధపరుచుకోడానికి వీలు కలగలేదు. అదే కనక తెరిచిఉంటే ఇంచుమించుగా ఆ జలాంతర్గామిలో పనిచేసేవారి వైనం అంతా చాలా వరకు బోధపడి ఉండును.

దానికి కొంతదూరంలో జలాంతర్గామి ఇంజనులున్న గది కనిపించింది. కెప్టెన్ నీమో చాలా గొప్ప ఇంజనీరు. ఆ గదిలో అతడు జలాంతర్గామికి సంబంధించిన యంత్రాలన్నీ అతి జాగ్రత్తగా అమర్చాడు. ఆ గది పొడవు 60 అడుగులు. అక్కడ విద్యుద్దీపాలు జాజ్వల్యమానంగా వెలిగిపోతూంటాయి. ఆ గదిలో మళ్లీ రెండు విభాగాలున్నాయి. మొదటిదానిలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే యంత్రాలన్నీ అమర్చారు. రెండవదానిలో జలాంతర్గామి నడిపించే యంత్రాలున్నాయి. అక్కడ నాకో విచిత్రమైన వాసన కొట్టినట్టనిపించింది. గది అంతటా అదేవాసన. కెప్టెన్ నేనువాసన పసిగట్టిన సంగతి గ్రహించి ఇలాగన్నాడు:

"కొంచెం గ్యాస్ ఇవతలికి రావడంలో ఆ విధమైన వాసనబయలు దేరుతూంది. దానివల్ల అంతగా పెద్ద ఇబ్బంది ఏమీ లేదు. ప్రతి రోజూ ప్రొద్దుటివేళ జలాంతర్గామి సముద్రంపైకి వచ్చి కొంత సేపుంటుంది. దానివల్ల జలాంతర్గామి

దులన్నిటిలోను పరిశుభ్రమైన వాయువు ప్రవేశిస్తూంటుంది."

నేనా యంత్రాలన్నీ అతి జాగ్రత్తగా పరిశీలించడం మొదలు పెట్టాను. పిమ్మట కెప్టెన్ ఆ యంత్రాలు పనిచేసే పద్ధతి, వాటివల్ల వచ్చే వేగము మొదలైనవన్నీ నాకు వివరించి చెప్పాడు.

"మొత్తం మీద మీ ఓడ గంటకెన్ని మైళ్ల దాకా పోతుంది?"

"ఇంచుమించుగా 50 మైళ్ల దాకా పోతుంది."

ఈ ప్రశ్న వినగానే నా కెంతో ఆశ్చర్యం వేసింది. విద్యుచ్ఛక్తిచేత ఇంత వేగం వచ్చేటట్లు పని చేయించడమంటే మాటలతో పనిగాదు. అందులో మహా రహస్యమేదో ఉండాలని అనిపించింది. అందుచేత నేనా రహస్యం జోలికి పోదలుచుకోలేదు. తరవాత నేనిలా అన్నాను.

"కెప్టెన్ నీమో! మీరు సాధించిన మహత్కార్యాలన్నీ నేను జాగ్రత్తగా అవగాహన చేసుకొన్నాను. అంతకన్న లోతు రహస్యాలేవీ నాకక్కరలేదు. అబ్రహామ్‌లింకన్‌లో ఉన్నప్పుడు నాకు నాటిలస్ వేగము, దాని స్వరూపము మొదలైనవన్నీ కొంత వరకు బోధపడ్డాయి. అయితే మీరు సాగరగర్భంలో లోపలికెలాగ పోతున్నారో మాత్రం నాకవగాహన కావడంలేదు. మళ్ళీ పైకి ఎలాగ వస్తున్నారోకూడా స్పష్టంగా తెలియడంలేదు. అదీగాక ప్రత్యేకంగా కొంత లోతుకు వెళ్ళి సరిగా అదే లోతులో నిలబడడ మెలాగోకూడా నాకు బోధపడడంలేదు. ఈ ప్రశ్నలన్నీ మిమ్మల్ని అడగవచ్చునో అడగకూడదో తెలియదు. కాని నాకు కలిగిన సందేహాలు మాత్రం ఇవి."

దానిమీద కెప్టెన్ ఇలా అన్నాడు:

"ప్రొఫెసర్! మీరేమంత అనుమానించవలసినదేమీ లేదు. ఈ జన్మలో మీరీ జలాంతర్గామి విడిచిపెట్టి వెళ్ళడమనేది జరగదు. అందుచేత మీ కన్నీ తెలియజేస్తాను. నా గదిలోకి రండి! అక్కడ మీకు నాటిలస్‌ను గురించి కలిగే సందేహాలన్నిటికీ సమాధానం చెబుతాను"

—ఇంకా ఉంది.

★ దూతీ చాతుర్యం ★

(10-వ పేజీ తరువాయి)

వడం భావ్యం కాదు!" అని తరళిక అతని అనేకవిధాలుగా బతిమాలింది.

"నిజంగా ఊరికే ఉత్త పుణ్యానికని పగబట్టిన దానవు నీవే! అయినా నింద అంతా నామీద మోపుతున్నావు: కొంతవరకు ధనగుప్తునిపై ఆమె మనస్సు మళ్ళించిన దానవు నీవే సుమా! ఎంతటి నెరజాణవు నీవు!"

అని అతడామెను గాఢంగా కౌగలించుకోబోయాడు: "ఆహా! ఎంతటి వారు మీరు చివరికిదంతా నామీదికే తెచ్చి పెడుతున్నారా?"

అని ఆమె అతనిని తప్పించుకొని తొందరగా అక్కడినించి పారిపోయింది! అయినా నాగవర్మ తన సంకల్పం విరమించలేదు!

3

తరళిక ఆరాత్రి తన శయ్యాగారం అంతా ఎంతో మనోజ్ఞంగా అలంకరించింది. అటు పిమ్మట స్వీయాలంకరణ కుపక్రమించింది. కావలిస్తే ఆమె కావిషయంలో సాయం చేసే దాసీజనానికేమీ కొరత లేదు. అయినా ఆమెకు వారి అలంకరణ విధానమేమీ నచ్చలేదు. కనుకనే స్వయంగా ఆ అలంకరణ కుపక్రమించింది. ముమ్ముందుగా ఒక రకం చెంగావి చీర ధరించింది. అయితే సరిగంచు కంచుకానికది సరితూగలేదని మరి ఒక చీర కట్టింది. కంచుకం దానికి సరిపోలేదని మరి ఒక కంచుకం ధరించింది.

ముంగురులలో ముత్యాలెంతో సొగసుగా సరిదిద్దింది. మెడలో ముప్పేట ముత్యాల హారాలకు వాటికీ పొత్తు కలసిందా లేదా? అని అద్దంలో ఒక సారి పరిశీలించింది. అటు పిమ్మట నుదుటిపై కస్తూరీ తిలకం సరిదిద్దింది. ఆ తిలకానికి కింది భాగంలో సిందూర చంద్రవంక చిత్రించింది.

అంతలో శృంగారంతీరెలా ఉన్నదో అని ఒక సారి చతురిక నడగాలని సంకల్పించింది. కాని వెంటనే ఆమె నాగవర్మభవంతికి వెళ్ళిన విషయం జ్ఞాపకం వచ్చింది.

పిమ్మట ఆమె ఇంకా తిరిగిరాలేదేమో! అని ఆశ్చర్యపడింది. చతురిక చాలా నెరజాణ అనీ తప్పకుండా నాగవర్మను తనవెంట తోడుకు రాగలదనీ లోలోపల ఎన్నో విధాలు ఉవ్విళ్ళూరింది.

కాని అంతలో ఆమెకు ధనగుప్తుని విషయం జ్ఞాపకం వచ్చింది.

మొదట ధనగుప్తుడు తనభవంతికి వచ్చినప్పుడామె అతని ముఖం చూడడానికి కూడా అంగీకరించలేదు. అయితే ఐశ్వర్యంలో ధనగుప్తునికీ, నాగవర్మకు ఎక్కడా పోలిక లేదు.

ధనగుప్తుడుజ్జయినిలో కోటికి పడగెత్తిన కుబేరుడు: నాగవర్మ అంతటి ఐశ్వర్యవంతుడు కాకపోవచ్చును. కాని శస్త్రశాస్త్రాలలోను, వేణుగానంలోను ఉజ్జయినీ విద్వత్పరిషత్తులలో పేరు మిగిలిన పరసుడు. రూపసి. పైగా తరళిక చిన్నాటికన్నా వలపుగుబాళింప చేసిన నెచ్చెలి. ఆమె ధనగుప్తుని ముఖం చూడడానికి కూడా అంగీకరించక పోవడానికదే కారణం.

అయితే ఆమె పెంపుడు తల్లి ధనగుప్తుని ఐశ్వర్యంపై వల్లమాలిన మమకారం పట్టుకొని వేధించింది. దానితోబాటామెకు నాగవర్మపై ఒకవిధమైన విసుగు, చిరాకుకూడా బయలుదేరాయి.

చిట్టచివర కీవ్యవహారం అంతా ఒక విషమసంధిలో పడింది. వేశ్యమాతకి నాగవర్మ పొసగిట్టలేదు. అతడంతగా ధనవంతుడు కాకపోవడమే దానికొక ప్రధాన కారణమై కూర్చుంది. తరళికకు ధనగుప్తుని పొడగిట్టలేదు. అయితే ఆపత్కాలంలో నాగవర్మనిక కుమ్మంలో అడుగుపెట్టనీయనని పెంపుడుతల్లి గట్టిగా బెదిరించింది. ధనగుప్తునితో కొంచెం జోక్యకలిపితే మరి నాగవర్మ నేమీ అనవని

దూతీ చాతుర్యం

నయానా భయానా నచ్చ చెప్పి చూచింది. చతురిక చేతకూడా కొంతవరకు చెప్పించింది. తరళిక మరి గత్యంతరం లేక మొట్టమొదట ధనగుప్తుని ఎదుట గజ్జెకట్టి నృత్యం చెయ్యడానికి అంగీకరించింది. క్రమక్రమంగా వారిద్దరిమధ్యా కొంచెం దోస్తీకూడా పెరిగింది. అదే సమయంలో నాగవర్మ పద్మపురానికి తరలిపోవడం జరిగింది. అతడీ మధ్యనే తిరిగి ఉజ్జయినీ నగరానికి వచ్చేశాడు.

తరళికకు నాగవర్మ హృదయం కొంచెం తెలియకపోలేదు. అయినా తన అశక్తత, గాఢానురాగము అతనికి తెలియకపోవనీ, అందువల్ల ఆ స్వల్పవిషయం మన్నించక పోడనీ ఆమె నిశ్చయించింది. ఆపైన తరళిక కూడా అతనికనేక విధాలుగా నచ్చచెప్ప గలదనీ అందుచేత అతడు తప్పక వచ్చేయ గలడనీ ఆశించింది.

అలాగలాగ ఝాము రాత్రి గడిచిపోయింది. శయ్యాగృహంలో అగరుధూమ మాలికలామె హృదయంలో చిత్రచిత్రమైన మధురస్వప్నా లల్లడం మొదలుపెట్టాయి. అయినా నాగవర్మ వచ్చే జాడకూడా కనిపించలేదు. పోనీ అంటే చతురిక కూడా తిరిగి రాలేదు.

తరళిక ఇక నిరీక్షించలేక విసిగి వేసారి భవంతి సింహద్వారంలో నిలబడింది. ఎంతసేపు నిలబడినా చివరికి చతురిక కూడా కనిపించలేదు.

క్రమంగా అర్ధరాత్రి అయింది. అంతలో కొంతదూరంలో ఆమె కెదురుగా చతురిక ప్రత్యక్షమైంది. అంతేగాని కనుచూపు మేరలో ఎక్కడా నాగవర్మదర్శనం కాలేదు!

అంతలో చతురిక లోపలికి వచ్చింది. వెంటనే తరళిక ఆమెతో కలిసి శయ్యాగారంలోనికి వెళ్లి ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది:

"ఏమే ఏమైనదే! ఆయన రాలేదేమి? ఇంతసేపాలస్యం అయిందేమి?"

ఇలాంటివే ఇంకా ఎన్నెన్నో ప్రశ్నలొక్కసారిగా కుప్పించింది.

చతురిక నిశ్చలంగా ఆమెవైపు చూచి నెమ్మదిగా "వస్తామన్నారు." అని సమాధానం చెప్పింది.

"ఎప్పుడు?"

"ఎప్పుడో తిన్నగా చెప్పలేదు గాని మొత్తంమీద వస్తామని అన్నారు."

ఆ మాట విని తరళిక ఒక్క నిట్టూర్పు విడిచింది:

"ఇప్పుడెందుచేత రాలేదు!"

"ఎవరో ఆయన మనస్సు పూర్తిగా విరిచివేశారమ్మా!"

"ఎవరున్నారే అలా విరవడానికి?"

అని ఆమె చతురిక వైపొకమారు అతిపరిశీలనగా చూచింది. ఆ క్షణంలో చతురిక వేష వైఖరిలో ఆమెకొక కొత్తవింత గోచరించింది. ఆ వింత చూచేసరికి తరళిక హృదయం భగ్గున మండింది. అయినా ఆ భావం తన హృదయాంతరాళంలోనే నిగ్రహించుకొని, ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి వ్యంగ్యగర్భంగా ప్రశ్నించింది.

"చతురికా! నీవు నిజంగా నాగవర్మ భవంతికి వెళ్ళావా?"

"అదేమే! అలాగడుగుతున్నావు? ఇంతసేపటినుంచీ నేనక్కడనే ఉన్నానుగా!"

"ఏమో లే! నీ కంటిరెప్పల కాటుక పూర్తిగా చెరిగిపోయింది! పెదవుల పై లత్తుక ఆనవాలైనా కనిపించడంలేదు. ఒళ్లంతా పులకరించింది. కొత్తచీర కుచ్చెళ్లన్నీ బాగా నలిగిపోయాయి. ఏదో దుర్వార్త విని వెంటనే సచేలస్నానం చెయ్యడానికెక్కడికో వెళ్లి ఉంటావు! అంతే! సందేహమేమీ లేదు. నీవక్కడికి వెళ్లనేలేదు."

చతురిక ఆ మాటలు విని నిలువునా వణికిపోయింది. ఒక్కసారి తన ఒళ్లంతా పరిశీలించి చూచుకొన్నది. ఆమె చెప్పినవన్నీ నిజమే అని గ్రహించింది. ఎంతో సిగ్గుపడింది. అయినా పైపైకంలో కుంభనగా సమాధానం ఇచ్చింది:

"ఇంత శ్రమపడి, చిమ్మచీకటిలో పడి నేనక్కడికి వెడితే వెళ్లనేలేదంటావేమే!"

"లేదు! లేదు! ముమ్మాటికీ నీవానీచుడు, ఆ కఠినుడు నాగవర్మ భవంతికి పోనేలేదు! స్నానం చెయ్యడానికే వెళ్లావు! ముమ్మాటికీ అంతే! పో! నా ఎదుట నిలబడకు! పో!"

అని తరళిక రెండు చేతులతోను కళ్లు కప్పుకొని అదేపనిగా వెక్కి వెక్కి ఏడ్చింది. తరవాత తలపైకెత్తి "నమ్మి ప్రాణం ఇచ్చినందుకు కెంతటి స్వామిద్రోహం చేశావే!" అన్నది. కాని ఆమెకెదురుగా మరి చతురిక కనబడలేదు!

ఆమె అంతకు పూర్వమే అక్కడినించి పారిపోయింది! ★


కామన్వెల్తు పుట్టుపూర్వోత్తరాలు

(12 వ పేజీ తరువాయి)

వరకూ ఉన్న భారతీయ ప్రాతినిధ్యాన్ని రద్దు చేశాడు. భారతీయులపట్ల తమ విధానము ఆంతరంగిక విషయమనీ, అందులో జోక్యం చేసుకోడానికి ఐక్యరాజ్య సమితికి గాని, మరే దేశానికి గాని హక్కులేదని డా॥ మలాన్ వాదించాడు. ఆనాటినుంచీ భారత, దక్షిణాఫ్రికా దేశాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. దక్షిణాఫ్రికాకు జాతుల సమానత్వాన్ని గూర్చి ఐక్యరాజ్య సమితి గాని, కామన్వెల్తు గాని ఇంతవరకూ నచ్చ చెప్పలేక పోయాయి.


ఇక పాకిస్తాన్. భారత దేశం విభజింపబడిన నాటినుంచీ పాకిస్తాన్ భారత యూనియన్ పట్ల అకారణ శత్రుత్వం ప్రదర్శిస్తోంది. ఇస్లాంమత ప్రాతిపదికపై స్థాపింపబడిన పాకిస్తాన్ మతాతీత రాజ్యమైన భారత దేశాన్ని శత్రువుగా పరిగణిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన తన ప్రజలను ఏదో విధంగా మభ్య పెట్టి తన అసమర్థతను సహించి ఉండేట్టు చేయడానికై, వారి దృష్టిని భారతదేశం మీదికి మరల్చి, ఎన్నటికైనా భారతదేశం నుండి తమకు ముప్పు తప్పదని ప్రచారం చేస్తోంది. కాశ్మీర్ పై దురాక్రమణ ప్రారంభించి భారత దేశమే దురాక్రమణ చేసిందని గగ్గోలు లేవదీసింది. అంతర్జాతీయ రాజకీయాలలో కూడా అనేక సందర్భాలలో భారత దేశానికి వ్యతిరేకమైన పంథా అవలంబించి అమెరికన్ సహాయంకోసం గాను సైనిక కూటాలలో చేరింది. ఈ రీతిగా దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ల వైఖరి కామన్వెల్తు ఆశయాలకే భంగకరంగా పరిణమించింది. ఇది చాలా శోచనీయమైన విషయం. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



పూలగుత్తులు

ఫోటో: కె. గురుమూర్తి—మద్రాసు.


ఆరోగ్యవంతులైన పిల్లలు ప్రతిరోజూ
లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు
—అది ప్రతిదిన*మలినములోని క్రిములను కడిగివేయును!
* మనకు ప్రతిదినం తార్కపడే మామూలు మురికిలో క్రిములున్నాయి.
మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదం వుంది.
అందుచేతనే చాలామంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్
సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుట
వల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు — అది
.ఆరోగ్యవంతమైన హాయిని గలిగించును.
LIFEBUOY SOAP
LIFEBUOY
SOAP
LIFEBUOY SOAP